VISALAANDHRA, VIJAYAWADA - 4. Phone 376
* * * Regd No. H-203

విశాలాంధ్ర
నవంబరు 1 నుండి
చందావివరాలు
ఏజెంటుద్వారా పోస్టుద్వారా
సంవత్సరం రు 31_00 34_00
6 మాసాలు 15_50 17_00
3 మాసాలు 7_75 8_50
1 మాసం 2_65 2_90

విశాలాంధ్ర

701815

సంపుటి 14 సంచిక 217] విజయవాడ • 23-10-1964 శుక్రవారం [6 పేజీలు 7 పై

జొన్నల కొనుగోలుకు మహారాష్ట్ర నిర్ణయం

పునరుద్ఘాటిస్తూ ముఖ్యమంత్రి నాయక్ ప్రకటన

ఔరంగాబాద్, అక్టోబరు 21

క్వింటాల్ రు. 45 ల చొప్పున వచ్చే పంటకాలంలో జొన్నలను మొత్తం ఆరున్నర లక్షల టన్నులను కొనుగోలు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇదివరకు చేసిన నిర్ణయంలోనూ, ధరల నిర్ణయంలోనూ ఎట్టి మార్పు లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నాయక్ నేడిక్కడ మంత్రిమండలి సమావేశం అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన జొన్నల ధరలకంటే కేంద్రప్రభుత్వం ప్రకటించిన ధర తక్కువగా ఉందనీ, అందుచేత ఎట్టి గందరగోళానికి ఆస్కారం లేకుండా ఈ ప్రకటన చేస్తున్నానని శ్రీ నాయక్ అన్నారు.

రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వాలు ప్రకటించిన జొన్నలధరల్లో ఉన్న ఈ తేడా వలన రైతుల లోను, వర్తకుల్లోను గందరగోళం రావచ్చుననీ, కేంద్ర ప్రభుత్వం తమ ధర ప్రకటించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంవద్దకు వెళ్లి రాష్ట్రం ప్రకటించిన ధరే ఈ సంవత్సరం ఆఖరువరకు అమలులో ఉండేటట్టు అంగీకరింపజేసిందనీ అన్నారు.

ఈ పంటకాలంనుండి జొన్నలను ప్రభుత్వమే గుత్తపద్ధతిని కొనదలచుకుందని, క్వింటాల్ రు. 45 ల చొప్పున 6½ లక్షల టన్నుల జొన్నలు కొనదలిచామని అన్నారు.

వర్తక సంఘాధ్యక్షుని ప్రకటన

కేంద్ర ప్రభుత్వం, బియ్యం గోధుమలకు నిర్ణయించిన ధర సమంజసంగానే ఉందనీ, జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, వస్తుధాన్యాల ధరలు మాత్రం తక్కువగా ఉన్నాయనీ, మహారాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ జొన్నలు రు 45చొప్పున నిర్ణయించినధరే సమంజసంగా ఉందనీ అఖిలభారత ఆహార ధాన్యాల వర్తకుల సంఘాధ్యక్షుడు శ్రీ హసమ్ ప్రేమ్‌జీ ఒక ప్రకటన చేశారు.

మధ్య కొంత ధర వెసులుబాటు చూపకపోవడంవలన కేంద్ర ప్రభుత్వ ధరలు సక్రమంగా లేవనీ అన్నారు. కనీస ధరపై రు 1-8-0 మాత్రమే మార్జిన్ యివ్వడంవలన ఆ తరువాత ధరలు ఎల్లాగూ పెరిగే అవకాశం ఉండదని రైతాంగమంతా ఒకేసారి మార్కెట్‌కు తమ సరుకును తోల్తారనీ, ఇందువలన ఆహార ఆర్థిక పరిస్థితుల్లో పెద్ద కల్లోలం కలుగవచ్చుననీ అన్నారు. నిల్వచేయడం, పంపకం చేయడంలో కూడా పెద్దగందరగోళం ఏర్పడుతుందని అన్నారు.

ఇందువలన వర్తకులు ఎవరూ ఆహార ధాన్యాల వర్తకం చేయడానికి ముందుకురారనీ, చివరకు ఆహారధాన్యాలను ప్రభుత్వ కార్పొరేషన్‌ద్వారానే అమ్మకం, కొనుగోలుజరుపవలసి రావచ్చుననీ అన్నారు

దేశంలో అనేకమంది ఆహారధాన్యాల వర్తకులపై కేసులుపెట్టారనీ ఈవిషయమై ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి పరిశీలించాలనీ అన్నారు.

మాస్కోకు ఫ్రెంచిపార్టీ ప్రతినిధి వర్గం

సోవియట్ నాయకత్వం మార్పు విషయమై పూర్తి వివరాల కోసం

పారిస్, అక్టోబర్ 21

సోవియట్ యూనియన్ నాయకత్వంలో వచ్చిన తాజా మార్పుల గురించి తమకు అదనపు వివరాలు తెలియజేయవలసిందిగా ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ పొలిట్ బ్యూరో నేడు సోవియట్ కమ్యూనిస్టుపార్టీని కోరింది.

ఇందుకోసం తాము ఒక ప్రతినిధి వర్గాన్ని మాస్కో పంప నిశ్చయించామని కూడా వారు తెలియజేశారు.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ అమలు జరిపిన మార్పుల గురించి, అవి యే పద్ధతులో, ఎలాంటి పరిస్థితిలో జరిగినదీ పూర్తి సమాచారం, అవసరమైన వివరణలు తెలుసుకో గోరుతున్నాం, అని బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో వుంది.

మాస్కో లేఖ

సోవియట్ నాయకత్వ మార్పులపై మాస్కోలోని న్యూఏజ్ విలేకరి కథనం.

(2 వ పేజీ చూడండి)

శ్రీమతి సిరిమావో ఢిల్లీ ఆగమనం

ప్రధాని శాస్త్రి ప్రభృతుల ఘన స్వాగతం

న్యూఢిల్లీ, అక్టోబరు 22

సింహళ ప్రధానమంత్రి శ్రీమతి సిరిమావో లండన్‌నుండి నేడిక్కడికి చేరుకున్నారు.

భారత ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి, విదేశాంగమంత్రి సర్దార్ స్వరణ సింగ్ తదితర మంత్రివర్గ సభ్యులూ, విదేశీ రాయబారులూ, ఉన్నతాధికారులూ ఆమెకు విమానాశ్రయంలో స్వాగత మిచ్చారు. వీరుగాక అశేష ప్రజానీకం శ్రీమతి సిరిమావోకు స్వాగతమివ్వడానికి విమానాశ్రయానికి వచ్చారు.

సింహళ రాజకీయ వర్గాల ఆసక్తి

కొలంబో, అక్టోబరు 22

శ్రీమతి సిరిమావో ఇక్కడికి చేరడంతోనే సింహళంలోని దాదాపు 10 లక్షలమంది భారతీయుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యపై భారత ప్రధానితో ఆమె చర్చలు ఏ మేరకు ఫలప్రద మౌతాయా అని ఇక్కడ రాజకీయ వర్గాలవారు, ఆసక్తితో ఊహాగానాలు సాగిస్తున్నారు.

సింహళ భారతీయుల సమస్యను పార్టీ విధానాలతో నిమిత్తం లేకుండా సింహళమంతా జాతీయ సమస్యగా భావిస్తూవుంది.

"శ్రీమతి బండార నాయకే జాతి మొత్తం యొక్క ఆశలను సానుభూతిని తనవెంట

(మిగతా 6 వ పేజీలో)



మీకెంతో ప్రియమైన పనామాకు సంబంధించిన సంగతులు

1 హాయినిగొలిపే పొగనిచ్చుటకు ఏరి కోరి కలిపిన వర్జీనియా పొగాకుల మిశ్రమమే మీ పనామా !

2 ఆ తరగతి బ్రాండ్ల అమ్మకంలో అగ్రస్థానం అందుకొని భారత దేశమందంతటా ప్రజాదరణతో పేరుపొందినది మీ పనామా

3 దేశములో ఎక్కువగా వాల భాగములందు వాడబడేది మీ పనామా.

4 ఈనాడు ప్రాముఖ్యతకు వచ్చిన 20 సిగరెట్లుండే ప్యాకెట్లను ఎన్నో ఏండ్లక్రితమే అమలులోనికి తెచ్చిన మొట్టమొదటి బ్రాండ్ మీ పనామా.

ధూమపానమునకు, బహూకరించుటకు మంచి ఆహ్లాదకరమైనవి పనామా

గోల్డెన్ టొబాకో కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి - 56.
భారతదేశమందు ఇట్టి పరిశ్రమల్లో పెద్ద స్వదేశీయ సంస్థ
GT. (P) 635 A Tl. Greens' Advig.



నేడే చూడండి
(సాయంత్రం 6 గం॥ ఆటతో ప్రారంభం)

భరణీ పిక్చర్స్ వారి
వివాహ బంధం
నిర్మాత, దర్శకుడు: రామకృష్ణ

కథ: వి. పిచ్చేశ్వరరావు: పాటలరచన: సి. నారాయణరెడ్డి: సంగీతం: M.B. శ్రీనివాస్: సంగీతపర్యవేక్షణ: శ్రీమతి భానుమతి
కళ: రాజేంద్రకుమార్: ఛాయ: అన్నయ్య: ఎడిటింగ్: M.V. రాజన్: పాటలు, రీరికార్డింగ్. P.V. కోటేశ్వరరావు (భరణి)

విశాలాంధ్ర

ఫాసిస్టు కిరాతకత్వం

తూర్పు పాకిస్తాన్‌లో రాష్ట్రవ్యాపితంగా సమ్మె చేస్తున్న జనపనార కార్మికులపై మిల్లుయజమానులు, పోలీసులు కలిసి జరిపిన హింసాకాండ అత్యంత అమానుషమైనది.

ఖుల్నా పట్టణసమీపంలో జరిగిన ఈ హింసాకాండలో మూడు లేక 4 వందలమంది కార్మికులు చనిపోయారని తూర్పు పాకిస్తాన్ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు శ్రీ ఫైజ్ అహ్మద్ ప్రకటించారు.

ఈ హింసాకాండ జరిగినతీరు మరింత దారుణంగా ఉంది

మిల్లు యజమానుల ప్రోత్సాహంతో 2 వేల మంది రౌడీలు, కత్తులు, ఈటెలు ధరించి, మిల్లు ప్రాంతంలో ఉన్న కార్మికులపైన నివాస గృహాలలో ఉన్నవారిపైన దాడి చేశారు ఇదొక ఉద్దేశ పూర్వకంగా జరిగిన హత్యాకాండ తప్ప మరొకటి కాదు

తూర్పు పాకిస్తాన్‌లోని 90 వేల మంది జనపనార కార్మికులు ప్రభుత్వ నిషేధాజ్ఞలకు నిరసనగా కాలనిర్ణయం లేకుండా సమ్మె చేస్తున్నారు ఆ సమ్మెను భగ్నం చేసేందుకే మిల్లు యజమానులు, పోలీసుల మద్దతులో ఇట్టి హత్యాకాండకు తలపడ్డారు.

అక్టోబరు 12, 13 తేదీలలో జరిగిన ఈ దారుణం బాహ్యప్రపంచానికి తెలియటానికే దాదాపు పదిరోజులు పట్టిందంటేనే పాకిస్తాన్‌లో ఎంతటి క్రూర నిరంకుశత్వం తాండవిస్తున్నదో బోధపడగలదు.

ఈ హత్యాకాండకు యజమానులు ఎంతో కాలం ముందునుండే సన్నాహాలు చేశారనికూడా కార్మిక నాయకుడు శ్రీ ఫైజ్ అహమ్మద్ తనప్రకటనలో తెలియజేశారు. ఈ దారుణ హత్యాకాండపై ప్రభుత్వం వెన్వెంటనే న్యాయవిచారణను జరిపించాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోని పక్షంలో ఈ హత్యాకాండ విషయమై అంతర్జాతీయ కార్మిక సంస్థకు తాను ఫిర్యాదు చేయగలనని కూడా ఆయన స్పష్టంచేశారు

కార్మికవర్గం పైననే కాదు, యావత్తు ప్రజానీకం పైననే పాకిస్తాన్ ప్రభుత్వం నేడు దమననీతిని అవలంబిస్తున్నది.

తమకు న్యాయమైన వేతనాలు ఇవ్వాలని తదితర కనీస సౌకర్యాలు కల్పించాలనీ, తూర్పు పాకిస్తాన్‌లోని ఉపాధ్యాయులు నెలరోజుల నుండీ రాష్ట్రవ్యాపితంగా సమ్మె చేస్తున్నారు ఈ సమ్మెలో భాగంగా తూర్పుపాకిస్తాన్ గవర్నర్ ఇంటి ఎదుట ఉపాధ్యాయులు వంతులవారీగా నిరాహార దీక్ష సాగిస్తున్నారు.

ఒక్క తూర్పు పాకిస్తాన్‌లోనే కాదు, పాకిస్తాన్ అంతటాకూడా కార్మికవర్గంలోనూ, ప్రజలలోనూ తీవ్రమైన అసంతృప్తి రగుల్కొంటున్నది.

పశ్చిమ పాకిస్తాన్‌లోని 4 లక్షల మంది రవాణా కార్మికులు కనీస కోర్కెల సాధనకై నవంబరు 15 నుండి సమ్మెచేయనున్నట్లునోటీసుఇచ్చారు. పత్రికలపై ప్రభుత్వం విధించిన నిర్బంధాలకు నిరసనగా పాత్రికేయులంతా నల్లబ్యాడ్జిలతో ఆఫీసులకు వెళ్లాలని నిర్ణయించారు.

ప్రభుత్వాన్ని ఏ మాత్రం విమర్శిస్తాయనే అనుమానమున్నా అట్టిపత్రికలపైన పాకిస్తాన్ ప్రభుత్వం విపరీతమైన నిషేధాలను విధిస్తున్నది. అభ్యుదయకర ధోరణిని ప్రదర్శించే పెక్కు పత్రికలపై సెన్సార్‌షిప్ నిబంధనలను విధించటమో, లేక పెద్ద ఎత్తున ధరావత్తులను కోరటమో మామూలైంది.

భారతదేశంతో తయ్యానికి కాలుదువ్వే వైఖరిని పాకిస్తాను అవలంబించటం మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. కాశ్మీర్‌లోని హజరత్‌బాల్ మసీదులోని పవిత్ర కేశ అపహరణ ఉదంతాన్ని అవకాశంగా తీసుకొని తూర్పుపాకిస్తాన్‌లోని మైనారిటీ ప్రజలపై ఆ ప్రభుత్వం జరిపిన అత్యాచారాలు వర్ణనాతీతం. ఈ హింసాకాండను తట్టుకోలేక లక్షలాది కాందిశీకులు భారతదేశానికి తరలివచ్చారు

కాశ్మీర్ సరిహద్దులలో అనునిత్యమూ, పాకిస్తాన్ దుండగులు యుద్ధవిరమణ రేఖను ఉల్లంఘించి భారతీయపౌరులపైనా గ్రామాలపైనా దాడులు జరుపుతూనే ఉన్నారు.

భారతదేశంపై తయ్యానికి కాలుదువ్వే విదేశాంగ విధానానికి, తమ దేశ ప్రజలపైనా, కార్మికులపైనా నిరంకుశ హత్యాకాండ కొనసాగించే పాకిస్తాన్ ప్రభుత్వ దేశీయ విధానాలకు అవినాభావ సంబంధమున్నది

పాకిస్తాన్‌లో నేడు ఫాసిస్టు నిరంకుశత్వం తాండవిస్తున్నది ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి తీవ్రరూపం ధరిస్తున్నది.

త్వరలోనే పాకిస్తాన్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి

ప్రస్తుత అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌కు పోటీగా ఫాతిమాజిన్నా అధ్యక్షపదవికి పోటీ చేస్తున్నది పాకిస్తాన్‌లోని ప్రతిపక్షాలవారందరూ ఫాతిమాజిన్నా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు.

తాము ఒక అగ్నిపర్వతంపై కూర్చున్నామని, అది ఏక్షణంలోనైనా బద్దలు కావచ్చునని భయపడే, పాకిస్తాన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, అతని ప్రభుత్వం, అతి క్రూరమైన ఫాసిస్టు హత్యాకాండకు తలపడ్డట్లు తోస్తున్నది. తూర్పుపాకిస్తాన్ కార్మికులపై జరిగిన అమానుష దాడు ఇత్వం అందుకొక చిహ్నం.

పాకిస్తాన్ కార్మికవర్గంపై జరిగిన ఈ హత్యాకాండను భారత దేశంలోని కార్మికవర్గమూ, ప్రజాతంత్రవాదులందరూ తీవ్రంగా నిరసించి తీరుతారు.

ప్రస్తుత భయానక పరిస్థితులనుండి బైటపడేందుకు పాకిస్తాన్ ప్రజానీకం జరిపే పోరాటాలకు భారత ప్రజల సానుభూతి సహకారాలు లభించి తీరుతాయి.

మాస్కో లేఖ:

సమష్టి నాయకత్వ సూత్రపరిరక్షణకే నికిటా కృశ్చేవ్ పదవీ విరమణ

మూలవిధానాలలో ఎట్టిమార్పూ లేదని మాస్కోలోని న్యూఏజ్ విలేకరి కథనం

మాస్కో, అక్టోబరు 21

"సమష్టి నాయకత్వ సూత్రానికి కొన్ని సందర్భాలలో జరిగిన ఉల్లంఘనలు, వార్ధక్యం, హెచ్చు బాధ్యతల కేంద్రీకరణవల్ల జరిగిన కొన్ని పొరపాట్లే కృశ్చేవ్ రాజీనామాకు కారణం మూల విధానాలలో ఎట్టిమార్పూలేదు పిడుగుపాటి వంటి కృశ్చేవ్ నిష్క్రమణ వార్తను మాస్కో పౌరులు ప్రశాంతంగా స్వీకరించారు కాని అందరి ముఖాలలోనూ ఎంతో కొంత విచారం కనిపించింది "ముసలివాడు ఇక పెన్షన్ తీసుకుంటాడు" అనే వ్యాఖ్య ఎక్కువమంది నోటినుండి నేను విన్నాను" అని మాస్కోలోని న్యూఏజ్ విలేకరి, నాయకత్వపు మార్పులపై పంపిన ఈ క్రింది లేఖలో తెలియజేశాడు. న్యూఏజ్ విలేకరి ఇలా వ్రాస్తున్నాడు:

గడచిన బుధవారమంతా మాస్కోనగరం రకరకాల వదంతులతో అట్టుడికిపోయింది విస్మయజనకమైన పరిణామాలేవో సంభవించబోతున్న సూచనలు స్పష్టంగా కానవచ్చాయి.

ఎట్టకేలకు, గురువారం అర్ధరాత్రి సమయాన, అధికార పదవులనుంచి కృశ్చేవ్ నిష్క్రమణ వార్తను "టాస్" అధికారరీత్యా ప్రకటించింది.

"పాపం! ముసలివాడు పదవులనుంచి తప్పుకొని, పింఛను పుచ్చుకొన్నాడు - ఇదీ మాస్కో నగర వీధులలో సామాన్య పౌరుల నోటినుంచి సాధారణంగా నాకు విన్పించిన వ్యాఖ్య.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ బుధవారంనాడు సమావేశమైంది. అనారోగ్య కారణాలవల్ల, వార్ధక్యంవల్ల తాను అధికార పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు కృశ్చేవ్ చేసిన ప్రతిపాదనను కేంద్ర కమిటీ పరిశీలించి, ఆమోదించినదని 'టాస్' వార్తాసంస్థ జారీ చేసిన అధికార ప్రకటన వివరించింది.

గత సంవత్సరంలో కృశ్చేవ్ స్వయంగా అనేకసార్లు తన పదవీ విరమణ గురించి బహిరంగంగా ప్రస్తావించిన సంగతిని ఈ సందర్భంలో ఇక్కడి రాజకీయ పరిశీలకులు జ్ఞాపకం చేస్తున్నారు. నాకు గుర్తున్నంతవరకు, 18 నెలల క్రితమే, ఒక యువజన సభలో కృశ్చేవ్ ప్రసంగిస్తూ తన పదవీ విరమణ సమస్యను ప్రస్తావించాడు.

పోలిష్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి గోముల్కా గత శనివారంనాడు వార్సా సభలో ప్రసంగిస్తూ, సంవత్సరం క్రితమే కృశ్చేవ్ తాను రాజీనామా చేయాలని తలపోస్తున్నట్లు తనతో చెప్పిన సంగతిని పేర్కొన్నారు. "సోవియట్ విధానంలో ఎట్టి మార్పు వుండబోదు, ముఖ్యవిషయం ఇదే" అనికూడా గోముల్కా ఆ సభలో వక్కాణించారు.

కృశ్చేవ్ పాత్ర

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ 20 వ మహాసభ అనంతరం దేశంలో వచ్చిన మహత్తర పరిణామాలలో కృశ్చేవ్ నాయకత్వ పాత్ర వహించారని, ఇక్కడ ప్రజల్లో ఎవరిని కదిలించినా, ప్రశంసిస్తున్నారు. అంతర్జాతీయ రంగంలో ఆయన నిర్వహించినపాత్ర, సుస్థిరశాంతికోసం ఆయన సాగించిన పోరాటం, శాంతియుత సహజీవనం, అంతర్జాతీయ సహకారం, నిరాయుధీకరణ ప్రాతిపదికపై అంతర్జాతీయ ఉద్రిక్తత సడలింపునకు ఆయన సలిపిన అవిశ్రాంతకృషి, కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాల పాత్రను గురించిన ఆయన అవగాహన, సామ్రాజ్య వ్యతిరేక, జాతీయ విమోచనోద్యమాలకు ఆయన చేసిన సేవ — ఇవన్నీ గత దశాబ్ది చరిత్రలో స్థిరపడిన చిరస్మరణీయమైన అంశాలు.

వార్ధక్య ప్రభావం

అయితే వార్ధక్యం వల్లనూ, తలకుమించిన బాధ్యతలు నెత్తిన పడడంవల్లనూ అత్యంత బాధ్యతాయుతమైన రెండు పదవుల - పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రధాన మంత్రి బాధ్యతల - నిర్వహణ భారంవల్లను కృశ్చేవ్‌లో అలసట, మతి మరుపువంటి దౌర్బల్యాలు ప్రవేశించాయని తెలియవస్తున్నది. అంతే కాదు, సమష్టి నాయకత్వ సూత్రం ఉల్లంఘింపబడిన ఉదంతాలు కూడా కొన్నికలవని అంటున్నారు. ఇటీవల కాలంలో, ఆత్మవిశ్వాసం మితిమీరి ఇతరులతో సంప్రతించకుండానే వ్యక్తిగత నిర్ణయాలు చేయడం, వ్యక్తిగత దౌత్య పద్ధతిని మితిమీరిన రీతిలో పాటించటం వంటివి జరిగినట్లు తెలియవస్తున్నది. కొంత మంది ప్రచారకులు వ్యక్తిగత పొగడ్తలు ఆరాధనలధోరణినిచేపట్టినట్లు చెప్పబడుతున్నది.

స్టాలిన్ వ్యక్తిపూజ రాజ్యమేలిన రోజుల్లో జరిగిన దోషాలతో పోల్చితే, ఇవి బహు స్వల్పమైనవేకావచ్చు. అయినా, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఈ స్వల్ప దోషాలనుకూడా మొగ్గలోనే త్రుంచివేయాలని సంకల్పించింది. వ్యక్తిగత ఆరాధనకు, సమష్టి బాధ్యత, సమష్టి నాయకత్వసూత్ర అతిక్రమణకు సోవియట్ యూనియన్‌లో ఏ మాత్రం తావు లేదని సోవియట్ పార్టీ మరొకసారి స్పష్టం చేసింది.

పార్టీ నిర్వహణలో లెనినిస్టు సూత్రాలకు సోవియట్ పార్టీ ఖచ్చితంగా కట్టుబడి పని చేయడానికి కేంద్రకమిటీ కృతనిశ్చయంతో వున్నదని, ప్రజాస్వామిక సూత్రాలు చాలా బలవత్తరంగా పనిచేస్తున్నాయని దీనిని బట్టి మనం గ్రహించవచ్చు.

సమష్టి నాయకత్వ సూత్రాల విషయంలో ఈ మధ్య వక్కాణింపు కొద్దిగా తగ్గింది, దానిని ఇప్పుడు పునరుద్ఘాటిస్తున్నారు. వ్యక్తి ఎత గొప్పవాడైనా, పార్టీ తనిఖీకి లోబడి పనిచేయాలని, విమర్శకు అతీతుడేమీ కాదనీ స్పష్టం చేస్తున్నారు.

శనివారం 'ప్రావ్దా' పత్రిక సంపాదకీయ వ్యాసం ఇదే విషయాన్ని స్పష్టీకరించింది. (ఈ వ్యాసం పూర్తి పాఠాన్ని నిన్న వే 'విశాలాంధ్ర'లో ప్రచురించాము-సం)

దీనితోపాటు, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 20, 21, 22 మహాసభలు రూపొందించిన విధానాలను ఖచ్చితంగా అమలు జరపడానికి తాము సంకల్పించినట్లు గత కొంది రోజులలో 'ప్రావ్దా' సంపాదకీయ వ్యాసంలోను, నాయకుల ప్రసంగాలలోను పదేపదే ఉద్ఘాటిస్తున్న సంగతి గమనార్హం.

సోవియట్ యూనియన్ శాంతి విధానంలోగాని, శాంతియుత సహజీవన, సహకార విధానంలోగాని, యుద్ధనివారణ విధానంలోగాని, సామ్రాజ్య వ్యతిరేక, వలస వ్యతిరేక శక్తులకు సహాయంచేసే విధానంలోగాని ఎట్టి మార్పువుండబోదని ఘంటాపథంగాచెబుతున్నారు

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు చెందిన కొత్తగా స్వాతంత్ర్యం పొంది, ప్రవర్ధిల్లుతున్న దేశాలతో స్నేహ, సహకార, సంబంధాలను సోవియట్ యూనియన్ ఇక ముందుకూడా పెంపొందించుకొంటూనే వుంటుంది. శుక్రవారం నాడు, క్యూబా అధ్యక్షుని గౌరవార్థం జరిగిన విందు సందర్భంలో సోవియట్ విదేశాంగశాఖ ఉపమంత్రి కుజ్నెత్సోవ్ భారత తాత్కాలిక రాయబారితో ముచ్చటిస్తూ, భారతదేశం పట్ల సోవియట్ వైఖరిలో ఎలాంటి మార్పు వుండదని స్పష్టంచేశారు. ఢిల్లీలోని సోవియట్ రాయబారి బెనిడిక్టోవ్‌ను ఆ విందులో నేను కలుసుకొనగా, ఆయన కూడా అదే విషయం పునరుద్ఘాటించారు.

సోవియట్ నాయకత్వంలో మార్పులు వచ్చిన వెంటనే, ఈవిందు జరగటవల్ల ఇందులో పాల్గొన్న సోవియట్ అధికారులకు విదేశీ ప్రతినిధులకు, పరిశీలకులకు, పాత్రికేయులకు మధ్య ఆసక్తిదాయకమైన ఇష్టాగోష్టి చర్చలు జరిగాయి.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అనేకమందిని స్వయంగా కలుసుకొని మాట్లాడేఅవకాశం నాకు లభించింది. సోవియట్ నాయకత్వంలో మార్పు చైనా నాయకత్వానికి విజయంగా వ్యాఖ్యానించడం ఏ మాత్రం సరి కాదని వారంతా స్పష్టం చేశారు.

ఇది చైనా నాయకత్వానికి విజయం ఎలా అవుతుంది? సిద్ధాంత సమస్యలపైగాని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐకమత్యం విషయంలోగాని సోవియట్ పార్టీ వైఖరి ఈషన్మాత్రం కూడా మారబోవడం లేదే అని సోవియట్ పార్టీ కేంద్ర కమిటీసభ్యులు ఉద్ఘాటించారు.

నాయకత్వ మార్పుల అనంతరం 'ప్రావ్దా'లో చైనా నాయకులను నిశితంగా విమర్శిస్తూ వెలువడిన విదేశ కమ్యూనిస్టుపార్టీల ప్రకటనలను వారు ఉదహరించారు. ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల మహాసభ ఏర్పాటు విషయంలో కూడా మా వైఖరి ఏ మాత్రం మారలేదని వారు స్పష్టం చేశారు.

చైనా వ్యక్తిపూజ ధోరణికి వ్యతిరేకంగా లెనినిస్టు పద్ధతులను ఖచ్చితంగా అమలు జరపటానికి, ప్రజా జీవితాన్ని మరింత ప్రజాతంత్రమొనర్చడానికి సోవియట్ పార్టీ తన పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయబోతున్నది. ఈనాడు చైనా నాయకులు ప్రచారం చేస్తున్న విధానాలకు ఇవన్నీ పూర్తిగా వ్యతిరేకమైనవి.

సోవియట్ యూనియన్ పార్టీ 20వ, 22వ మహాసభల పేరు చెవిటేనే, చైనా నాయకులు మండి పడటం మనం చూస్తున్నాము కాని సోవియట్‌పార్టీఇప్పుడు ఆ మహాసభల ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటిస్తున్నది.

సోవియట్ విధానాలలో మార్పువుండదు అయితే ఆ విధానాలను అమలుజరపడంలో అక్కడక్కడ కొద్దికొద్దిమార్పులు సంభవం కావచ్చు. పోకడ, పద్ధతులలో మార్పులు సంభవంకావచ్చు. విధానాలను అమలుజరపటంలో, మరింత సమయోచితదృష్టి, చర్యలలో వ్యాపారాలలో మరింత హుందాతనం ప్రదర్శితం కావచ్చు.

చైనా నాయకులు తమ విధానాల దుష్ఫలితాలను గ్రహించి, తమ విచ్ఛిన్నకర విధానాలకు స్వస్తిచెప్పి, తమ ధోరణిని మార్చుకొంటే మంచిదే వారు వెనకడుగు వేయడానికి ఇప్పుడొక మంచి అవకాశం వారికి లభిస్తున్నది. అయితే, పెకింగ్ ధోరణి మారే సూచనలు కన్పించటం లేదు. వారు ఆత్మపరీక్ష జరుపటంబట్టి, ఉద్రిక్తతను రెచ్చగొట్టే తమ విధానాన్ని వారు విరమించుకోబోరని తేలుతున్నది. గోతులు తవ్వడం, సోవియట్ యూనియన్‌ను అవకాశం చిక్కినప్పుడల్లా ఇరకాటంలోపెట్ట ప్రయత్నించడం వారు మానవేలేదు.

మధ్యరకం ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యం

నీటిపారుదల, విద్యుచ్ఛక్తి సమస్యలపై గోష్ఠి నిర్ణయాలు

తిరువనంతపురం, అక్టోబరు 22

వ్యవసాయోత్పత్తిని పెంచడానికి మధ్యరకం నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని ఇక్కడ మూడురోజులుగా జరిగిన నీటిపారుదల, విద్యుచ్ఛక్తి గోష్ఠిలో నిర్ణయించారు.

కేంద్ర నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు ఈ విషయాన్ని నేడిక్కడ పత్రికల వారికి తెలియజేశారు. ఆహారధాన్యాల కొరతను ఏ విధంగా తీర్చాలా అన్న సమస్య తమ గోష్ఠిలో ప్రధానస్థానం వహించిందని అన్నారు.

మధ్యరకం ప్రాజెక్టుల నిర్మాణంలో వస్తున్న అవరోధాలు ఏమిటో, ఆర్థిక ఇబ్బందులు ఏమిటో కేంద్రానికి తెలుపవలసిందిగా తాము రాష్ట్ర ప్రభుత్వాలను కోరినట్లు డాక్టర్ కె. ఎల్. రావు అన్నారు.

సత్వర ఫలితాలను ఇస్తాయి గనుక మధ్యరకం ప్రాజెక్టులకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ఈ నిర్ణయంవలన కేరళ రాష్ట్రంలో కల్లడ ప్రాజెక్టుతప్ప మిగిలిన అన్ని ప్రాజెక్టుల నిర్మాణం త్వరితమౌతుందని అన్నారు.

గ్రామీణ విద్యుత్ సరఫరా

గ్రామీణ విద్యుత్ సరఫరాను త్వరితం చేయాలన్నది కూడా గోష్ఠిలో చేసిన మరో నిర్ణయమని డాక్టర్ రావు తెలియజేశారు

మహాత్మాగాంధి శతజయంతినాటికి అంటే 1969 అక్టోబరు నాటికి - మొత్తం 10 కోట్ల యకరాలకు సేద్యపు నీరు, మొత్తం 62 వేల గ్రామాలకు విద్యుచ్ఛక్తి విస్తరింపజేయాలని నిర్ణయించినట్లు తెలియజేశారు, ఇప్పుడు 8 కోట్ల ఎకరాలకు సేద్యపు నీరు అందుతున్నదనీ, 40 వేల గ్రామాలకు విద్యుచ్ఛక్తిసౌకర్యం ఉందనీ అన్నారు

వివిధ ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి సరఫరా ఎంత ఉన్నదీ ఉత్పత్తికిగల అవకాశాలేమిటీ మున్నగు వివరాలుకూడా పరిశీలన జరపాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇకముందు, ప్రాంతాలవారీగా ఇందుకు పథకాలను తయారు చేయడం జరుగుతుందన్నారు.

రాష్ట్రాల సరిహద్దులు ఇబ్బందులు అడ్డురావనీ, ఇందువలన పథకాలను పొదుపుగా అమలు జరపడానికి వీలవుతుందని అన్నారు.

ప్రాజెక్టు ప్రాంతాలలోని ప్రజలకు పునరావాస సౌకర్యం కల్పించడం మానవతా దృష్టితో జరుపాలని. కేవలం పరిపాలనా వ్యవహారాల దృష్టితోనే చూడరాదనీ అన్నారు. ఇది ఒక జాతీయ సమస్యగా చూడాలన్నారు.

1969 నాటికి ఈ 10 కోట్ల ఎకరాలకు సేద్యపునీరు అందించాలంటే మూడు రెట్లు ఎక్కువ శ్రమించి పనిచేయాలని అన్నారు.

దేశంలో సాగుబడిలో ఉన్న 32 కోట్ల 70 లక్షల ఎకరాలలోను 20 కోట్ల ఎకరాలవరకు సేద్యపు నీటిని అందించ వచ్చుననీ 1969 నాటికి కనీసం 10 కోట్ల ఎకరాలకయినా నీటి సరఫరా విస్తరింపజేయాలనీ అన్నారు.

పెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రం వహించుకుందా? అన్న ప్రశ్నకు ఈ సమస్య పరిశీలనలో ఉందని అన్నారు.

కృశ్చేవ్ అరెస్టు వార్త సర్వాబద్ధం

మాస్కోలో అధికార వర్గాల ఖండన

మాస్కో, అక్టోబరు 22

అక్టోబరు 1 వ తేదీన కృశ్చేవ్‌ను అరెస్టుచేసి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ సమావేశానికి నిర్బంధంగా పట్టుకొచ్చారంటూ కొన్ని విదేశాల పత్రికలలో పడిన వార్త పూర్తిగా నిరాధారమైనదనీ, ఆద్యంతం అభూత కల్పనయనీ నేడిక్కడ సోవియట్ అధికార వర్గాలు ఖండించాయి.

సోదరపార్టీలవిమర్శలకు సోవియట్ నాయకుల విస్మయం

డెన్మార్క్ కమ్యూనిస్టు పత్రిక మాస్కో విలేకరి కథనం

కోపెన్‌హేగన్, అక్టోబర్ 21

సోవియట్ యూనియన్ నాయకత్వంలో మార్పు ప్రవేశపెట్టిన పద్ధతిపై విదేశ కమ్యూనిస్టుపార్టీలు బహిరంగంగాచేస్తున్న విమర్శలుచూసి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు విస్మయంపొందారని, ఈ విమర్శలను గురించి వారుదీర్ఘంగా ఆలోచిస్తున్నారని డెన్మార్క్ కమ్యూనిస్టుపార్టీ అధికారపత్రిక "లాండ్ అఫ్ ఫోక్" మాస్కోవిలేకరి తెలుపుతున్నారు.

కృశ్చేవ్‌ను అకస్మాత్తుగా పదవినుంచి తొలగించడం పట్ల విమర్శను వ్యక్తం చేస్తూ స్వీడిష్ కమ్యూనిస్టు పార్టీ పత్రికలో ఒక వ్యాసం ప్రచురితమైంది. కృశ్చేవ్‌ను పదవుల నుంచి తొలగించటం చట్టవిరుద్ధమైన పద్ధతిలో జరిగినట్లు ఆ వ్యాసంలో ఆక్షేపించారు. ఇది చాలా బాధకరమైన విషయమని ఆ వ్యాసంలో పేర్కొన్నారు.

ఆల్జీరియాలో విద్రోహానికి పోర్చుగల్ ప్రోత్సాహం

అల్జీర్స్, అక్టోబరు 21

పోర్చుగీస్, ఇజ్రాయిల్ ఏజంట్లతో [illegible] ఆల్జీరియాలోని విప్లవ ప్రతిఘాతకులు విద్రోహ చర్యలు సాగిస్తున్నట్లు నిరూపించే పత్రాలను ఆల్జీరియన్ పత్రికలు నేడు ప్రచురించాయి.

ఈ పత్రాలను బట్టి, సామ్రాజ్యవాదులు ఆల్జీరియాలో విద్రోహాన్ని పురిగొల్పుతున్నట్లు వెల్లడైనదని ఆల్జీరియన్ పత్రికలు వ్యాఖ్యానించాయి.

బ్రిటన్‌లో రేవు కార్మికసమ్మె?

లండన్, అక్టోబరు 21

ఐదు రోజులక్రితం బ్రిటన్‌లో అధికారంలోకి వచ్చిన లేబరుపార్టీ ప్రభుత్వం దేశవ్యాపితమైన రేవుకార్మికుల సమ్మె పోరాటాన్ని ఎదుర్కోవలసిన పరిస్థితిలో పడబోతున్నది.

చైనాకు పెద్ద ఎత్తున బ్రిటిష్ సరుకులను ఎగుమతి చేయడానికి విల్సన్ ప్రభుత్వం ప్రయత్నం ప్రారంభించగానే, ఈ రేవు కార్మికుల గొడవ ఒకటి వచ్చిపడింది, రేవు కార్మిక సంఘం సమ్మెకు సన్నద్ధమవుతున్నది.

చైనాలో పెద్ద బ్రిటిష్ వస్తు ప్రదర్శన

పెకింగ్‌లో నవంబరు 2 వ తేదీన బ్రిటిష్ పారిశ్రామిక వస్తు ప్రదర్శన ప్రారంభం కాబోతున్నది ఇంతటి పెద్ద వస్తు ప్రదర్శనను చైనాలో ఇంతవరకు ఏ పశ్చిమ రాజ్యాలు ఏర్పాటు చేయలేదు.

బ్రిటిష్ వాణిజ్య మంత్రి డగ్లస్ జాన్ త్వరలో చైనాకు బయలుదేరి వెళతారని, అక్కడ ఆయన ఐదు రోజులు వుండి, వస్తు ప్రదర్శనను ప్రారంభిస్తారని నేడిక్కడ అధికార రీత్యా ప్రకటించారు.

ఇది ఇలా వుండగా, విదేశాంగ మంత్రి పాట్రిక్ గార్డన్ వాకర్ తన అమెరికా పర్యటనకు సన్నాహాలు పూర్తిచేసుకొంటున్నారు. ఆయన వచ్చేవారంలో అమెరికా వెళ్ళి, అధ్యక్షుడు జాన్సన్‌తోను, విదేశాంగ మంత్రి డీన్ రస్క్‌తోను అతి ముఖ్యమైన చర్చలు జరుపనున్నారు.

విల్సన్ మంత్రివర్గం నేడు సమావేశమై, కల్లోలితమైన పారిశ్రామిక పరిస్థితిని పరిశీలించింది. మంత్రివర్గం మళ్ళీ రేపు సమావేశమై, ఈ పరిస్థితి పరిశీలనను కొనసాగిస్తుంది.

రాజస్తాన్ నుంచి శనగల ఎగుమతుల నిషేధం

జయపూర్, అక్టోబరు 21

వచ్చే రబీ పంట మార్కెట్‌కు వచ్చేవరకు రాజస్తాన్ నుంచి శనగలను బయట రాష్ట్రాలకు ఎగుమతి చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం నేడు నిషేధించింది.

ఈ విషయాన్ని నేడు రాష్ట్ర శాసనసభలో ఆహార మంత్రి శ్రీ నాథూరామ్ మిర్ధా ప్రకటించారు.

రాజస్తాన్ శాసనసభ ఉపఎన్నిక ఫలితం

కాంగ్రెస్ అభ్యర్థి విజయం

జైపూర్, అక్టోబరు 20

రాజస్థాన్ శాసనసభకు నిన్న హనుమాన్ నగర్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో గెలుపొందిన కాంగ్రెసు సభ్యుడు శ్రీ కుంభా రామ్ ఆర్య నేడు శాసనసభ్యుడుగా ప్రమాణ స్వీకారం చేశారు.

శాంతి సహజీవన సూత్ర ప్రాతిపదికపై సోవియట్ విధానం

పాక్ వర్గాలకు సోవియట్ స్పష్టీకరణ

కరాచి, అక్టోబరు 21

నూతన సోవియట్ నాయకత్వం పూర్వం వలెనే శాంతి - శాంతియుత సహజీవన విధానాలను కొనసాగించగలదని పాకిస్తాన్‌కు సోవియట్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

శాంతి - శాంతియుత సహజీవనం విధానాల ప్రాతిపదికపై నిరాయుధీకరణ, విదేశాంగ విధానాలను సోవియట్ భవిష్యత్తులో కూడా అమలుజరుపుతుందని కరాచీలోని సోవియట్ రాయబారి పాకిస్తాన్ అధ్యక్షుని అక్టోబరు 17 న రావల్పిండిలో కలుసుకొని స్పష్టంచేసినట్లు అధికార ప్రకటన వెలువడింది.

పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌తో పాకిస్తాన్ - సోవియట్ సంబంధాలకు సంబంధించిన అన్ని విషయాలపై అయూబ్ సోవియట్ పర్యటించవచ్చినపుడు సోవియట్ నూతన ప్రధాని కోసిగిన్ చర్చలు జరుపగలరని అధికారవర్గాలు తెల్పుతున్నాయి.

పాకిస్తాన్‌లో ఎన్నికలుజరిగిన అనంతరం, 1965 మార్చి మాసం తర్వాత చైనా, సోవియట్‌లలో పర్యటించడానికి అయూబ్ నిర్ణయించుకున్నట్లు పాక్ విదేశాంగ శాఖ కార్యాలయం ఇటీవల ప్రకటించింది.

పాక్-సోవియట్లమధ్య వాణిజ్య సంబంధాలను అభివృద్ధిచేసుకునే అంశంపై చర్చలు జరిపేందుకు బహుశా వచ్చేమాసంలో రష్యా వాణిజ్యాధికారులు పాకిస్తాన్‌కు రావచ్చునని పాకిస్తాన్ వాణిజ్యశాఖామంత్రి వహీదుజ్జమాన్ నిన్న లాహోర్‌లో చెప్పారు.

కృశ్చేవ్ రాజీనామావల్ల పాక్-సోవియట్‌ల మధ్య వ్యాపార సంబంధాలు అభివృద్ధి చెందుతాయని మీరు ఊహిస్తున్నారా అని పత్రికా విలేకరులు ప్రశ్నించగా 'తప్పక అభివృద్ధి చెందుతాయ'ని మంత్రి సమాధానం చెప్పారు.

సోవియట్ నూతన నాయకత్వం పాకిస్తాన్ సమస్యలను అర్థం చేసుకొని రెండు దేశాల మధ్య ఎగుమతి సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నించగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

మితవాద, మతవాద పక్షాలతో ఎన్నికల సర్దుబాట్లు: ఆక్షేపణ లేదని శ్రీ నంబూద్రిపాద్

మంగళూరు, అక్టోబరు 21

ముస్లింలీగ్, స్వతంత్రపార్టీ, జనసంఘ్ మొదలైన పక్షాలు, మితవాద అభివృద్ధినిరోధక పక్షాలని ఒక వైపున అంటూనే మరొకవైపు ఎన్నికలలో సీట్లకోసం ఆపక్షాలతో సర్దుబాట్లు చేసుకోవడంలో తమకు ఎట్టి ఆక్షేపణ లేదంటూ పోటీ కమ్యూనిస్టుపార్టీనాయకుడు శ్రీ నంబూద్రిపాద్ ఇక్కడ ఒక సభలో అన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించడానికి కేరళలో వామపక్ష ఐక్య సంఘటన ఏర్పరచడంలో తమకూ, కమ్యూనిస్టుపార్టీకి ఉన్న ప్రధాన భేదం ఇక్కడే ఉందని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

కాంగ్రెసును ఓడించడానికి అన్ని అభివృద్ధికర పక్షాలతో తాము చేతులు కలుపుతామనీ, అంతేకాని కొన్ని సీట్లు వస్తాయనే దృష్టితో మతవాద, మితవాద అభివృద్ధినిరోధకముఠాతో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవడానికి తాము సుతరామూ అంగీకరించబోమనీ తమ కేరళ పర్యటనలో శ్రీ డాంగే వివరించిన విషయం పాఠకులకు విదితమే.

శ్రీ నంబూద్రిపాద్ తమ ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు:

"కాంగ్రెస్‌బలాన్ని సాధ్యమయినంత ఎక్కువ తగించి, సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లను సాధించడమేముఖ్యమనిమేమనుకుంటున్నాం కాబట్టి ముస్లిం లీగ్, స్వతంత్రపార్టీ జనసంఘ్ మున్నగు మితవాద అభివృద్ధి నిరోధక పక్షాలే మహా అరిష్టదాయకమైనవని, ఈ దృష్టితోనే యావత్తు విషయాలను పరిశీలించాలనీ డాంగే పక్షంవారు అంటున్నారు. వామ పక్ష ఐక్యసంఘటన ఏర్పాటా అన్న విషయంలో అభిప్రాయ భేదమేమీలేదు. ఎల్లా ఏర్పరచాలన్న విషయంలో భేదాభిప్రాయం ఉంది."

కర్ణాటకరాష్ట్రపోటీపార్టీ మహాసభ ముగిసిన సందర్భంలో శ్రీ నంబూద్రిపాద్ మాట్లాడుతూ దేశంలోని జాతీయ గుత్తపెట్టుబడిదారీ వర్గానికి, పెద్ద భూస్వామ్య వర్గాలకు కాంగ్రెస్, కాంగ్రెస్ ప్రభుత్వము ప్రాతినిధ్యం వహించుతున్నాయనీ, అట్టి కాంగ్రెసుకు ప్రత్యక్షంగా కాని పరోక్షంగాకాని తోడ్పాటు ఇవ్వాలనే దృష్టితో తమకు ఎట్టి రాజీలేదని అన్నారు.

ప్రభుత్వం ప్రజలకు ఆహారం అందించడంలో విఫలమైందనీ, రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం బ్రిటిష్ పరిపాలకులు సామాన్య ప్రజలకు పరిమితంగానైనా బియ్యం సరఫరా చేయగల్గారనీ, జాతీయ గుత్త పెట్టుబడిదారుల, భూస్వామ్యవర్గాల ఆధిపత్యంక్రింద ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతవరకు కార్మికవర్గ ప్రయోజనాలు నెరవేరవని అన్నారు.

తమ పార్టీవారిని చైనా అనుకూలురని, దేశభక్తి రహితులని అనడం తగదనీ, రెండు సంవత్సరాల క్రితం మనదేశంపై చైనా దాడి చేసినట్లు ఏ విదేశమైనా దాడిచేస్తే అటువంటి దురాక్రమణను సహించక పోవడమే గాక, రక్షణ కార్యకలాపాలన్నింటికి తమ పూర్తి సహకారం ఇస్తామనీ అన్నారు. అయితే అదే సమయంలో రక్షణ కృషి పేరుతో అమలు జరిపే ప్రజావ్యతిరేక విధానాలను బలపరచబోమని అన్నారు.

విచ్ఛిన్నకుల వింతవాదం

కర్ణాటకరాష్ట్రంలో పార్టీచీలిపోకుండా ఉండటానికి తాము శతథా ప్రయత్నించామనీ, కాని తమ మాట వినకుండా మైనారిటీగా ఉన్నవారు డాంగే నాయకత్వాన ఉన్న పార్టీ జాతీయసమితి పట్ల విశ్వాసం ప్రకటిస్తూ పార్టీని చీల్చారనీ, ఇక్కడ జరిగిన కర్ణాటక పోటీ కమ్యూనిస్టు పార్టీ సభలో ఒక వింత తీర్మానాన్ని ఆమోదించారు.

పార్టీ జాతీయ సమితిలో మైనారిటీగా ఉన్న 32 మంది విడిపోయి, పార్టీ ఐక్యతను భగ్నం చేసి పోటీపార్టీని నెలకొల్పడం డాంగే నాయకత్వాన్ని త్రోసిపుచ్చడంగా వీరు చిత్రిస్తూ ఈ విచ్ఛిన్న వర్గ వక్రమమైనదే నంటూ తమ తీర్మానంలో ఒక విచిత్ర వాదన చేశారు.

రాష్ట్ర కార్యవర్గం లేకుండా 31 మందితో ఉన్న రాష్ట్ర సమితిని, అయిదుగురు సభ్య[illegible] కార్యదర్శి పదాన్ని ఈ పోటీపార్టీ [illegible]

మాస్కో ఒప్పందం స్టాంపు

బెరాన్, అక్టోబరు 21

అణ్వస్త్ర పరీక్షల పాక్షిక నిషేధ ఒప్పందం జ్ఞాపకార్థం ఐక్యరాజ్యసమితి కార్యాలయంవారు ఒక ప్రత్యేక పోస్టు స్టాంపును వెలువరించారు. అమెరికా ప్రధాన ప్రతినిధి అడ్లైస్టీవెన్‌సన్ ప్రసంగిస్తూ "మానవజాతి ఉనికిని కాపాడడం వల్లనే శాంతి అసాధ్యమని గుర్తించే పరిపక్వత అమెరికా, సోవియట్ బ్రిటన్.మాస్కో ఒప్పందంపై సంతకం చేసిన ఇతర దేశాలు పొందాయనీ, తక్కిన దేశాలు కూడా దీనిని గుర్తిస్తే సంతోషంగా ఉంటుందని అన్నారు.

బ్రిటిష్ ప్రతినిధి సర్ ప్యాట్రిక్ డీన్ మాట్లాడుతూ, క్రిందటి వారం చైనా అణుబాంబు పాటవపరీక్ష జరపడం ప్రపంచమంతటా ప్రభుత్వాలకూ, ప్రజలకూ ఆందోళన కలిగించిందన్నారు.

ఈ సందర్భంలో సోవియట్ ప్రతినిధి నికొలై ఫెడరెంకో ప్రసంగిస్తూ, "అంతర్జాతీయ ఉద్రిక్తతల తగ్గుదల మార్గంలో మాస్కో ఒడంబడిక ఒక మైలురాయి" అన్నారు.

"అంతర్జాతీయ శాంతిభద్రతలను పదిలపరచడానికి, అన్ని దేశాలమధ్య స్నేహ సహకారాలను పెంచేందుకూ, ఉద్రిక్తతను మరికొంత తగ్గించేందుకు గతంలో లాగానే ఇకముందు కూడా సోవియట్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు

శాంతిపట్ల తమ వ్యవహారాలను తమ ఇష్టం వచ్చినట్లు నడుపుకునేందుకు అన్ని దేశాలకూ గల హక్కుపట్ల సోవియట్ కనబరుస్తున్న వంటి ఆసక్తిని తక్కిన దేశాలన్నీకూడా కనబరచినట్లయితే, ప్రపంచమంతటా శాంతియుత కృషి, అభివృద్ధి సుస్థిరం కాగలదని ఆయన నొక్కి చెప్పారు.

రాష్ట్రపతి కార్యదర్శి

న్యూఢిల్లీ, అక్టోబరు 21

పెట్రోలియం, రసాయనిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా ఉండిన శ్రీ కె. ఆర్. దామ్లే రాష్ట్రపతి కార్యదర్శిగా నియుక్తులయారు. రిటైర్ అవుతున్న శ్రీ యస్. దత్ స్థానంలో ఈయనను నియమించారు

తూర్పుపాకిస్తాన్‌లో కార్మికుల దారుణ హత్యకు నిరసన

ఏ. ఐ. టి. యు. సి. నాయకుల ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 21

తూర్పు పాకిస్తాన్‌లో వందలకొలది జూట్ కార్మికులను దారుణంగా హత్య కావించటాన్ని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ప్రతిపక్షనాయకుడు, శ్రీ మగ్దుం మొహియుద్దీన్ ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రధానకార్యదర్శి శ్రీ యస్. సత్యనారాయణరెడ్డి గారలు నేడొక ప్రకటన చేశారు.

తూర్పు పాకిస్తాన్‌లోని ఖాలిష్‌పూర్ వద్ద దాదాపు 400 మంది జూట్ కార్మికులను రౌడీలచే మిల్లుయజమానులు దారుణంగా హత్య చేయించారు. ఖుల్నా జూట్ కార్మికులు తమ న్యాయమైన కోర్కెల సాధనకు అక్టోబరు 12 నుండి సమ్మె కొనసాగిస్తున్నారని తమ ప్రకటనలో కార్మిక నాయకులు పేర్కొన్నారు.

కుట్ర పన్ని దారుణ హత్యకు తలపడిన వారిపై తగు చర్యలు గైకొనవలసిందిగా డిమాండ్ చేస్తూ ఏ. ఐ. టి. యు. సి. అన్ని సంస్థలను ఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషనరుకు నిరసన టెలిగ్రాములు పంపించవలసిందిగా నాయకులు తమ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఈ దారుణ హత్యలను ఖండిస్తూ అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కూడా ప్రకటన కావించింది.

అమెరికా కమ్యూనిస్టు దిన పత్రిక ఆఫీసుకు పోస్టులో బాంబు

విద్రోహుల ఘాతుకం

న్యూయార్కు, అక్టోబరు 21

అమెరికా కమ్యూనిస్టుపార్టీ దిన పత్రిక 'డైలీవర్కర్' కార్యాలయానికి ఎవరో విద్రోహులు పోస్టుద్వారా బాంబును పంపారు.

న్యూయార్క్ పోలీసు నేడు ఈ బాంబును కనుగొని దీని ఫ్యూజును తొలగించారు.

ఈ బాంబును ఒక పుస్తక రూపంలో ప్యాక్‌చేసి డైలీవర్కర్ కార్యాలయానికి పంపారు. దీనిని పంపిన వారి పేరు "మోకరన్ బుక్‌స్టోరు" చికాగో అన్న అడ్రసు అప్యాకెట్ మీద రాసివుంది.

ఈ బాంబు ఫ్యూజును పోలీసులు తొలగించిన సందర్భంలో ఆ భవనంనుండి డైలీవర్కర్ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు.

అంతర్జాతీయ సమస్యపై బ్రిటిషు మంత్రుల చర్చ

లండన్, అక్టోబరు 21

ఇంతవరకు దేశీయ సమస్యలను గురించి చర్చించిన కొత్త బ్రిటిష మంత్రివర్గం నేడు అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలన ప్రారంభించింది విదేశాంగమంత్రి పాట్రిక్ గార్డన్ వాకర్ మంత్రిమండలి సమావేశంలో అంతర్జాతీయ పరిస్థితులను సింహావలోకనం చేశారు.

లలిత కళాసమితి - చేబ్రోలు వారి ఆధ్వర్యమున, నాట్యాచార్య నటకావతంస శ్రీ బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి అక్టోబరు 18 న సన్మానము జరిగినది సన్మానసభకు శ్రీ వాసిరెడ్డి చంద్రశేఖరం (ప్రెసిడెంట్, చేబ్రోలు పంచాయతీ) అధ్యక్షత వహించారు.

అభివృద్ధి శక్తుల సమీకరణే మన గమ్యం

హుజూరునగరు తా॥ పార్టీ మహాసభ సూచన

పొనుగోడు, అక్టోబరు 22

దేశంలోని అభివృద్ధి కాముక శక్తులెందెందున్నా వాటిని సమీకరించ గలిగినప్పుడే కమ్యూనిస్టుపార్టీ విజయం సాధించగలదని పొనుగోడు బహిరంగసభలో శ్రీ నల్లమల గిరిప్రసాద్ హెచ్చరికనిచ్చారు

హుజూరునగర్ తాలూకా కమ్యూనిస్టు పార్టీ మహాసభ పొనుగోడు గ్రామంలో అక్టోబరు 13, 14 తేదీలలో జరిగింది. మహాసభకు తాలూకా వివిధ గ్రామాల, పార్టీశాఖల లోని 290 పార్టీ సభ్యులు ఎన్నికచేసి పంపించిన ప్రతినిధులు 97 మంది హాజరైనారు. వారుగాక 30 మంది సౌహార్ద ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు.

ఈ సభ సందర్భంగా పై బహిరంగసభ జరిగింది.

13 వ తేదీ మహాసభ ప్రారంభమునకు ముందు ప్రతినిధులంతా ఎర్రజండాలతో ఊరేగింపుగా మృతవీరుల సమాధులవద్దకు వెళ్లారు. సమాధులవద్ద తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ చింతలపూడిరాములు ఎర్రజండా ప్రతిష్ఠాపనచేసి, మృతవీరుల త్యాగనిరతి, ఆశయాలను వివరించారు. అనంతరం ప్రతినిధులంతా సమాధులపై పుష్పాలను చల్లి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆ తరువాత మహాసభ జరిగిన, తాలూకా పార్టీ నిర్మాత, అమరజీవి కామ్రేడ్ వెదిరె రాజారెడ్డిగారి హాల్‌ముందు శ్రీ నల్లమల గిరిప్రసాద్ ఎర్రజెండా ప్రతిష్ఠాపన చేశారు.

మహాసభకు అధ్యక్ష వర్గంగా శ్రీయుతులు పి. రామకోటేశ్వరరావు, చిల్లచర్ల రఘునాథం, వర్కా రాంరెడ్డిగార్లను ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రపంచ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ మారిస్ థోరే, టోగ్లియాటీ, భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కామ్రేడ్ అజయ్‌ఘోష్, భారత జాతీయ నాయకుడు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగార్ల మృతికి మహాసభ తన గాఢ సంతాపమును వ్యక్తంచేస్తూ తీర్మానంచేసి, 2 నిమిషాలసేపు మౌనం వహించింది.

మహాసభలో పాల్గొన్న ప్రదేశ్ సమితి కార్యవర్గ సభ్యుడు శ్రీ నల్లమలగిరి ప్రసాద్ గారు పార్టీ చీలికను, పార్టీ ముసాయిదా తీర్మానములను ప్రతినిధులకు వివరించారు. నల్లగొండ జిల్లా సమితికార్యదర్శి శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు జిల్లా రాజకీయ పరిస్థితినివివరించారు. అనంతరం తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ చింతలపూడి రాములు నివేదికను చదివారు. ప్రతినిధులంతా చర్చలు జరిపి ఏకగ్రీవంగా ఆమోదించారు.

14 వ తేదీ సాయంత్రం 29 మందిని జిల్లా మహాసభకు ప్రతినిధులుగాను, 29 మందితో తాలూకాపార్టీకౌన్సిల్‌ను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. అనంతరం తాలూకా కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశమై తాలూకా సమితి కార్యదర్శిగా శ్రీ చింతలపూడి రాములు గారిని, కార్యవర్గ సభ్యులుగా శ్రీ పి. రామకోటేశ్వరరావు, శ్రీ అనుమాల లింగయ్య, శ్రీ చిల్లంచర్ల రఘునాథం, శ్రీ వర్కా రాంరెడ్డి, శ్రీ బూర గోపాలం, శ్రీ కట్టా వెంకట్రామయ్య, శ్రీ సయ్యద్ ఫకృద్దీన్, శ్రీ యం. జగన్ మోహనరావు, శ్రీ షేక్ ఇమామ్, శ్రీ రెణబోతు వీరారెడ్డిగార్లను ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు.

బహిరంగసభ

14 వ తేదీ రాత్రి గ్రామంలో బహిరంగ సభ జరిగింది. ఇంచుమించు 3500 మంది ప్రజలు హాజరయిన ఈ సభకు శ్రీ అనుమాల లింగయ్య అధ్యక్షత వహించారు. సభకు ముందు పెద్ద వూరేగింపు జరుపబడింది.

సభలో ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ నల్లమల గిరిప్రసాద్ భారత కమ్యూనిస్టుపార్టీ దేశంలోని వివిధ రాజకీయ పార్టీల ఎడ అనుసరిస్తున్న ఐక్యతా ధోరణిని సమర్థిస్తూ ఈ విధంగా ప్రసంగించారు.

ఈనాడు దేశజనాభాలో నూటికి 10 మంది మాత్రమే కమ్యూనిస్టు పార్టీ వెనుకాలవుంది. 40 వంతులు కాంగ్రెసు వెనకాల, మిగతావారు వివిధ పార్టీల వెనుకాల వున్నారు. ఇంత కొద్ది బలాన్ని కలిగివున్న, కమ్యూనిస్టుపార్టీ, ప్రస్తుతం భారతదేశంలో అన్ని స్థాయిలలో వున్న, అభివృద్ధి నిరోధక శక్తులను తొలగించుటకు, ప్రజాస్వామిక వ్యవస్థాపనకు పోరాడుటకు పూనుకుంది. ఆ పోరాటమును విజయవంతం జేయుటకు దేశంలోని ప్రజాస్వామిక శక్తులన్నింటిని కూడకట్టుటకు కమ్యూనిస్టుపార్టీ పూనుకుంది. ప్రజాస్వామిక శక్తులు కాంగ్రెసులోను, ఇతరపార్టీలలోను వున్నారనే విషయం కమ్యూనిస్టుపార్టీ గుర్తించుచున్నది. పార్టీకి యీ అవగాహన లోగడనుండే వున్నది. లోగడ అన్నిపార్టీ మహాసభల తీర్మానాలలోను ఆ విషయం గుర్తించబడింది. అయా తీర్మానములను అమలు పర్చిన సందర్భాలలో విజయాలున్నవి, అపజయాలూ వున్నవి. వాటన్నిటి నుండి పాఠాలు తీసుకొని నూతన కార్యక్రమంతో భారత కష్టజీవులకు, కార్మికవర్గానికి నాయకత్వంవహించిపోరాడవలసిన కమ్యూనిస్టు పార్టీ దేశంలోని అభ్యుదయ కాముక శక్తులన్నింటిని సమీకరించ బూనుకుంది. ఈనాడు దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ, గ్రామీణ భూస్వామ్య దోపిడులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఒంటరిగా పోరాడ దలచలేదు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోరాడదలచింది. మనం దగ్గర మార్గములను ఆలోచించి స్వర్గానికి నిచ్చెనలు వేయాలని వంటరిగా ప్రయత్నంజేస్తే అందని ద్రాక్షపండ్లపుల్లనితత్వప్రయోజనముండదని మనం గుర్తించాలి. అందుకని దేశంలోవున్న అభివృద్ధికాముక శక్తులను కమ్యూనిస్టుపార్టీ సమీకరించకపోతే అది సాధించేదేమిలేదు. ఒకప్పుడు చైనా కమ్యూనిస్టుపార్టీకూడ అలాంటి ఎత్తుగడద్వారానే విజయాలు సాధించింది. భారతదేశంలో కార్మిక, కర్షక మధ్య తరగతి ప్రజలకు నాయకత్వం వహించవలసిన కమ్యూనిస్టుపార్టీకి ఈనాడు ఆ ఎత్తుగడ అవసరం ఎంతో వుంది, కార్మికవర్గపార్టీయైన కమ్యూనిస్టుపార్టీ ఆలోచనా విధానంలో ఇంతకంటే మంచి విధానం మరొకటి వుండబోదని నేను చెప్పదలచాను, అలా ఆలోచించకపోతే కమ్యూనిస్టుపార్టీ తప్పక దెబ్బతింటుందనికూడ చెప్పదలచాను.

తరువాత, నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు, తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ చింతలపూడి రాములుగారు, కార్యవర్గ సభ్యుడు శ్రీ పి. రామకోటేశ్వరరావుగారు, సభాధ్యక్షుడు శ్రీ అనుమాల లింగయ్యగారు ఉపన్యసించారు.

విశాఖ పోర్టుట్రస్టుఛైర్మన్‌కు అంబాసడర్ కారు మంజూరు

విశాఖపట్నం, అక్టోబరు 18

గత నెలలో జరిగిన విశాఖపోర్టు ట్రస్టు బోర్డు సమావేశంలో పోర్టుట్రస్టు ఛైర్మన్ స్వంత వినియోగానికి ఒక కొత్త అంబాసడర్ కారును ట్రస్టు ఆస్తిగా కొనుటకూ, నెలసరి దాని నిర్వహణకు గాను ఛైర్మన్ నుండి రూ. 100 చొ॥న బిగపట్టుటకు తీర్మానించబడింది.

పోర్టు ట్రస్టు యేర్పాటు వల్ల లభించిన పదుపాయాల అభివృద్ధి కేవలం ఒకరికే గాక పోర్టు ఉద్యోగులందరికీ అదే ప్రమాణం ప్రకారం జరిగితే పోర్టు ఉద్యోగులలో నూతనోత్సాహం ఆశించ వచ్చు, కాకపోతే మాత్రం యిది అసుఖ సూచకమే కాగలదని యిక్కడ అభిజ్ఞులు భావిస్తున్నారు. (వి. వి.)

కృష్ణాజిల్లా చెడుగుడు పోటీ పందెముల వాయిదా

కోసూరు, అక్టోబరు 19

కృష్ణాజిల్లా, దివితాలూకా- కోసూరు గ్రామములో కృష్ణాజిల్లా చెడుగుడు పోటీ పందెములు ఈనెల 25 26, 27, 28 తేదీలలో కోసూరు యువజన మండలి ఆధ్వర్యమున నిర్వహించబడునని లోగడ ప్రచురించబడింది. కాని, కొన్ని అవాంతర పరిస్థితులవల్ల ఈ పోటీ పందెములు రద్దుచేసినామని యువజన సంఘం వారు తెలుపుతున్నారు.

వరదబాధితులకు ఉదారుల సహాయం

విజయవాడ, అక్టోబరు 19

విజయవాడ పట్టణ కమ్యూనిస్టుసమితివారు ఈనెల 12, 13, 14 తేదీలలో కృష్ణలంక, భ్రమరాంబపురం, భాస్కరరావుపేట ప్రాంతాలలో వరద బాధితులకు బియ్యం, పంచినారు. గాంధీజీ మునిసిపల్ హైస్కూలు, పాదుర్తి సుందరమ్మ హైస్కూలు వగయిరా క్యాంపులలో వున్నవారికి కృష్ణలంక కట్టమీదవున్న వారికి షుమారు 1500 కుటుంబాలకు తలకొక కిలో చొప్పున షుమారు 15 బస్తాల బియ్యం పంచబడినవి. ఈ దిగువ విరాళాలు యీ సందర్భంలో స్వీకరించబడ్డాయి.

శ్రీయుతులు శిష్ట్లా లక్ష్మీపతిశాస్త్రి పావు బస్తా బియ్యం, దాసం నారాయణశాస్త్రి పావు బస్తా బియ్యం, పి. గోపాలకృష్ణారావు (చిత్తూరు) రు 5.

17 వ వార్డు హనుమాన్‌పేటనుండి

తిమ్మరాజు అప్పారావు రు. 25, బొక్కసం ప్రభాకరరావు రు. 15, శ్రీ వెంకటేశ్వరరావు రు. 10, ముత్యాల సీతారామయ్య ప్రదర్సు రు. 5, మద్దినేని వెంకటేశ్వర్లు రు5, గుమ్మడివెంకటేశ్వర్లు రు. 10, బంకా వెంకటేశ్వర్లు రు. 5, తూమాటి వరసయ్య రు. 2, కె. వెంకటరెడ్డి, రు. 1

25 వార్డునుండి

సూర్యారావుపేటప్రాంతంవర్తకులు 33-80 15 శేర్లు బియ్యం, సీతారాంపురం 75 శేర్లు బియ్యం. 12-50, దుర్గాగ్రహారం 15 శేర్లు బియ్యం, రు 20.

28 వ వార్డు-సూర్యారావుపేటనుండి

చుక్కపల్లి కుశలవ 50 చెరికాని శీతాపతి 20 కె. ఎస్ ప్రకాశరావు 5, మాగంటి శ్రీరాములు 5. వెల్లంకి వెంకటేశ్వరరావు 5, డాక్టర్ ఎస్. ఎల్. శాస్త్రి 5. డి. మోహన్‌దాస్ 5, దలసాని దత్తు 5, అట్లూరి రామశాస్త్రి 10 ఎస్. వి. రమణయ్య 50, వీరమాచనేని సుబ్బారావు 5, డాక్టర్ కె. ఎస్. కృష్ణకుమారి 5. కె. బి. సింగ్ 5, వి. సుభాష్‌చంద్రబోస్ 5, ఎస్. వి. ఎల్. నరసింహం 5, కె శ్రీరామమూర్తి 15, ఎ. రాధాకృష్ణ 5. పి. కేసరన్న 5, తలసాని వీరరాఘవయ్య 5. డాక్టరు సీతారత్నం 5. గౌతమీ నర్సింగ్ హోమ్ 5 విజయ సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్స్ 5. చివుకుల రాధాకృష్ణమూర్తి 5. స్టార్ బేకరీ స్టోర్సు, కోహినూర్ రెస్టారెంటు 7. ఎ. ఎస్. ఎ. రామారావు 5

విజయవాడ శ్రీ కార్మికసంఘ ధర్మగ్రంథాలయస్వర్ణోత్సవం

విజయవాడ, అక్టోబరు 18

1913 వ సంవత్సరంలో స్థాపించబడిన విజయవాడ శ్రీ కార్మికసంఘ ధర్మ గ్రంథాలయ స్వర్ణోత్సవములు ఈ అక్టోబరు 24 వ తేదీన గ్రంథాలయ భవనములో జరుగుతాయి. సభను కేంద్ర జలవిద్యుత్ శాఖామంత్రి డాక్టరు కె. యల్ రావుగారు ప్రారంభిస్తారు. శ్రీ కాకరపర్తి భావనారాయణగారు అధ్యక్షత వహిస్తారు. స్వర్ణోత్సవ సంచికకూడా ఆవిష్కరించబడును.

నందికొండ ప్రాజెక్టు ఎడమకాల్వ నిర్మాణం ఆగిపోతుందా?

సందేహంపై నందిగామ తాలూకా రైతుల ఆందోళన

నందిగామ, అక్టోబరు 19

నందికొండ ప్రాజెక్టు ఎడమ కాలువ ఇంతటితో ఆగిపోతుందని, నాల్గవ ప్రణాళికలో అదనంగా డబ్బు కేటాయించబడదనీ, అందు మూలంగా నందిగామ, తిరువూరు, మైలవరం ప్రాంతాలకు నాల్గవ ప్రణాళికలో నీరు అందని పరిస్థితి ఏర్పడుతుందనీ ఆందోళనకర మయిన వార్తలు వస్తున్నాయి.

అందుచేత యీ సందర్భంలో నందిగామ తాలూకా రైతుల ఆందోళన కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకురావలసిన అవసరం వున్నది. ఈనెల 25 వ తారీఖున కేంద్రజలవిద్యుత్ శాఖా మంత్రి శ్రీ కె. యల్. రావుగారు నందిగామకు వస్తున్నారు ఈ విషయం వారి దృష్టికి తీసుకువచ్చుటకు తాలూకాలోని ముఖ్యులంతా రావాలని నందికొండ ప్రాజెక్టు రైతుకమిటీ అధ్యక్షులు శ్రీ అడుసుమిల్లి సూర్యనారాయణ కోరుతున్నారు.

యర్రుపాలెం ఫిర్కాలో రు 40 వేల పంట నష్టం

యర్రుపాలెం, అక్టోబరు 15

మధిరతాలూకా యర్రుపాలెం ఫిర్కాలో సెప్టెంబరు చివరివారంలో కురిసిన అధిక వర్షాలవల్ల ఫిర్కాలోని పెద్ద చెరువులైన జమలాపురం, రేమిడిచర్ల, తెల్లబాలెం, వింధ్యాద్రమ్మ చెరువు, అయ్యవారిగూడెం చెరువులు తెగి విపరీతనష్టం పంటలకు కలిగిందాయి.

ఈ తాలూకాలో నాట్లుతరుణానికి వర్షాలు లేక చెరువులు నిండలేదు, ఆలస్యంగా కొన్ని గ్రామాలలో నాట్లువేయుట జరిగింది. ముఖ్యంగా మధిర చెరువుక్రింద 40 యకరాలు మాత్రమే వరివేశారు. వైరా ప్రాజెక్టుక్రింద ½ వంతు కూడా నాట్లు పడలేదు.

అధికవర్షాలవల్ల జొన్న ఎదలువేయవలసిన తరుణం కూడా తప్పింది. ఇంకా అనేక గ్రామాలలో జొన్న ఎదలు పూర్తి గాలేదు. గ్రామాలలో తింటానికి గింజ దొరుకుట కడు దుర్లభంగా వుంది. పల్లెలలో పనులు లేక పస్తులుంటున్నారు. గాన, ప్రభుత్వం వెంటనే ప్రతిపంచాయతీకి చౌకడిపో పెట్టించి జొన్నలు, బియ్యం అమ్మించాలి. యర్రుపాలెం ఫిర్కాను కరువుప్రాంతంగా ప్రకటించాలి. తాలూకా మొత్తంలో మూడణాలపంటకన్నా ఎక్కువవచ్చే అవకాశం లేనందున శిస్తు రెమిషన్ యివ్వాలని యర్రుపాలెం ఫిర్కా రైతు నాయకులు శ్రీ బూసుపల్లి బాలిరెడ్డిగారు ప్రభుత్వాన్ని కోరుతూ ఒక ప్రకటన చేశారు.

రూపాయకు 2 శేర్ల బియ్యం అమ్మించాలి

కోవూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ డిమాండ్

కోవూరు, అక్టోబరు 21

రూపాయకు రెండుశేర్లబియ్యం అమ్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ తీర్మానించింది.

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా కమ్యూనిస్టు పార్టీ మహాసభ ఈ నెల 10, 11 తేదీలలో ఇమ్మపాలెంలో జరిగినది. 60 మంది సభ్యులు ఆరుగురు ఆహ్వానితులుపాల్గొన్నారు.

మహాసభకు అధ్యక్షవర్గంగా శ్రీయుతులు ముత్యాల చెందయ్య, చక్కా మాలకొండయ్య గారలు ఎన్నుకొనబడ్డారు. శ్రీయుతులు జి. రామచంద్రయ్య, యం. చిదంబరం, కె చంద్ర మోహన్‌గార్లతో సారథ్యసంఘం ఎన్నికైంది.

10 వ తేదీ సమావేశంలో కార్యదర్శి శ్రీ జి. రామచంద్రయ్యగారు తాలూకా పార్టీ నిర్మాణం, పని నివేదికలను పంచాయతీ ఎన్నికలపై నివేదికను శ్రీ కె. చంద్రమోహన్ ప్రవేశ పెట్టినారు.

11 తేదీ పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు శ్రీ జి. ఎ. పద్మనాభయ్య ప్రవేశ పెట్టారు.

15 మందితో తాలూకా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోబడినది జిల్లా పార్టీ మహాసభకు 25 మంది ప్రతినిధులు, 8 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు ఎన్నుకొనబడ్డారు.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు పోటీ పార్టీవారి చర్యలు, దుష్ప్రచారాన్ని ఎదుర్కొని మరింత పట్టుదలతో పార్టీ కార్యక్రమాన్ని చేపట్టాలనే ఉత్సాహాన్ని చూపినారు.

అన్ని గ్రామాలలో చౌకడిపోలు పెట్టి 1 రూపాయకి 2 శేర్లు బియ్యం అమ్మించాలని, బంజరు భూములపై పెనాల్టీలు రద్దుచేయాలని, జీవితావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అక్రమంగా జైళ్ళలో నిర్బంధించియున్న డిటెన్యూలను వెంటనే విడుదల చేయాలని, ఇటీవల వరదలకు గురైన వారికి తక్షణ, దీర్ఘకాలిక సదుపాయాలు కలుగజేయాలన్న తీర్మానాలు చేయబడ్డాయి.

శ్రీ ఎం. చినరమణయ్యగారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసినది.

11 వ తేది సాయంత్రం శ్రీ మోడెం సీతారామిరెడ్డిగారి అధ్యక్షతను జరిగిన తాలూకా కమిటీ సమావేశంలో శ్రీయుతులు జి. రామచంద్రయ్య కార్యదర్శిగా, బి. శంకరయ్య, యం. చిదంబరం, కె. చంద్రమోహన్, పెండ్లి రమణయ్య గార్లతో కార్యదర్శివర్గం ఎన్నుకోబడింది.

11 వ తేది రాత్రి జరిగిన బహిరంగ సభకు శ్రీ రామచంద్రయ్యగారు అధ్యక్షత వహించినారు. జిల్లా పార్టీ నాయకులు శ్రీయుతులు యం. శంకరయ్య, పి. రామకోటయ్య, జి ఎ. పద్మనాభయ్య, పి. వేదాచలం, శేరే రాయప్ప గారలు ఉపన్యసించారు.

సభానంతరం చి॥ నిర్మల నృత్యప్రదర్శన జరిగింది. యువజన నాట్యమండలి వారిచే 'ఇదా ప్రపంచం' నాటకం ప్రదర్శించబడింది.

ఇమ్మిపాలెం కమ్యూనిస్టుశాఖ తాలూకా మహాసభకు చక్కటి ఏర్పాట్లు చేసింది.

'ధరలు తగ్గిస్తే కరవుభత్యం కోరము'

రాజమండ్రి, అక్టోబరు 19

ఆంధ్రప్రదేశ్ స్టేట్ నాన్‌గెజిటెడ్ ఉద్యోగస్తుల సంఘాధ్యక్షులు శ్రీ ఎ. శ్రీరాములు నిన్న సాయంత్రం ఆ సంఘ రాజమండ్రిశాఖ సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ "ప్రభుత్వం ఇటీవల పెంచిన కరువుభత్యం నేటి ధరవరల దృష్ట్యా యేమీ సరిపోని మాట వాస్తవమే. అయినా ప్రభుత్వం మన ఉద్యోగుల కష్టనష్టములను విచారించుటకు సుముఖంగా ఉన్నదన్న దృష్ట్యా అంగీకరించడమైన"దన్నారు. కనీసం కరువు భత్యం నెల 1 కి 27 రూపాయలైనా పెంచటం చాలా అవసరమని, మన పరిస్థితులను సాకల్యంగా విచారించి తమకు నివేదించుటకై ఒక పే కమీషన్‌ను వేయ నిర్ణయించిందని, దానికి ఛైర్మన్‌గా సంఘం కోరినట్లు ఒక హైకోర్టు జడ్జినే నిర్ణయిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

తిండిగింజలను న్యాయమైన ధరలకు సక్రమంగా తమకు అందచేస్తే కరువుభత్యం పెంచమని వుద్యోగులు పట్టుపట్టరని" చెప్పారు.

64 నవంబరు 14, 15 తేదీలలోఏలూరులో స్టేట్ ఎసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరుగుతుందని, పరిపాలనా సంస్కరణల కమిటీకి తమ సంఘంచేయనున్న సూచనలను అందులో కూలంకషంగా చర్చించి, వాటికి తుది వ్యరూపం నివ్వటం జరుగుతుందని, నవంబరు 27 తేదీని హైదరాబాదులో తమ స్టేట్ సంఘ మహాసభ జరుగుతుందని, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఆసభలను ప్రారంభిస్తారనికూడా శ్రీ శ్రీరాములు చెప్పారు (వి. వి.)

మంగళగిరి పొగాకు కార్మిక సమ్మెపై పోటీపార్టీ దుష్ప్రచారం

కమ్యూనిస్టుపార్టీ వహించిన పాత్రపై పట్టణ కమ్యూనిస్టుశాఖ కార్యదర్శి వివరణ

మంగళగిరి, అక్టోబరు 21

గుంటూరుజిల్లా మంగళగిరి కమ్యూనిస్టు శాఖ కార్యదర్శి శ్రీ చిమ్మన నాగభూషణంగారు యిలా ప్రకటిస్తున్నారు:

ఇటీవలనే అతివాద ముసుగు తగిలించుకున్న పార్టీ విచ్ఛిన్నముఠావారు మంగళగిరి పట్టణ కమ్యూనిస్టుపార్టీపైన అబద్ధ ప్రచారానికి తలపడ్డారు. 17 వ తేదీ జనశక్తిలో యజమానులతో లాలూచీ పడి పొగాకుకార్మికుల సమ్మెను భగ్నము చెయ్యటానికి రివిజనిస్టులు ప్రయత్నించారంటూ ఒక అబద్ధ ప్రకటన చేశారు.

మంగళగిరి ఆర్. కె. టి. పొగాకు కంపెనీ యజమాని ఒక కార్మికురాలిని పనినుండి తీసివేశారు. ఆ కార్మికురాలిని పనిలో పెట్టుకోవాలని సమ్మె జరుగుచున్నది. పొగాకు కంపెనీల్లో, గతంలో కూడ అనేక దఫాలు కార్మికులను పనులనుండి తీసివేయటం కార్మికసంఘ కార్యకర్తలు వెళ్లి యజమానితో మాట్లాడి తిరిగి పనిలో పెట్టించటం సర్వసాధారణంగా జరుగుతున్న విషయం. లోగడ తొమ్మిది మంది కార్మికులను వొకేసారి పనినుండి తొలగించిన సందర్భంలో యివ్వాళ స్వంత నిర్ణయంతో నిరాహారవ్రతానికి తలపడ్డ సంఘ కార్యదర్శి, ఆనాడు సంప్రతింపులలో తన కుమార్తెను ఒక్కదానిని మాత్రం తిరిగి పనిలోకి తీసుకొనుటకు మాత్రమే అంగీకరించి, మేనేజిమేంటుతో రాజీపడి మిగతా యెనిమిదిమందిని వారి ఖర్మకు వారిని వదిలాడు. కార్మికోద్యమంలో సమిష్టిగా పాల్గొంటున్న పార్టీ కార్యకర్తలు. ఆనాటి మేనేజిమెంటుతో పోరాడి ఆమిగిలిన యెనిమిదిమందిని తిరిగి పనిలో పెట్టించగలిగారు.

అసలు సమ్మె విషయం పట్టణ పొగాకు కార్మిక సంఘం అధ్యక్షునికిగాని, వర్కింగ్ కమిటీకిగాని సంఘ కార్యదర్శి తెలియచేయనే లేదు.

కొన్ని వందలమంది కార్మికులకు సంబంధించిన సమ్మెనుగురించి వర్కింగ్ కమిటీ సమావేశపర్చి దాని నిర్ణయం తీసుకొనాలన్న కనీస సాంప్రదాయాన్నికూడ పాటించలేదు పొగాకు కార్మిక సంఘం తన జేబు సంస్థ అనట్లు ఒంటెత్తు ధోరణితో తొందరపాటు నిర్ణయంచేసి తన దుందుడుకు తనాన్ని నిరూపించుకొన్నాడు.

మొత్తం సమిష్టిగా నిర్వహిస్తున్న కార్మిక సంఘం పేరుతో ఒంటెత్తు పెడివాద ధోరణితో నిరాహార దీక్ష సమ్మె ప్రారంభించినా, కమ్యూనిస్టులముగా, కార్మిక సంఘ కార్యకర్తలముగా సమ్మెకు తోడ్పడే వుద్దేశ్యంతో పార్టీ కార్యదర్శిగా నేను కార్మికసంఘ కార్యకర్త శ్రీ కంటె వెంకటేశ్వర్లును సమ్మె నిరాహారవ్రతం జరుగుతున్న దగరకు పంపించాము. ఆ కార్యకర్త [illegible] పోము పట్టాడు సమ్మెనాయకుడు.

చివరకు ఆకార్యకర్త కార్మికులతో మాట్లాడి కంపెనీలోపలికెళ్ళటానికి ప్రయత్నించగా నీవేమి సమ్మెవిషయం మేనేజిమెంటుతో మాట్లాడవద్దు. అని నిరాహారవ్రతుడు ఆంక్ష విధించాడు. అయినా, కార్మికుల యెడ తనకున్న కనీస బాధ్యతలను గుర్తించి కంపెనీ మేనేజిమెంటు వద్దకెళ్ళి సమ్మె విషయము సంప్రదించాడు. సమ్మె చేస్తున్నవారు అపూట పనిలోకొస్తే రేపు ఉదయం తీసివేసిన మనిషిని పనిలో పెట్టుకుంటాము అని మేనేజిమెంటు చెప్పింది. అందుకు ఆ కార్యకర్త సమ్మె ఏ కారణంకొరకు జరుగుచున్నదో, ఆ కారణం పూరింపబడనిదే సమ్మె విరమించటం సాధ్యంకాదు. కాబట్టి తీసివేసిన మనిషితో సహా అందరు కార్మికులను ఒకేసారి పనిలోకి పెట్టుకోవాలని కోరాడు. అదే విషయం కార్మికులకు వివరించాడు.

ఇంతమాత్రంతో మేమేదో మేనేజిమెంటుతో లాలూచీ అయినట్లు కార్మికులలో తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. ఆ నీచ ప్రచారంలోని నిజానిజాలు కార్మికులకు వివరించటానికి ప్రయత్నించితే మేము సమ్మెను భగ్నం చెయ్య ప్రయత్నించామని అబద్ధప్రచారము చేశారు. వాస్తవంగా మేము సమ్మెను భగ్నం చెయ్యటమే ఆశయంగా పెట్టుకొన్నట్లయితే కమ్యూనిస్టుపార్టీ కుటుంబాల, సానుభూతిపరుల, సన్నిహితుల కుటుంబాల కార్మిక స్త్రీలను పనులలోకి వెళ్ళమని ప్రోత్సహించ గలిగేవాళ్ళము. కాని ఈ కపటకార్మిక నాయకుని నిరాహార వ్రతానికి తోడుగా ఆ కార్మికస్త్రీలేముఖ్యకార్యకర్తలుగానిలబడి సమ్మె జరుగుటకు తోడ్పడ్డారు. వాస్తవం ఇదికాగా కమ్యూనిస్టుపార్టీపై నిత్యము నిందలతో నీచ ప్రచారం చెయ్యటమే తమ రాజకీయ విధానంగా పెట్టుకున్న పెడివాదముఠా కమ్యూనిస్టుపార్టీపై నాల్గురాళ్ళు విసిరింది.

ఇవ్వాళ సమ్మెజరిగిన ఆర్. కె టి. పొగాకు కంపెనీలో సమ్మెచెయ్యవలసిన కారణాలు లేవా అంటే చాలా వున్నవి. ఈ కంపెనీ యజమాని కంపెనీలో సీనియారిటీని అమలు జరపకుండా కంపెనీ ప్రారంభించిన దగ్గరనుండి పనిచేస్తున్న కార్మికులను తాటిఆకుల పాకల్లో పనిచేయించుచూ సాయంత్రం 4 గంటలవరకు పనిచేసినా అప్పుడు వర్షంవస్తే ఆ కార్మికులకు మస్తరువెయ్యకుండా పంపించుతున్నాడు.

నిన్న మొన్నటివరకు బి.జి.టి.యన్.టి.సి. కంపెనీల్లో పనిచేస్తూ ఆ కంపెనీలు కట్టివేసిన తరువాత ఈ కంపెనీలో కొస్తే వారిచేత పక్కాబిల్డింగులలో పనిచేయించుచున్నాడు. వారికి పనినష్టం లేకుండా చూస్తున్నాడు. మొదటినుండి కంపెనీని అంటిపెట్టుకొనివున్న కార్మికులకు చాలా అన్యాయం చేస్తున్నా వీరికి [illegible] కార్మికులచేత రోజుకు [illegible] గంటలు పనిచేయించాల్సింది 10 గంటలు పనిచేయించుతున్నా ఈ కార్మిక నాయకులకు పట్టలేదు.

వారాలు నెలల తరబడి బట్వాడాలు ఇవ్వక ఇచ్చే బట్వాడాలో అయిదు పది రూపాయలు లేదా చెప్పి మేనేజిమెంటు మోసం చేస్తున్నా ఈ కార్మిక నాయకునికు పట్టలేదు. ఇప్పటికి పది వారాలనుండి బట్వాడా యివ్వనందువల్ల కార్మికులు పస్తులుంటున్నా ఈ కార్మిక జనోద్ధారకులకు అదికూడ పట్టలేదు.

కార్మికులదగ్గర సభ్యత్వరుసుం వసూలు చేస్తూ సంవత్సరాలు గడుస్తున్నా పట్టణ పొగాకుకార్మిక సంఘాన్ని రిజిష్టరు చేయించాలన్న జ్ఞానం ఈ పెడివాద ముఠాకు కలగలేదు. కార్మికులెట్లా పోయినా కార్మిక సంఘం మాత్రం తమ జేబు సంస్థగా వుండాలి. అనేక అవకతవకలను, ఈపెడివాద దుందుడుకు ముఠా ప్రదర్శించి, ఒంటెత్తుతనంగా నిరాహార వ్రతం చేసినా సమస్య దృష్ట్యా దానిని భగ్నం చెయ్యవలసిన అవసరం కమ్యూనిస్టు పార్టీకి లేదు. మేమందుకు పూనుకోలేదు.

వాస్తవ మిలా వుండగా తమ ఒంటెత్తు పోకడను కప్పిపుచ్చుకొనేందుకు పొలికేకలతో ప్రకటన చేయుటం సత్యాన్ని వధించటమే.

గతంలో తమ స్వార్థం ముందు పరార్థం మరచి ఆదరణ రీత్యా మేనేజిమెంటుకు లొంగిపోయినందువల్ల కార్మికులలో నష్టపడిన తమ ప్రతిష్టను తిరిగి సంపాదించటానికి ఎంతటి నీచానికైనా తలపడుతున్న ఈ పెడివాదుల నైజాన్ని గమనించవలసినదిగాకోరుతున్నాను.

కేంద్ర కార్మికమంత్రికి విజ్ఞప్తి

ఆం. ప్ర. పంచదార కార్మిక సమాఖ్య రాయబారం

ఏలూరు, అక్టోబరు 17

కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ డి. సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ పంచదార కార్మిక సమాఖ్య తరపున నిన్న శ్రీ ఎం. భావనాచారి నాయకత్వాన ప్రతినిధి వర్గం ఏలూరు మకాములో కలుసుకొని ఒక మెమొరాండము నిచ్చారు. బోనసు కమిషనురిపోర్టును అమలుజరపడంలోను, చట్టం చేయడంలోను తున్న ఆలస్యానికి ఆ మెమొరాండం ఆందోళన ప్రకటిస్తూంది.

ఈ విధంగా ఆలస్యం జరుగుతుండటం వలన ప్రతివారికి ఏవిధంగా ఇబ్బందులు కలుగుతున్నదీ దానిలో చాలా వుదాహరణ లిచ్చారు.

నవంబరు 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశం బోనసు కమిషను రిపోర్టును బిల్లు రూపంలో ప్రవేశపెడతామనీ, కార్మికుల కనుకూలంగా అది చట్టం చేయబడగలదనీ మంత్రి శ్రీ సంజీవయ్య ప్రతినిధి వర్గానికి హామీ యిచ్చారు.

సభలు - సమావేశాలు

ఈ నెల 26 వ తేదీన గూడూరులో డివిజన్ కమ్యూనిస్టుపార్టీ మహాసభ జరుగుతుంది, జిల్లాపార్టీ తరఫున శ్రీ ఎం.శంకరయ్య, శ్రీ పి రామకోటయ్యగారు పాల్గొంటారు.

శ్రీ బత్తుల సింహాద్రిరావు మృతి

అంతర్వేదిపాలెం, అక్టోబరు 19

తూర్పు గోదావరిజిల్లా, రాజోలు తాలూకా అంతర్వేదిపాలెం గ్రామానికి చెందిన శ్రీ బత్తుల సింహాద్రిరావుగారు యిటీవల విశాఖపట్నంలో మరణించారు. ఈయన విశాఖపట్నంలో యం బి బి యస్. ఆఖరుసంవత్సరం చదువుచున్నారు.

వీరు 1947 నుండి పార్టీ సభ్యులుగా యుంటూ పార్టీ కార్యకలాపాలలోపాల్గొనేవారు. 1948 - 50 మధ్య కాలంలో పార్టీ ప్రభుత్వ నిర్బంధానికి గురైనప్పుడు కూడా పార్టీ కార్యకలాపాలకు సహకరించుచూ యుండేవారు.

వీరి మరణానంతరం విశాఖపట్నంలో 1000 మందితో సంతాపసభ జరిగింది. కాలేజి ప్రిన్సిపాల్ సభలో మాట్లాడుచూ సంతాపం తెలియజేశారు. వారంతా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గోపాలపురం చుట్టుపట్ల గ్రామాలకు బియ్యం సప్లయికి నిరాకరణ

గోపాలపురం, అక్టోబరు 18

పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరుతాలూకా గోపాలపురం బ్లాకు సెంటరైవుండి కూడా యిక్కడి ప్రజలు కిలో 1కి బియ్యం 75 పైసలనుండి 80 వరకు కొనుక్కోవలసివస్తున్నది. దసరానాటినుండి బియ్యం కిలో 1కి 66 పైసలకు రేషను 'పద్ధతులలో గ్రామవాసులకు మాత్రమే. అమ్ముతున్నారు. గోపాలపురం చుట్టుపట్ల ఒకటి, రెండు మైళ్ళదూరంలో వాదాలకుంట, కోమటికుంట, కందర్లగూడెం, నందిగూడెం, గుడ్డిగూడెం, వేళ్ళచింతలగూడెం, అచ్చియ్యపాలెం, బుచ్చయ్యపాలెం మొదలయిన పది పన్నెండూళ్ళు గోపాలపురం మీదనే ఆధారపడివున్నాయి. వారానికి ఒకరోజు గోపాలపురములో సంతలపటు మూలంగా అదేరోజు సంతకు వచ్చిన చుట్టుపట్ల గ్రామస్తులు ఆహారపదార్థాలను కొనుక్కోవలసి వున్నది. అయితే ఇటువంటివారికి యివ్వడం లేదు. ఆ యా గ్రామాలలోని వర్తకులు చిన్నవారు కావడం మూలంగాను, బియ్యం తీసుకువచ్చి అమ్మే స్థితిలో లేకపోవడం చేతను బియ్యం దొరక్క ప్రజలు చాలాబాధలు పడుతున్నారు. ఒకవేళ యెవరివద్దనైనా వుంటే కిలో 1కి 80 న.పై చొ॥న అమ్ముతున్నారు.

కందుకూరు తాలూకా, కమ్యూనిస్టుపార్టీ మహాసభ

కందుకూరు, అక్టోబరు 18

కందుకూరు తాలూకా కమ్యూనిస్టు పార్టీ 5వ మహాసభ యీ నెల 13, 14 తేదీలలో కొండపి గ్రామంలో జరిగింది. ఈ మహాసభకు తాలూకాలోని 80 మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించుచూ 25 మంది పార్టీ సభ్యులు, 11 మంది క్యాండిడేట్ సభ్యులు హాజరైనారు. మహాసభ అధ్యక్షవర్గముగా శ్రీయుతులు జి. వరదరాజు, యం. వి. రమణయ్య గార్లను ఎన్నుకున్నారు. జిల్లా సమితి నుండి శ్రీ జి. వి. పద్మనాభయ్యగారు హాజరయినారు.

శ్రీ కె. రాములు తాలూకా సమితి కార్యదర్శి 4 వ మహాసభ నుండి 5 వ మహాసభ వరకు పార్టీనిర్మాణ రాజకీయకార్యక్రమాల నివేదికను ప్రవేశ పెట్టారు.

శ్రీ జి. ఎ. పద్మనాభయ్యగారు ముసాయిదాపై వివరణను, రాజకీయ నివేదికను సోదాహరణంగా వివరించారు. ప్రతినిధులు అడిగిన చాలా ప్రశ్నలు అనుమానాలపై సమాధానం ఇచ్చారు.

తర్వాత తాలూకా కమిటీకి 15 మందిని నిర్ణయించింది. 12 మందిని ఎన్నుకుని మిగతా వారిని నిర్ణయించుకొనుటకు సమితికి అధికారం ఇచ్చారు.

జిల్లా మహాసభకు 23 మందిని ప్రతినిధులను 10 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులను ఎన్నుకొన్నారు.

వినుకొండలో కలరా: నలుగురి మృతి

వినుకొండ, అక్టోబరు 19

వినుకొండలో కలరా, తీవ్రముగాయున్నది. నలుగురు చనిపోయినారు 10 మంది గవర్నమెంటు ఆస్పత్రిలో యున్నారు. రెండు రోజులనుండి పల్లోల మిఠాయి దుకాణములు కాఫీ హోటళ్లు అన్ని మూసివేసినారు.

మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శనలు

విజయవాడ, అక్టోబరు 21

ఆంధ్ర మున్సిపల్ అండ్ లోకల్‌బోర్డ్సు ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ బ్రాంచి ఆధ్వర్యాన 13న "మున్సిపల్‌కార్మికుల కోర్కెల దినం" జరిగింది. ఆ సందర్భమున స్థానిక మున్సిపల్ కార్మికులు షుమారు 500 మంది రు. 5 లు కరువుభత్యాన్ని శానిటరీ, ఇంజనీరింగు వర్కర్సుకు వర్తింపజేయాలని, రు. 2 లు కాంపెన్సేటరీ అలవెన్సును విజయవాడ మున్సిపల్ కార్మికులకు అమలు జరపాలని నినాదాలిస్తూ వూరేగింపు తీశారు. ఆఫీసు ఆవరణలో శ్రీ సోమి రాములుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగినది. రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బూరాత సీతారామయ్య, స్థానిక యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కుసాకుల సింహాచలం, కార్యవర్గ సభ్యులు శ్రీ భూపతి ఎలారావుగారలు మున్సిపల్ కార్మికుల కోర్కెలను వివరిస్తూ మాట్లాడినారు.

తొలిదొల్తి రిక్షా కార్మిక నాయకులు శ్రీ గొట్టేటి కొండలరావు అకాలమరణానికి సానుభూతిని ప్రకటిస్తూ తీర్మానించారు.

మున్సిపల్ కార్మికులందరినీ పర్మనెంటు ఉద్యోగస్తులుగా పరిగణించి కాంపెన్సేటరీ అలవెన్సు రు 2/- లు కరవుభత్యం రు 5/- పాతబకాయిలతో సహా అమలు జరపాలని కోరుతూ తీర్మానించారు.

విజయవాడలో సిబ్బందిని పెంచాలనీ 1962-63, 1963-64 రెండు సంవత్సరాల దుస్తుల వెంటనే మున్సిపల్ కార్మికులకు అందరికి యివ్వాలనీ, రూ 26-3 40 జీతం స్కేలు నిర్ణయించాలనీ, మున్సిపల్ కార్మికులకు ప్రత్యేకముగా చౌక డిపోలు తెరచి జీవితావసర వస్తువులనన్నీ వాటిద్వారా సప్లయి చేయాలనీ మొదలగు తీర్మానాలు చేశారు.

ఏలూరులో

ఏలూరు మునిసిపల్‌వర్కర్సు యూనియన్ తరఫున యూనియన్ కార్యవర్గంవారు మునిసిపల్ కమిషనరుకు ఈ నెల 13న, 18 కోర్కెలుగల మెమొరాండాన్ని సమర్పించారు. కమిషనరు దీనిని సావధానముగా విని ఒక వారం రోజులలో వ్రాతపూర్వకముగా సమాధానము పంపగలమని చెప్పారు.

ఆ తరువాత మునిసిపల్ ఆఫీసు ఆవరణలో యూనియన్ అధ్యక్షులైన శ్రీ ఏ. వి. సుబ్బారావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. మునిసిపాలిటీలో పని చేసే స్త్రీ. పురుష కార్మికులంతా పాల్గొన్నారు. కార్యదర్శి శ్రీ ఎస్. పి. రాజు మెమోరాండంలో విషయాలువివరించారు. తరువాత సుబ్బారావుగారు గత ఆగస్టు 13 న విజయవాడలో జరిగిన రాష్ట్ర సంఘ నిర్ణయాలను వివరించారు.

"తక్కువ సిబ్బందికి అదనపు కరువుభత్యం యిస్తూ మునిసిపల్ కార్మికులకు మాత్రం యివ్వకపోవటం చాలా అన్యాయం. ఆ అదనపు కరువుభత్యాన్ని బకాయితోసహా యివ్వవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఒకే స్వభావంగల పనిచేస్తున్న యితర డిపార్టుమెంటులలో తోటీలను 4 వ తరగతి పనివారుగా ప్రభుత్వం గుర్తించివారికి 26-1-40 స్కేలును అమలుచేస్తున్న విధముగానే మునిసిపల్ కార్మికులకుకూడా 4 వ తరగతి పనివారిగా ప్రభుత్వం గుర్తించి, 26-1-40 స్కేలును వీరికికూడా వర్తింపచేయాలి" అని తీర్మానించారు.

ఇప్పటికి 3 సార్లు తమ్మిలేటి వరదలకు గురై యిండ్లను కోల్పోయి విశేష నష్టానికి గురైన మునిసిపల్ కార్మికులకు ఒక నెల జీతం సహాయంగా గ్రాంటు చేయవలసిందని మునిసిపల్ కమీషనరును కోరుతూ తీర్మానించారు.

తీర్మానములను ముఖ్యమంత్రికి, స్థానిక స్వపరిపాలన మంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపినారు.

బాపట్లలో

రాష్ట్రమునిసిపల్ అండ్ లోకల్ బోర్డ్సు ఎంప్లాయీస్ యూనియన్ నిర్ణయానుసారం బాపట్లలో ఈ నెల 13 న పబ్లిక్ హెల్తు, మలేరియా, వర్క్సు, గార్డనర్ మొదలగువారి వారందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రదర్శన జరిపారు. తమకోర్కెలతో మున్సిపల్ స్పెషల్ ఆఫీసరుగారికి మెమోరాండం యిచ్చినారు. ఇవన్నీ న్యాయమైన కోర్కెలు కాబట్టి ప్రభుత్వానికి తెలియపరుస్తామని, వారాంతపు సెలవు వెంటనే అమలు జరుపుతావని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులకు ఆయన హామీ యిచ్చినారు. సాయంత్రం మునిసిపల్ వర్కర్సు కాలనీలో యూనియన్ అధ్యక్షులు శ్రీ యం. హనీఫ్‌గారి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

వారి క్రింది తీర్మానాలను ఆమోదించారు.

రు 5-0-0 కరువుభత్యం, రు 8.00

(మిగతా 4వ పేజీలో)

అప్పు పొందండి

కాకట్టు లేకుండా డబ్బు అప్పుగా యివ్వబడును. తిరిగి నెలసరి వాయిదాలమీద చెల్లించవచ్చును. వివరములకు ఇంగ్లీషులో వ్రాయండి.

CITIZEN TRADERS (Va)-
BOMBAY - 54.

కోరింత దగ్గు అనే కక్కాయ దగ్గుకు



స్టోకువారి కొంగ మార్కు మందు ప్రాణదానమిచ్చును. పిల్లలకు సంభవించు కోరింత దగ్గుకు నిరపాయకరమైన మందు. 8 అమావాస్యలు పోవలయునని యేమారవద్దు. 8 రోజులలో తప్పక గుణమిచ్చును. ఆంధ్రలో అన్ని మందుల షాపులలో దొరకును.

జి. ఎస్. స్టియర్స్ & కో.,
మద్రాసు-1.
ఆంధ్రప్రదేశ్ కు సోల్ డిస్ట్రిబ్యూటర్లు
సిటీ ఫార్మా డిస్ట్రిబ్యూటర్సు,
రాంగోపాల్ వీధి, విజయవాడ-1.

Woodolite
HIGH GLOSS EXTERIOR FINISH
వుడొలైట్ అత్యుత్తమమైన రెడీ మిక్స్‌డ్ పెయింట్
ఏషియన్ పెయింట్స్
Aiyars AP. 548 TEL



శ్రీమతి కమలాదేవికి సన్మానం

రాజమండ్రి, అక్టోబరు 18

రాజమండ్రి దేవీ చౌకులో దేవీ నవరాత్రి మహోత్సవములలో అనేక నాటకాలను ప్రదర్శించినవిజయవాడ శ్రీనేషనల్ మహిళామండలి అధ్యక్షురాలు శ్రీమతి అబ్బూరి కమలాదేవికి సన్మానం జరిగింది. ఆమె తన మహిళాబృందం వారితో సహా ఈ ఉత్సవాల్లో పాల్గొనింది.

ఈనెల 13 వ తేదీన దేవీ ఎగ్జిబిషన్ హాలులో జరిగిన సన్మానసభలో శ్రీమతి కమలాదేవికి మంత్రి శ్రీ అహమ్మదు అలీఖాన్ గారిచే నూతన వస్త్రములు, రజిత పాత్ర ఆమెకు బహూకరింప బడినవి.

రేడియో

శనివారం, అక్టోబరు 24

శక 1886 ★ కార్తీక 2

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు: 6-40 అం. వా: 6-45 శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం: 6-55 సూక్తి ముక్తావళి. 7-00 తె. వా: 7-15 పలగీత శిక్షణ; 7-30 వాద్యబృందము: 8-00 అం. వా. 8-15 ప్రాంజలి: 8-30 గాత్రసంగీతం, 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 హై. రిలే: 1-00 రేడియో కళాశాల, 1-30 వార్తలు-వ్యాఖ్యలు: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 బొమ్మరిల్లు: 3-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాం. వా: 6-15 హై. రిలే: 6-20 గ్రామస్థులకు, 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు, 7-30 పోటీ ఆటల సమీక్ష: 7-40 పల్లెపాట: 7-45 ఏకప్రసంగం (రూపకం): 8-00 కల్పలత-శ్రోతలు కోరినపాటలు: 8-30 రేడియోన్యూస్‌రీల్, 8-45 లలితసంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున, 9-25 విరామసంగీతం: 9-30 ఢి. రిలే. 11-00 అం. వా: 11-05సమాప్తి- జన గణ మన.

హైదరాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ: 6-40 అం. వా: 6-45 ఎ. రిలే: 6-55 సూక్తిముక్తావళి. 7-00 తె. వా. 7-15 సంకీర్తనం: 7-30 గానసుధ: 7-45 ఖవ్వాలి. 8-00 అం. వా: 8-15 ఎ. వలె: 8-30 వి. వలె: 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 మా॥ పాఠశాలలకు (ఉర్దూ), 12-15 హై. బి. వలె: 12-30 కార్మికులకు, 1-00 ఎ. రిలే: 1-30 స్వరవల్లరి, 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 బుగమ్ సంగీత్, 2-10 ఉ. వా: 2-20 చహల్ పహల్. 2-55 శ్రోతల ఉత్తరాలకు - జవాబులు (ఉర్దూ), 3-00 కన్నడ శ్రోతలకు, 3-15 మరాటీ శ్రోతలకు: 3-30 బాలానందం 4-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా. 6-15 ప్రస్తుతాంశం: 6-20 హై. బి. వలె: 7-00 తె. వా: 7-15 హై బి. వలె: 7-30 చిత్రసీమ: 7-45 ఎ. రిలే: 8-00 హై. బి. వలె: 8-20 ప్రసంగం(ఉరూ): 8-30 ఢి. రిలే: 8-45 ఈ మాసపుపాట: 8-50 విరామ సంగీతం, 8-55 ప్రస్తుతాంశం, 9-00 అం. వా. 9-15 ఉ. వా: 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం, 11-00 అం. వా: 11-05 సమాప్తి - జన గణమన.

హైదరాబాద్ - బి

కడప

265.1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

---

30 42 మీ (9855 కిలోసై)

(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై.ఎ.వలె: 7-45 సమాప్తి

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఎ. వలె, 9-00 సమాప్తి.

42 02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నము: 11-45 కల్పకం బాలసుబ్రహ్మణ్యం, 12-30 హై. ఎ. వలె: 2-01 నాదస్వరం. 2-10 లలితసంగీతం: 2-30 వీణ, 3-30 హై. ఎ. వలె: 4-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు: 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు, 7-30 హై ఎ. వలె: 8-00 గాన మాధురి: 8.45 హై. ఎ. వలె: 9-15 జానపద గేయాలు: 9-30 హై. ఎ. వలె: 11-05 సమాప్తి - జనగణమన.

మద్రాస్ - బి

311.3 మీ (1420 కిలోసై)

60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం. వా: 6-45 మంగళగానం: 7-00 తె. వా: 7-15 సుప్రభాతం. 7-30 మ. ఎ. వలె, 8-00 అం. వా: 8-15 సమాప్తి.

మధ్యాహ్నం: 1-00 మ. ఎ. వలె: 1-30 అం. వా: 1-40 గీతమంజరి: 1-50 తె వా: 2-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా: 6-05 మ. ఎ వలె: 6-20 వాతావరణ సూచన, స్థానిక ప్రకటనలు వాణిజ్యవార్తలు (ఆంగ్లం): 6-30 కార్యక్రమ వివరణ - తమిళం: 6-35 క్లారినెట్: 7-00 తె. వా: 7-15 సంగీతమూలు: 7-30 ఢి. రిలే: 8-30 ఇ. రామచంద్రన్ చెట్టియార్: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున: 9-30 ఆంగ్లప్రసంగం, 9 40 విరామ సంగీతం: 9-45 పాశ్చాత్యసంగీతం: 11-00 అం. వా: 11-05 సమాప్తి - జనగణ మన.

తిర్మలగిరిలో ఆర్. ఎస్. ఎస్. జనసంఘ్‌వారి దౌర్జన్యాలు

ఎన్నికలలో పోటీపార్టీవారు వారికిచ్చిన మద్దత్ ఫలితం

సూర్యాపేట, అక్టోబరు 17

ఇటీవల నల్లగొండజిల్లా తిరుమలగిరి పంచాయతీ ఎన్నికలలో విజయం పొందిన జనసంఘం వారు ప్రజలపై తమ దౌర్జన్యాలను బాగా హెచ్చింపు చేశారు.

ఈ విషయాలను సమూలంగా వివరిస్తూ, తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ ఎం. అనంతరెడ్డిగారిలా ప్రకటిస్తున్నారు:

"నల్లగొండ జిల్లా సూర్యాపేట తాలూకా తిర్మలగిరి గ్రామములో ఈ మధ్యన ఆర్. యస్. యస్., జనసంఘంవారి దుశ్చర్యలు శ్రుతి మించినవి. 1961 లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో జనసంఘం పేర పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుండి 1964 పంచాయతీ ఎన్నికల వరకు తీవ్రకృషి చేశారు. తొండ, రామవరము మొదలగు చుట్టుపట్ల గ్రామాల భూస్వాములు, ప్రజా వ్యతిరేకులు ఏకమైనారు. దురదృష్టవశాత్తు ఉదేసమయములో కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలింది. పోటీపార్టీవారి పుణ్యమా అంటు జనసంఘం వారు, పంచాయతీ ఎన్నికలల్లో విజయం సాధించారు. మొత్తం నల్లగొండజిల్లాలో వారు ఈగ్రామమొక్కటే గెలుచుకున్నారు. విజయగర్వం వారిని అంధులనుచేసింది. ముఖ్యంగా గ్రామములో అమాయకులు, బీదలైన హరిజనులను వెంటవేసుకొనికొడి చర్యలకుదిగారు. తిరుమలగిరి గ్రామాన్ని ఆధారం చేసుకొని ఆర్. యస్. యస్., జనసంఘంవారు ప్రచారము మొదలు పెట్టి తాలూకాలోని చాల మంది భూస్వాములను, అభివృద్ధి విరోధకులను కాంగ్రెసు చెడుపరిపాలన వలన అసంతృప్తి చెందిన యువకులను కాంగ్రెసులోనే ఉన్న కొందరు భూస్వామ్య శక్తులను వీరందరిని ఏకంచేసి ఈమధ్య అక్టోబరు 5 న సూర్యాపేటలో ఆర్. యస్. యస్. వారు ఒక ప్రదర్శనజరిపారు. దానికి పట్టణంలో పెద్ద వ్యాపారవర్గము, కాంగ్రెసుమీద అసంతృప్తి చెందిన (పదవీవ్యామోహులు) యువకులు బాగాసహాయపడ్డారు. కాంగ్రెసులోనే ఉన్న కొందరు అభివృద్ధినిరోధకులుకూడ సహాయపడ్డారు. ఆ సమావేశంలో శ్రీ గోల్వాల్కార్ గారు మాట్లాడిన విషయాలను, వారి సమీకరణను చూచిన అభివృద్ధికాముకులు, అల్ప సంఖ్యాకులైన ముస్లిం ప్రజలు కలత చెందారు. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా మత తత్వానికి స్థానం లేకుండా అయిన సూర్యాపేట తాలూకా కేంద్రాలలో కూడ వీరి పలుకుబడి పెరగడం, యిక్కడి ప్రజాస్వామిక అభివృద్ధి కాముకుల నిర్లక్ష్యం, వారినట్ల పోటీపార్టీవారి సహకార వైఖరికొంతవరకు కారణమనడానికి ఎలాంటి సందేహం లేదు.

మొత్తంమీద తిరుమలగిరి పంచాయతీ ఎన్నికలల్లో విజయము సూర్యాపేటలో వారి సమావేశం ఫలితంగా తిరుమలగిరి ఆర్. యస్. యస్. జనసంఘ నాయకుడైన నెమరుగొమ్ముల సీతారాంరావు (పెద్ద భూస్వామి) గారి తల తిరిగిపోయింది, ఇంకేముంది: గ్రామములో గూండాయిజానికి తలపడ్డారు. మొట్టమొదట కొందరు హరిజనుల ద్వారా, యూరపెల్లి రామయ్య అనే ఒక సావుకారి యింట్లోపడి రెండు బస్తాల ధాన్యం తీసుకవచ్చారు. ఆ తర్వాత సంకెపల్లి లాంరెడ్డి అతని యింట్లో ధాన్యం దోయుడానికి పోతే గ్రామస్థులంతా ఏకమై అది సాగనివ్వలేదు. ఈ విషయం సూర్యాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టరుకు రిపోర్టు చేసినా ఎవరూ చర్య తీసుకోలేదు. దానితో ప్రజలలో, బీదరైతులలో భయ భీతాహము కలిగింది.

తమ పైన్లకు [illegible] రక్షణ లేదనే భావం కలిగింది. రౌడీ చర్యలను బాగా ప్రోత్సాహించడం మొదలు పెట్టారు. గ్రామములో భూమిలేని పేదలు, బంచరాయి కాస్తుకార్లు అంతా కలసి చాలాకాలం నుండి సీతరాంరావు కంచలోవున్న 25 ఎకరాల బంచరాయి భూమి గురించి రెవిన్యూ అధికార్ల దృష్టికితెచ్చి దానిని పార్టీ మరియు కొందరి స్వతంత్రుల నాయకత్వాన బయటికి తీయ దాము. ఇది ఆర్. యస్. యస్. నాయకునికి గిట్టలేదు. పేదలకు మాత్రం భూములెందుకని 10, 15 సంవత్సరములనుండి కాస్తుచేస్తున్నబంచరాయిభూములు చిన్నరైతుల పట్టా భూములల్లోని పైర్లు మేపించారు. వేరు సెనగకాయ దోయించారు. ఆ విధంగా 10-10-64 తేదీన అక్కల మల్లయ్య, మెండె బద్రయ్య, జన్ని చంద్రరెడ్డి మొదలగు వారిని 15 బస్తాల వేరుసెనగకాయ దోయించారు. నాల్గు ఎకరాల లోని కందిచేను, 6, 7ఎకరాలల్లో బద్రుకొన్న మొలకలను మేపించారు.

తొండ, రామవరములోని పెలపు దొరల వద్దనుండి తుపాకులు తెప్పించారు. చుట్టుపట్ల గ్రామాలలోని తన అనుయాయులను పిలిపించి గ్రామములో ప్రదర్శన చేయించారు. మూల అనంతరెడ్డిని చంపిన వారికి అయిదువేలు ఖర్చు అయినా పెట్టుకుంటానని పుకారులు బయలుదేరతీశారు. ఆ విధంగా గ్రామములో భయభీతాహము కల్పించి పార్టీనుండి ప్రజలను దూరంచేయ జూచారు. ఇదంతా జరుగుతున్నా పోటీపార్టీవారు ఏమీ పట్టనట్లు వూరకున్నారు ఇదే సీతారాంగారికి తొండ గ్రామంలో 120 యకరాల బంచరాయి అక్రమంగా పెట్టుకుంటే పార్టీ ఐక్యంగా వున్నప్పుడు పెద్ద పోరాటంద్వారా అందులోనుండి కొంతభూమి బీదప్రజలకు పట్టాలు చేయించగలిగాము. ఇంక 60, 70 యకరాలు వుంచి.తిరుమలగిరిలో 25 యకరాలు వున్నవి. ఈ గ్రామాల ప్రజలు ఈ భూస్వామి నుండి బంచరాయి తీయించడానికి పేదప్రజలకు కిస్తుకు యిప్పించడానికి తీవ్రపోరాటం చేయవలసి వస్తున్నది. ఈ ఘటనలన్నీ సూర్యాపేట ఏ. యస్. ఐ. కి ఫిర్యాదు చేయబడినవి. జాబువచ్చి. వేరుసెనగ కాయ దొంగిలించినవి. పైర్లు ఎడ్లపులతో మేపించినవి. సీతారాంగారిలో చుట్టుపట్ల గ్రామాలనుండి తెచ్చినమందిని తుపాకులను మొదలగు విషయాలను విచారణ చేసుకపోయ్యారు. బంచరాయికాస్తుదార్లలో అస్థిరత కల్పించడానికి తద్వారా ఆభూములు కాస్తుచేయకుండా చూడడానికి సీతారాంరావు తీవ్రప్రయత్నం చేయుచున్నారు. తిర్మలగిరిగ్రామ ప్రజలు ఏ. యస్. ఐ. కి ఒక మహజరుకూడా పెట్టుకొని గ్రామములో శాంతిభద్రతలకు భంగం కల్గించుతున్న ఈ భూస్వామిని అదుపులో పెట్టకపోతే తీవ్రపరిణామాలుంటాయని అందులో తెలియపర్చారు.

తిరుమలగిరి గ్రామములో జనసంఘానికి వ్యతిరేక పోరాటం ఒకవిధంగా మొత్తం తాలూకాలోని భూస్వామ్య వ్యతిరేక పోరాటం. బంచరాయి కిస్తుదార్ల రక్షణపోరాటం అనే విషయం కాను దృష్టిలో పెట్టుకుంటే, ఈ విషయంలో పోటీపార్టీవారు, యితర స్వతంత్ర ప్రజాస్వామిక వాదులంతా ఈ గ్రామ పరిస్థితులను తెలుసుకోవాలని మాకు సహాయపడాలని గ్రామ కమ్యూనిస్టుపార్టీశాఖ కార్యదర్శి తాలూకాకమిటీ సభ్యుడుగా విజ్ఞప్తిచేస్తున్నాను."

రేపల్లె పట్టణ కమ్యూనిస్టు మహాసభ

రేపల్లె, అక్టోబరు 19

రేపల్లెపట్టణ 3 వ కమ్యూనిస్టుపార్టీ మహాసభ యిసుకపల్లిలో 18 వ తేదీన జరిగినది. 82 మంది ప్రతినిధులు హాజరయినారు. సభకు శ్రీ అడ్డెపల్లినాగయ్య, సాదు హనుమంతరావు (కౌన్సిలరు), కొల్లూరు మస్తానుగార్లను అధ్యక్షవర్గంగా ఎన్నుకొన్నారు. సమావేశమునకు తాలూకా కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజింగు కమిటీ కార్యదర్శి శ్రీ కాట్రగడ్డ వెంకట రామయ్య హాజరయినారు.

శ్రీ వెలుగొటి బలరామయ్యగారు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టినారు. గత మహాసభ నుండి పార్టీచేసిన కార్యకలాపాలు వివరించారు.

శ్రీ మేకా రామకోటేశ్వరరావు గత మహాసభనుండి మునిసిపల్ పరిపాలనా పనులవిషయము యిప్పటివరకు జరిగినది సమీక్షచేసినారు.

చర్చల అనంతరం ఇంతకుపూర్వంవున్న పట్టణంలోని 3 శాఖలను 5 శాఖలుగా పునర్నిర్మించి కమిటీ ఎన్నికలు జరిపారు.

కోవిలంపాడు గ్రామశాఖ

కోవిలంపాడు, అక్టోబరు 20

కనిగిరి తాలూకా కోవిలంపాడు గ్రామ కమ్యూనిస్టుశాఖసమావేశం 14వతేదీనజరిగింది. సభలో తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ పాద్మామియ్యాగారు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోని విభేదాలను, జాతీయ సమితి నిర్ణయాలను పోటీపార్టీవారి వైఖరిని వివరించారు. జాతీయ సమితిచేసిన అంతర్జాతీయ తీర్మానాలను, భారత కమ్యూనిస్టుపార్టీకార్యక్రమముసాయిదాను ఏకగ్రీవంగా ఆమోదించారు.

నడకుదురు సెంటరు పార్టీ సమావేశం

నడకుదురు, అక్టోబరు 19

నిన్న శ్రీ వాడెక్క వెంకటరత్నంగారి అధ్యక్షతన సెంటరు పార్టీసభ్యుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని శ్రీ చంద్ర రామలింగయ్యగారు వివరించారు. ఈ మధ్య జరిగిన పంచాయతీ బ్లాకు ఎన్నికల సమీక్షను కామ్రేడ్ మాలెంపాటి బాలభాస్కరరావుగారు ఇచ్చారు. నవంబరు మొదటివారంలో జరిగే తాలూకా పార్టీ మహాసభ యార్లగడ్డ గ్రామంలో జరుపుటకున్నూ, యీలోపుగా సెంటరు గ్రామాలన్నిటిలోనూ పార్టీ సభ్యత్వాన్ని చేర్చుటకు నిర్ణయం తీసుకొన్నారు.

నెల్లూరు పట్టణ కమ్యూనిస్టు పార్టీ మహాసభ

నెల్లూరు, అక్టోబరు 18

నెల్లూరు పట్టణ కమ్యూనిస్టుపార్టీ నాల్గవ మహాసభ ఈ నెల 18 న జరిగింది. 48 మంది పార్టీ సభ్యులు 18 మంది సానుభూతిపరులు యీ సమావేశానికి హాజరయినారు. శ్రీ పి. గోపాలరావు అధ్యక్షత వహించారు. పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని గూర్చి జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యం. శంకరయ్య వివరించారు. పిమ్మట శ్రీయుతులు పి. అనంతరామయ్య, జి. పి. తలం, శేశాం కృష్ణయ్య, పి. పి. సుబ్బరామయ్య, జి. శేషు రామిరెడ్డి, పి. రామకోటయ్యగార్లు మాట్లాడినారు. శ్రీ పి. రామకోటయ్య గత మహాసభనుండి నేటివరకు టౌన్ కమిటీపని పై నివేదికనిచ్చారు.

నెల్లూరు పట్టణ కమిటీ కోశాధికారి శ్రీ జి. శేషురామిరెడ్డి గత మహాసభ నుండి యిప్పటివరకు టౌన్ కమిటీ జమా ఖర్చుల నివేదికను ప్రవేశపెడుతూ పార్టీ ఆర్థిక పరిస్థితినిగూర్చి వివరించారు.

తర్వాత టౌన్ కమిటీ ఎన్నుకోబడింది.

భీమునిపట్నం తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ

భీమునిపట్నం, అక్టోబరు 20

విశాఖ జిల్లా, భీముని పట్నం తాలూకా కమ్యూనిస్టుపార్టీ మహాసభ ఈ నెల 16, 17 తేదీలలో చిట్టివలసలో జరిగింది. పార్టీ ముసాయిదా కార్యక్రమం మీద శ్రీ కె.వి.కె వల్లభరావు వుపన్యసించారు. దానిపై చర్చలు జరిగాయి. ఎతలోనూతన తాలూకాకమిటీ ఎన్నుకోబడింది.

పెదకూరపాడు శాఖ

పెదకూరపాడు, అక్టోబరు 20

గుంటూరుజిల్లా,సత్తెనపల్లి తాలూకా పెదకూరపాడు గ్రామశాఖ సభ్యుల సమావేశం అక్టోబరు 16 వ శ్రీ మాదినేని వెంకటప్పయ్య గారి అధ్యక్షతన జరిగినది. సభలో గ్రామ కమిటీ ఎన్నుకోబడింది పార్టీ కర్నీనల శ్రీ దళి పానకాలరావు సమావేశానికిహాజరైనారు.

బియ్యం ధరలు తగ్గించడ మెలాగ?

రాజమండ్రిలో చర్చాగోష్ఠి

రాజమండ్రి, అక్టోబరు 19

రాజమండ్రి ప్లాన్ ఇన్ఫర్మేషన్ ఫోరం అధ్వర్యాన నేటిసాయంత్రం స్థానికసమాచారం కార్యాలయంలో శ్రీ దామెర్ల వెంకట్రావుగారి అధ్యక్షతను "విపరీతంగా పెరిగే బియ్యం ధరల తగ్గించటం ఎలాగ?" అన్న సమస్యపై చర్చ జరిగింది.

శ్రీ ఎస్. కె. హరనాథ్ స్వాగతంచెప్పి, విషయాన్ని సభికులకు పరిచయంచేశారు.

శ్రీ యుతులు గంధ-సీతారామాంజనేయులు మద్దూరి శివరామకృష్ణయ్య, మంచిరాజు చంద్రశేఖరం, ఆర్. వి. పెంద్యాల, వరదా బ్రహ్మానందం, శ్రీ కాకోళ్ళ సత్యానందం ఎనుముల వెంకన్నదొరగారలు ప్రసంగించారు

ప్రభుత్వమే వ్యవసాయ దార్లనుండి నేరుగా ధాన్యాన్ని కొని ప్రభుత్వమే ప్రజలకు బియ్యం సరఫరా చేయాలన్నారు. 500 మందికి ఒక్కొక్క స్టోర్సుద్వారా సరఫరా చేయాలనీ, 15 మందికి మించి కార్మికులున్నచోట వారికి అయా సంస్థలద్వారా సరఫరా చేయాలన్నారు.

ఈ అధిక ధరలు కృత్రిమంగా సృష్టించ బడినవేకాని పదార్థాలు తక్కువై కాదని, ఆహార ధాన్యాలను కొంతమంది దాచడమే కారణమని, పెద్దరైతులు చిన్న రైతుల వద్ద కొని నిల్వలుచేసి, హెచ్చురేట్లకు అమ్మే పద్ధతిని అరికట్టాలని కోరారు. ధాన్యాల ధరలను నిర్ణయించిన ప్రభుత్వ పద్ధతిని కూడా విమర్శించారు.

శ్రీయుతులు పుచ్చేపు సూర్యనారాయణ, ఈదర కొండలరావు, తోలేటి కనకరాజు, కుకొండల శ్రీరామచంద్రమూర్తి, కారుమూరి సర్వేశలింగం, ద్వివేది లింగరాజుగారలు కూడా ప్రసంగించారు.

పై వారిలో కొందరు ప్రవేటు వ్యాపారాన్ని కూడా సాగ నివ్వాలని, వ్యాపారస్తులు హెచ్చు ధరలకు అమ్మినప్పుడుప్రభుత్వ నిల్వలను విడుదలచేయాలని, కంట్రోల్సు అనవసరమని స్వేచ్ఛా వ్యాపారం సాగనివ్వాలని కూడా చెప్పారు.

ఇందులో వివిధ రాజకీయ పార్టీలు, లాయర్లు, వర్తక ప్రతినిధులు, పత్రికా విలేఖరులు, వైద్యులుకూడా వున్నారు. (వి. వి.)

25 న మధిర తాలూకా కమ్యూనిస్టు మహాసభ

రాయన్నపేట, అక్టోబరు 19

ఖమ్మంజిల్లా, మధిర తాలూకా కమ్యూనిస్టు పార్టీ మహాసభ ఈ నెల 25 న ఉదయం 10 గంటలకు రాయన్నపేటలో జరుగుతుంది. రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ నల్లమలగిరి ప్రసాద్‌గారు హాజరౌతారనీ, ప్రతినిధులు వైరా - మధిర బస్సురూటులో కలకుంటవద్ద దిగవలెననీ, రైలుకు వచ్చువారు మోటమర్రి స్టేషన్‌లో దిగవలెననీ రాయన్నపేట శాఖ కార్యదర్శి శ్రీ తూము ప్రకాశరావుగారు వ్రాస్తున్నారు.

పాతపట్నం తాలూకాలో పోటీపార్టీతో తెగతెంపులు

మూకుమ్మడిగా అధికారపార్టీలో చేరిక

చీపురుపల్లి, అక్టోబరు 17

శ్రీకాకుళంజిల్లా పాతపట్నం తాలూకా పార్టీ మహాసభ ఈ నెల 15 వ తేదీని జాడుపల్లిలో జరుపబడింది. 24 గ్రామాలనుండి 82 మంది సభ్యులుహాజరయ్యారు. వీరుమొత్తం149మంది సభ్యులకు ప్రతినిధులు (ఈమధ్యనే పోటీపార్టీవారు పునరుద్ధరించిన మొత్తం సభ్యత్వం, వీరితో కలిపి 242) 6 గురు పాలక సభ్యులు గూడా హాజరయ్యారు.

ఈ సం॥ జూలై నెలలో సుందరయ్యగారికి ఈ జిల్లా పర్యటనలో రు 116/- విరాళం యిచ్చి, పోటీపార్టీ తా॥ మహాసభకు అధ్యక్షత వహించిన కామ్రేడ్ జీపు అన్నయ్య రెడ్డిగారే (కోదూరు) ఈ మహాసభకు గూడా ప్రముఖ కార్యత వహించారు.

అదినం జరిగినప్రతినిధుల సభకు కామ్రేడ్ పొట్నూరు తపుడు(పోటీపార్టీ కమిటీసభ్యుడు) శ్రీ బి. యస్. ప్రసాద్, అప్పాయినాయుడు గార్లు అధ్యక్షతవహించారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు హాజరయ్యారు. అప్పాయి నాయుడు రాజకీయ ముసాయిదా తీర్మానం గూర్చి వివరించారు. పోటీ పార్టీ వారు గత రెండు సంవత్సరాల నుండి ఎట్లా పార్టీ విచ్ఛిన్నానికి కృషి చేస్తూ వచ్చి యీ సంవత్సరం పిబ్రవరిలో పార్టీ నుండి విడిపోయి ప్రజాఉద్యమాలకుదూరంగాయుంటున్నదీఉదాహరణలతో వివరించారు. అధికారయుత కమ్యూనిస్టుపార్టీ నుండి ఎచ్చట విభేదించు తున్నదీ, వారి విధానాలు ఎలా ఒంటెద్దు పోకడకు దారి తీస్తున్నదీ విపులంగా చెప్పారు. తదనంతరం

ప్రభుత్వం గతంలో ప్రకటించిన ఆర్డినేన్సును రద్దుచేశారని పత్రికల్లో పడింది. కాని గిరిజన ఏరియాలో వేలఎకరాలు సాగుచేస్తున్న వారికి పట్టాలు లేవు. ప్రభుత్వం వెంటనే పట్టాలకై అర్డర్లు జారీచేయాలని.

ఆహార వ్యాపారంప్రభుత్వమే నిర్వహిస్తూ రిటెంయిపునుండే ధాన్యం కొనుటకు సిద్ధపడాలని తీర్మానించారు.

18 మందితోకమిటీ వేయబడింది. ఈ కమిటీకి కామ్రేడ్ జీపు అన్నయ్యరెడ్డి కార్యదర్శిగను, సవాల రామచంద్రుడు, పొట్నూరు తొడుగార్లతో కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకోవట మైంది.

సాయంత్రం 5 గం॥ లకు కామ్రేడ్ అన్నయ్యరెడ్డి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది.

ఆ రాత్రికే నూతన తాలూకా కమిటీ మీటింగు వేసి ప్రతినిధుల సభలో ఆమోదించిన తీర్మానాలను ఆచరణలో పెట్టుటకు దృఢ సంకల్పం తీసుకున్నారు.

ప్రతి శాఖకూ ఒక విశాలాంధ్ర తెప్పించుకోవాలని వేరొక నిర్ణయం చేయబడినది. పిదప అచ్చటకచ్చటే రు. 16 లు వసూలు చేసి డిపాజిట్టు కట్టి 5 పత్రికలతో వెంటనే ఏజన్సీని నెలకొల్పు పూనుకున్నారు.

ప్రతినిధుల సభలో ఆమోదించ బడిన దిగువ తీర్మానం ఈ సమావేశం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తుంది.

భారతకమ్యూనిస్టుపార్టీవిప్లవపందాను విడిచిపెట్టిందనియు, కాంగ్రెసులో కలసి పోతూందనియు శ్రీ సుందరయ్య, వారి అనుచరులు ఒక ప్రక్కవాదననే మాకు చెప్పుటవల్లను, రెండోవాదన తెలియనందున వార్నిపదానికి లోబడి పోటీ పార్టీలో మా సభ్యత్వం రెన్యూవల్ చేయడం, క్రొత్తవారిని చేర్పించడం జరిగింది.

ఈ నాడు మాకు తెలిసిన వివరాలనుబట్టి చూడగా, పోటీపార్టీ రాజకీయాలు భారతదేశ పరిస్థితుల కనుగుణ్యంగా లేవనియు, అవలు పార్టీ నిబంధనావళిని గూడా ఉల్లంఘించి పోటీపార్టీని స్థాపించుట మూలంగా ఐక్య ఉద్యమాలకే ముప్పుతెచ్చి పెట్టారని నమ్ముతున్నాం.

పార్టీ సభ్యులుగా చేరినపుడు "అభిప్రాయ భేదాలు వచ్చినపుడు బాహాటంగా చర్చించి మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి యుంటాను" అని చేసిన ప్రమాణాన్నే వీరు ఉల్లంఘించారని నమ్ముతున్నాం. ఈనిర్ణయంవలనస్థానికంగా కూడా పార్టీలో ఐక్య కార్యాచరణకు వీట్ల వదలడమే జరుగును.

వ్యక్తిగత ద్వేషాలతో నాయకులపట్ల దుష్ప్రచారం చేసి, తప్పుడు రాజకీయాలనే అనుసరిస్తున్న పోటీపార్టీ నుండి రాజీనామా చేయాలనియు అధికారయుత పార్టీలోనే తిరిగి సభ్యత్వ అర్హతను పునరుద్ధరించుకోవాలని ఈ సమావేశం తాలూకా పార్టీ సభ్యులను కోరుతూ తీర్మానించవలసినది.

ఖమ్మంజిల్లా యాదవసంఘ కార్యవర్గం

ఖమ్మంజిల్లా యాదవ సంఘ కార్యకర్తల సమావేశం యీ నెల 11 వ శ్రీ గోళ్ళ వెంకటేశ్వరరావు అధ్యక్షతను జరిగింది. అందులో కార్యవర్గము క్రింది వారిని ఎన్నుకొన్నారు. అధ్యక్షులు: శ్రీ గోళ్ళ వెంకటేశ్వరరావు. ఉపాధ్యక్షులు: శ్రీ సాంబా వెంకన్న, శ్రీ బోళ్ళ లక్ష్మయ్య. ప్రధాన కార్యదర్శి: శ్రీ చావలి కనకరాజు. సహాయ కార్యదర్శి: శ్రీ జి. పుల్లయ్య. కోశాధికారి: శ్రీ కనకబండి కొండయ్య; మరొక 20 మంది సభ్యులు.

రాజమండ్రి అల్యూమినియం కార్మిక సహకార సంఘ కమిటీ

రాజమండ్రి, అక్టోబరు 17

రాజమండ్రి అల్యూమినియం సర్క్యూట్స్ కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీ సర్వసభ్య సమావేశం మొన్న ఫ్యాక్టరీ అధ్యక్షులు శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరి అధ్యక్షతను జరిగింది.

కో ఆపరేటివ్ రిజిష్ట్రారు ఇండస్ట్రీస్ శ్రీ సారానాగరాజు పై సమావేశానికి హాజరైనారు.

శ్రీ ప్రభాకరచౌదరి 1961-62, 1962-63 సంవత్సరాల ఆడిటర్ నివేదికను ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆడిటెడ్ అక్కౌంట్సు ప్రకారం 1961-62 లో ఫ్యాక్టరీలో లాభం రు 7753/-లు 1962 - 63 లాభం రు 8469/-లు వచ్చింది. ఆడిట్ జరగని 1963 - 64 లో లాభం సుమారు 11500/- వుంటుందని చెప్పబడింది.

అందులో మొదటి రెండు సంవత్సరాలకు వచ్చిన సుమారు 16 వేల రూపాయల లాభం లోను పనివారికి 15 శాతం బోనస్సు వాటాదార్లకు 6½ శాతం డివిడెండ్లుగాను ఇచ్చారు.

నూతన సంవత్సరానికి శ్రీయుతులు చిట్టూరి ప్రభాకరచౌదరి, అల్లు అప్పారావు, దేవిడ్, మట్ట సూర్యారావు, పొడిపిరెడ్డి నారాయణ, సప్ప రామారావుగార్లు డైరెక్టర్లుగా ఎన్నికైనారు. (వి.వి)

కార్మికోపాధ్యాయులకు కేంద్ర కార్మికమంత్రిచే బహుమతీ ప్రదానం

విజయవాడ, అక్టోబరు 18

కేంద్ర కార్మికమంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు వరదలకు గురియైన ప్రాంతాల పర్యటన నిమిత్తమై యిచ్చటకు మొన్న విచ్చేసిన సందర్భంలో ప్రభుత్వ అతిథి గృహంలో విజయవాడ కార్మిక విద్యా ఉపకేంద్రపు కృతార్థులైన కార్మికోపాధ్యాయులకు యోగ్యతా పత్రము లందజేశారు.

విశాఖపట్నం కార్మిక విద్యారీజనల్ డైరెక్టరు శ్రీ యూసప్, విద్యాధికార్లు శ్రీ ప్ర. పార్థసారధి, శ్రీ వి. టి. గోపాలకృష్ణ, విజయవాడ కార్మిక విద్యా ఉపకేంద్ర విద్యాధికారి శ్రీ చింతా వెంకటేశ్వర్లుగార్లుగార్లు మంత్రికి స్వాగత మిచ్చారు. కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ అమీజర్ అలీఖాన్‌గారు కూడా సభకు హాజరైనారు.

సామర్లకోట విజ్ఞాన మండలి అధ్వర్యాన నడపబడనున్న "సంగీత పాఠశాలకు" ప్రారంభోత్సవము జరిగి ది. ఈ సభకు శిరోమణి విద్వాన్ శ్రీ మాన్ వి. యస్. యస్. రామానుజ స్వామి అధ్యక్షత వహించారు. శ్రీ దర్బారాంషాగారు పాఠశాలకు ప్రారంభోత్సవం జరిపారు దీనికి శ్రీ పి. జి. వి. నారాయణ గారు అధ్యాపకులు.

సెప్టెంబరు 25 వ తేదీ నుంచి నెల్లూరు హోటళ్ళలో ఉపాహారాల ధరలను పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 11 న తేదీన నెల్లూరు పౌరులసమావేశం తీర్మానం చేసింది.

విజయనగరంలో పౌరసంఘంఏర్పాటు

విజయనగరం, అక్టోబరు 19

విజయనగరం ప్రశాంత విహార్ హాలులో నిన్న శ్రీ వసంతరావు వెంకటరావుగారి అధ్యక్షతను పట్టణంలోవున్న ప్రముఖుల సమావేశం జరిగింది.

సమావేశకర్త శ్రీ తెళ్ళా గున్నయ్యగారు సభను ప్రారంభిస్తూ పట్టణంలో బియ్యం ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా నిలువలు కూడా లేనని వివరించారు.

శ్రీ మాటూరు సూర్యప్రకాశంగారు మాట్లాడుతూ నగరంలో జనాభాకు రోజుకు సుమారు 8 వందల బస్తాల బియ్యం అవసరం వుంటుందని ప్రస్తుతం 2 రోజులకు సరిపోయే బియ్యం మాత్రం వున్నదని తెలియవచ్చినదని అన్నారు అందువలన బ్యాంకులలోను. గ్రామసహకార సంస్థలలోను నిలవ పెట్టి అప్పులు వాడిన అన్ని నిలవలను, ఋణదాలవద్దవున్న దొంగ నిలువలను వెంటనే ప్రభుత్వము స్వాధీనం చేసుకుని కో-ఆపరేటివ్‌స్టోర్సు ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు అందచేయాల"ని శ్రీ ప్రకాశంగారు ప్రవేశ పెట్టిన తీర్మానమును సభలో ఆమోదించినారు.

ఇంకా ఈ దిగువ తీర్మానాలు చేశారు.

ధాన్యం, బియ్యం సేకరించి విజయనగరమునకు బియ్యం సరఫరా చేయాలి

తూర్పు గోదావరి, శ్రీకాకుళం, జిల్లాల నుండి విశాఖజిల్లాకు వచ్చే (బిల్లులు వున్న) బియ్యం లారీలను ఆటంకపర్చకూడదని తీర్మానించారు.

కో - ఆపరేటివ్‌స్టోర్సుద్వారానే గోధుమలు, గోధుమపిండి, నూక, కూడా సరపరా చేయించాలని తీర్మానించారు. సమావేశంలో పిటిజన్సు కమిటీ ఏర్పరచి శ్రీ వసంతరావు వెంకటరావు (యం. ఆర్. కాలేజీ ప్రిన్సిపాల్) గారిని అధ్యక్షునిగా శ్రీ పల్లవల్లి బ్రహ్మాజీ, శ్రీ తెళ్ళా గున్నయ్యగార్లను కార్యదర్ములుగాను, శ్రీ యస్. కె. జగన్నాథరావుగారిని కోశాధికారిగాను ఎన్నుకున్నారు.

పై తీర్మానాలను జిల్లా కలెక్టరు ఆహార శాఖామంత్రి, సివిల్ సప్లయి శాఖాధికారికి, ప్రభుత్వ కార్యదర్శి శ్రీ అనంతరామన్‌గార్లకు టెలిగ్రాంలద్వారా తెలియజేసినారు.

పై సమావేశానికి శ్రీ యస్. వి. గంగరాజు (యం.యల్.సి) తదితర ముఖ్యులు హాజరైనారు. శ్రీ అప్పన్నదొర (యం.యల్.సి.) శ్రీ జి. సూర్యనారాయణ (యం.యల్.ఎ) గార్లకు తెలియచేసినను సమావేశమునకు రాలేదు. (వి. వి.)

మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శనలు

(8 వ పేజీ తరువాయి)

కాంపెన్సేటరీ అలవెన్సు వెంటనే యివ్వాలి. 2. వర్క్ చార్జెడ్ కంటెన్‌జెన్సీ క్రిందవున్న పనివారిని అందరినీ 4 వ తరగతి వుద్యోగులుగా గుర్తించి 28-1-40 రూపాయలు స్కేలు అమలుజరపాలి. 3. కార్మికులకు ప్రత్యేకంగా చౌక డిపో ఏర్పాటు చేసి బియ్యం సప్లయి చెయ్యాలి. 4. జి. ఓ. ప్రకారం పనివారికంట్లు పెంచాలి.

నర్సాపురంలో

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం మున్సిపాల్టీ స్వీపర్లు, తోటీలు, మలేరియా సిబ్బంది మొదలగు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి, 13 వ తేదీన పనుల్లో ప్రవేశించారు. మధ్యాహ్నం మున్సిపల్ కమిషనర్ శ్రీ శేషయ్యగారికి సర్క్యులర్ల కనీస కోర్కెల విషయమై మహజరు ఇవ్వబడింది.

రాష్ట్ర సంఘం పిలుపు ననుసరించి జరిగిన ఈ "నిరసనదినం" జయప్రదంలో వర్క్-చార్జ్‌డు కంటెన్‌జెన్సీ పనివారలి పిలువబడే మొత్తం 85 గురు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో

తూర్పు గోదావరిజిల్లా ముమ్మిడివరం పంచాయతీ పనివారల సర్వసభ్య సమావేశం సంఘ ఆర్గనైజరు శ్రీ వనవర్ల సత్యనారాయణగారి అధ్యక్షతను జరిగినది. సమావేశంలో ధరల కనుగుణ్యమైన రీతిగా జీతాలు పునర్నిర్ణయించాలని, కాంపెన్సేటరీ అలవెన్సు పాత బకాయిలతో అమలు పర్చాలని, కావిటరీ పనివా రందరినీ 4 వ తరగతి పనివారుగా గుర్తించాలని తీర్మానించారు. ఆ తీర్మానాలనుపంచాయతీ శాఖ మంత్రికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుద్వారాఅందజేశారు సమావేశంలోనూ, ఆఫీసరువద్ద తెల్పిన రాయబారంలోనూ తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ చింతపల్లి కృష్ణమూర్తిగారు పాల్గొన్నారు.

రాజమండ్రిలో థియేటర్ నిర్మాణంపై ప్రభుత్వం వద్దకు రాయబారం

రాజమండ్రి, అక్టోబరు 17

రాజమండ్రిలో ఒక థియేటర్‌ను నిర్మింపడంలో అవసరమైన సత్వర చర్యలు తీసుకోడానికి, ప్రభుత్వ సహాయం పొందడానికి తగిన కృషి జరిగేందుకై నిన్న సాయంత్రం రాజమండ్రి మునిసిపల్ హాలులో ఒక సమావేశం జరిగింది శాసనమండలి సభ్యులు డా॥ శ్రీ తోలేటి కనకరాజు అధ్యక్షతను జరిగిన ఈ సభలో పట్టణంలోని వివిధ నాటక సంస్థల ప్రతినిధులు, కళాకారులు ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు.

థియేటరు నిర్మాణ కార్యక్రమాన్ని త్వరిత పరచవలసిన అవసరాన్ని సమావేశ కర్తగా వ్యవహరించిన శ్రీ తన్నీరు బుల్లయ్యగారు వివరించారు.

ఈ సమస్యలపై శ్రీ మద్దూరి శివరామ కృష్ణయ్య రచయిత్రి శ్రీమతి కోడూరి కౌసల్యాదేవి, శ్రీ పాదపట్టాభి, శ్రీ వాద్రేవు బాపిరాజు, శ్రీ యానంరెడ్డి వెంకట్రావు, శ్రీ ద్రోణంరాజు చిన కామేశ్వరరావు శ్రీ యేలూరి సూర్యారావు గారలు ప్రసంగించారు.

ఈ విషయంలో ప్రభుత్వం వద్దకు రాయబారంపెళ్ళడానికి శ్రీయుతులు తన్నీరుబుల్లయ్య, తోలేటి కనకరాజు, బోడుల వీరభద్రరావు, బత్తిన సుబ్బారావు కొండ్రు వీరన్న ప్రభృతులతో ఒక కమిటీని ఎన్నుకున్నారు. (వి. వి.)

లేఖలు

మాచెర్ల వరదబాధితులకు అందే సహాయం లోటుపాట్లు

ఆర్యా,

భారీ వర్షాలవల్ల చెరువులకు గండ్లుపడి 29-9-64 న మాచెర్ల గ్రామం యావత్తు జలమయమై కొన్ని వందల ఇళ్ళు కొన్ని వేల పశువులు, మూడు వందలకు పైగా ప్రజల ప్రాణాలు వరద పాలైనవి. పూరిగుడిసెలు నామరూపాలు లేకుండా పోయినవి.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్టు - ఇక్కడ ఇళ్ళు పడిపోయిన వారి కుటుంబాలకు రు. 30 చొప్పున ఆర్ టి సి ఇస్తున్నారు. ఈ సహాయము వరద బాధితులకు కాక, కొంతవరకు వరదకు గురికాని వారలకు చెందుతున్నది. పలుకుబడిని ఉపయోగించుకున్న పెద్దలకు పడి పోయిన, పడిపోవని ఇళ్ళకు కూడా రెండు మూడు పర్యాయములు డబ్బుఇవ్వటం జరుగుతున్నది. ఇప్పటికి సుమారు రూ 25,000 లు పంచారు. ఉచితానుచితములుగ్రహించక వరదకు గురికాని వారికే ఎక్కువ భాగం ఇవ్వటం జరుగుతున్నందున పేదప్రజలకు సరైన సహాయము జరుగుటలేదు. బీద ప్రజలు వెళ్ళి ఆర్. డి. ఓ. తో విన్నవించుకున్నారుకూడా. మరలా దరఖాస్తులు పెట్టుకోవమని సమాధానము చెప్తున్నారు. సర్వమూ కోల్పోయిన ప్రజలు దరఖాస్తులతో ఆఫీసులచుట్టూ తిరుగుతూ ఇన్ని దినాల వరకుజీవనము చేయుట చాలా దుర్భరముగా నున్నది. కొన్ని ఇళ్ళల్లో భార్యా బిడ్డలతోసహా వస్తులకు గురి అవుతున్నారు.

కనుక ఇప్పటికైనా అధికారులున్యాయాన్ని గ్రహించి కుడిచి పెట్టుక పోయిన పూరిపాకల వారికి, అద్దె ఇళ్ళలో నివసిస్తున్న కుటుంబములకూ సత్వర సాయము అందజేయగలరు, వారి బిడ్డలకు బట్టలు, పుస్తకములు సహాయము చేయవలయును యదార్థ గా ఇళ్ళు కూలిపోయిన ప్రజల ఇళ్ళను చూచి వారికి సత్వర సహాయము చేయవలయును.

కర్పూరపు కోటయ్య,

పల్నాడు తాలూకా వెనుకబడిన జాతుల సంఘాధ్యక్షుడు, మాచెర్ల.

అధిక వర్షాలు, వరదల వల్ల పోలవరం, కొవ్వూరు తాలూకాల్లో జరిగిన నష్టాలు

ఆర్యా,

పశ్చిమ గోదావరిజిల్లా పోలవరం తాలూకా కొవ్వాడ కాల్వ ముంపువల్ల ఈ మధ్య కురిసిన వర్షాలవలన కొవ్వాడ కాల్వ గట్టు తెగి, పోలవరం వద్ద కొత్తూరు చెర్వులో పడి సుమారు 200 యెకరములు పంట పూర్తిగా నష్టపడినది. 60 యెకరములు ఇసుక మేటలువేసినది. ఇది గాక ఈ ముంపు వలన, రేపల్లెవాడ, ప్రగడపల్లె, పట్టిశం గ్రామాలకు సంబంధించిన వరిచేలు కూడా నాశనమైనవి.

దీనికి పరిష్కార మార్గం, కొవ్వాడ కాల్వ పంపింగ్ స్కీము. చాలాకాలంగా ప్రజలఅందోళనఫలితంగా 1961 లో ఈ స్కీము శాంక్షన్ చేయబడి కొవ్వాడ గ్రామంలో శంకుస్థాపన కూడా జరిగింది. కాని దరిమిలా ఈ స్కీము కొన్ని లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఆమోదించదనే సాకుతో కొద్దిఖర్చుతో కుకాల అనే గ్రామంవద్ద (పిఐసి) ప్రాజెక్టు కట్టుటకు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఈ స్కీము వలన పోగయ్యేభూమిహుకుంపేట జమీందారు వారికి సంబంధించిన 600 యకరములు మాత్రమే. దీనికి సుమారు 10 లక్షల రూపాయలు ఖర్చుఅగునని తెలుస్తోంది. ఈస్కీమును అవుతేసి కొత్తూరు చెర్వుకు 3 అడుగులుగట్టును ఎత్తు పెంచి కాల్వలు త్రవ్వినయడల 5 లక్షల రూపాయల ఖర్చుతో పోలవరం ప్రగడపల్లి గ్రామాలకు సంబంధించిన 5 వేల యకరములు సాగులోకి రాగలదు.

దీనితోపాటు కొవ్వూరు తాలూకాకు సంబంధించిన శావవరం, దాగల్లు పొలములకు కూడా ముంపునివారణ కాగలదు,

ఈ మధ్య కురిసిన వర్షాలవలన యర్రకాల్వ పొంగి కోయమామిడి, త్యాజంపూడి, తాడిమళ్ళ, కోటకూరేశ్వరం, యర్నగూడెం గ్రామాలకు సంబంధించిన మొత్తం సుమారు 5 వేల యెకరములు నష్టపడినవి. 78 యిండ్లు పడిపోయాయి.

అందువల్ల యర్రకాల్వకు అనుమల్లంక వద్ద రిజర్వాయరును నిర్మించాలి. రామరాజ గట్టునుంచి, కోయమామిడివరకు గట్లు ఎత్తు చేయించాలి. వరదలకు గురియైన ప్రాంతాలకు దాళ్వాసాగుకు అనుమతి యివ్వాలి.

చేకూరి వీరభద్రరాజు,

జిల్లా రైతుసంఘ కార్యవర్గ సభ్యులు.

అక్కారిచెట్ల యాజమాన్యం హక్కు

ఆర్యా,

అక్కారిచెట్ల యాజమాన్యం హక్కు గత 2 సంవత్సరముల నుంచి రైతులకు బట్వాడా జరుపుటలేదు. ఒక్క ఖమ్మం తహశీలు లోనే ఈ విధంగా రు 80 వేల రూపాయలు రైతులకు ఇవ్వవలసి యున్నది.

అక్కారిచెట్ల హక్కు మారికాన (యాజమాన్యం హక్కు) చెల్లింపు బిల్లులు ఖమ్మం ట్రెజరీ ఆఫీసరు గారివద్ద దాదాపు 8 మాసములు నుంచి పెండింగులో ఉన్నట్లు తెలిసింది.

అసలే అప్పులతో, కిస్తులతో, పంటలు లేక కరువు పరిస్థితులలో వున్న రైతాంగానికి ఇటువంటి రెడ్‌టేపిజం బాధ తొలగించి రైతులకు హక్కు మారికాన మనిఆర్డరు ద్వారా ఇకెటువంటి అలస్యం జరగకుండా అందజేయాలని కోరుచున్నాను.

పంపెట రామారావు.

ఈ నెల 19 వ తేదీన స్థానిక విజ్ఞాన మండలి అధ్వర్యాన సాహిత్య సమావేశం జరిగింది. భాషాప్రవీణ మధునాపంతుల వెంకటసుబ్బయ్య స్వీయ రచనలు చదివి వినిపించారు.

తూర్పు జావాలోని రేడియో కేంద్రం యువకులచే స్వాధీనం

జకర్తా, అక్టోబరు 19

తూర్పు జావాలోని ఇండొనేషియా ప్రభుత్వ రేడియో కేంద్రాన్ని స్థానిక యువజనులకు చెందిన ఒక గ్రూపు స్వాధీనం చేసుకున్నారని కమ్యూనిస్టు దినపత్రిక హరియాన్ రక్యత్ నేడిక్కడ ప్రచురించింది.

ఈ ముఠావర్యాలను స్థానిక యువజన సంఘం ఖండించిందని ఈ ముఠాపై చర్య తీసుకోవలసిందిగా కోరిందనికూడా ఈ పత్రిక తెలియజేసింది. అయితే ఈ ఘటనలకు సంబంధించిన ఇతర వివరాలను మాత్రం పేర్కొనలేదు.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ అక్టోబరు 20

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టరు17-10-64న అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయబడిన టోకు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు)

ధాన్యం

		75 కి.	100 కి.
నంబర్లు:	విజయవాడ	రు. 35-25	47 00
,,	కాకినాడ	36 00	48 00
,,	చిత్తూరు	44 00	58 66
అక్కుళ్లు:	విజయవాడ	35 00	46 66
,,	తాడేపల్లిగూడెం	30 00	40 00
,,	కాకినాడ	35 00	46 66
,,	అముదాలవలస	41 50	55 33
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	36 67	48 89
సన్నాలు:	అముదాలవలస	43 00	57 33
మొలకొలుకులు:	నెల్లూరు	39 71	52 94

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రు. 69 00
,,	కాకినాడ	69 00
అక్కుళ్లు:	విజయవాడ	64 00
,,	తాడేపల్లిగూడెం	64 00
,,	కాకినాడ	64 00
,,	అముదాలవలస	64 00
సన్నకృష్ణ కాటుకలు:		
,,	తాడేపల్లిగూడెం	68 00
నంబర్లు:	చిత్తూరు	81 00
,,	కాకినాడ	—
సన్నాలు:	అముదాలవలస	69 00
మొలకొలుకులు:	నెల్లూరు	77 00

వేరుశనగ

కాయలు	విజయవాడ	కొత్తవి 60 88
,,	నంద్యాల	82 50
,,	ఆదోని	78 12
,,	విజయనగరం	60 00
పప్పు	విజయవాడ	131 25
,,	నంద్యాల	104 17
,,	ఆదోని	125 00
,,	విజయనగరం	118 80
నూనె	విజయవాడ	285 00
,,	నంద్యాల	230 00
,,	ఆదోని	260 00
,,	విజయనగరం	258 80

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 108 00
,,	గుంటూరు	100 00
,,	అముదాలవలస	68 81
మినుములు:	విజయవాడ	78 00
,,	గుంటూరు	80 00
,,	అముదాలవలస	68 81
పెసలు:	విజయవాడ	78 00
,,	గుంటూరు	80 00
,,	అముదాలవలస	84 66
శనగలు:	విజయవాడ	106 52

జొన్నలు

అనంతపురం	తెల్లవి	62 00
నంద్యాల	పచ్చవి	65 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	96 00
,,	మూడవరకం	70 30
చిత్తూరు	మొదటిరకం	80 00
,,	మూడవరకం	56 67

జీడిపప్పు

మోరి:	అమెరికన్‌రకం	రు. 691 00
,,	దేశవాళీ	660 00
,,	బద్దలు	555 00
,,	ముక్కలు	441 00

మిర్చి

42 ఒకటవ రకం గుంటూరు	200 00
42 రెండవ రకం ,,	190 00

నెయ్యి

	పల్నాడు	దేశవాళీ
గుంటూరులో	680 00	640 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	170 00	265 00
రాజమండ్రి	175 00	220 00
పాలకొల్లు	160 00	280 00

పసుపు

దుగ్గిరాలలో:	కొమ్ములు	రు. 157 00
,,	కాన్పూరు	174 50
,,	దుంపలు	137 00
కడపలో	కొమ్ములు	144 00
,,	దుంపలు	123 00

జనపనార

విజయనగరం	మొదటిరకం	93 77
	రెండవరకం	86 74
	మూడవరకం	75 33
అముదాలవలసలో	మొదటిరకం	85 80
	రెండవరకం	82 00
	మూడవరకం	78 00

దేశ ఆర్థిక వ్యవస్థలో పబ్లిక్ రంగం పాత్ర

4వ ప్రణాళికాంతానికి ప్రధాన శక్తిగా వుండే సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 21

నాలవ ప్రణాళికాంతానికి కీలక, యంత్రోత్పత్తి పరిశ్రమలలో పబ్లిక్ రంగం ప్రధానమైన శక్తిగా వుంటుందని ప్రణాళికా సంఘం సభ్యులు డాక్టరు వి. కె. ఆర్. వి. రావు తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థలో పబ్లిక్ రంగం పాత్ర గురించి వివరించుతూ 4 వ ప్రణాళికా కాలంలో పరిశ్రమలకు కేటాయించే మొత్తం సుమారు రు. 3,200 కోట్లని అన్నారు.

1970-71లో నాటికి పబ్లిక్‌రంగంలో మూల పెట్టుబడిగా రు.5,691 కోట్లువుంటే ప్రయివేటు రంగంలో పెట్టుబడులు రు. 5,857 కోట్లు వుంటుందని చెప్పారు. అంటే 4వ ప్రణాళికాంతానికి పబ్లిక్‌రంగం భారత పారిశ్రామిక, వాణిజ్య రంగంలో సగం స్థానాన్ని పూర్తిగా ఆక్రమించుతుంటుంది.

1950 - 51 పబ్లిక్‌రంగ పెట్టుబడి రు 44 కోట్లు. అదకమంది 5,691 కోట్లకు పెట్టుబడి పెరగటం పేర్కొనదగ్గ విషయం.

5 వ ప్రణాళికాంతానికి పబ్లిక్ రంగం పెట్టుబడి రెట్టింపు కావచ్చు. విస్తృతిలోనూ, సాధారణలోనూ పురోగమిస్తున్న పబ్లిక్ రంగం వహిస్తున్న గణనీయమైన పాత్రను దృష్టిలో వుంచుకొని, ఈ సంస్థల నిర్వహణకు వివరమయిన, విశిష్ట విధానాన్ని రూపొందించుకోవలసిన తరుణం ఆసన్నమయ్యింది అని ఆయన అన్నారు.

ఈ పరిశ్రమల నిర్మాణం, విస్తరణవెనుక గల ఆర్థిక, సాంఘిక సిద్ధాంతలక్ష్యాల సాధనకు విశిష్ట విధానం అవసరమని ఆయన చెప్పారు.

1969 నాటికి లక్షగ్రామాలకు విద్యుత్ సప్లయి

తిరువనంతపురం, అక్టోబరు 21

1969 చివరికి లక్ష గ్రామాలకు విద్యుత్ సప్లయి చేయాలనీ, అంటే వచ్చే ఐదేండ్లలో సుమారు 60 వేల గ్రామాలకు విద్యుత్ అందించబడుతుందనీ, ఇందుకు రు. 200 కోట్లవరకు నిధులు కావాలనీ, అయితే ఈ నిధుల సేకరణ ఏమంత పెద్ద కష్టం కాదనీ కేంద్ర ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖామంత్రి డాక్టర్ కె యల్ రావు నేడిక్కడ అన్నారు.

ఇరిగేషన్, విద్యుత్ సప్లయి విషయాలపై జరుగుతున్న గోష్టిలో శ్రీ రావు రెండవ రోజు ప్రసంగిస్తూ, ప్రతిరాష్ట్రం తన పథకాలను రూపొందించుకొని, నిధులు, ఇతర వసతుల అవసరాలను అంచనా వేసి ఆ వివరాలను ఈ సంవత్సరాంతానికి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు.

సాదిక్ మంత్రివర్గంలో షంషుద్దీన్ ప్రవేశం

శ్రీనగర్, అక్టోబరు 21

కాశ్మీర్ మాజీ ప్రధాని శ్రీ షంషుద్దీన్, మాజీ ఆర్థిక మంత్రి శ్రీ గిరిధరలాల్ డోగ్రాలు సాదిక్ మంత్రివర్గ సభ్యులుగా రేపు ప్రమాణ స్వీకారం చేస్తారని నేడు అధికారయుతంగా తెలియ వచ్చింది

పార్లమెంటుసభ్యుడు శ్రీ ఎ ఎమ్ తరిక్, మాజీడిప్యూటీ మంత్రి మేజర్ పియార్‌సింగ్‌లు కూడా సాదిక్ మంత్రివర్గంలో స్టేట్ మంత్రులుగా చేరతారు.

ఆహారసమస్యపై జనరల్ సమ్మె

అవసరమని శ్రీ ఎ. కె. గోపాలన్ వ్యాఖ్య

మద్రాసు, అక్టోబరు 21

దేశంలో ఈనాడు ఏర్పడిన ఆహారసంక్షోభ పరిష్కారానికి గట్టి చర్యలు తీసుకొనే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించే టందుకు సార్వత్రిక సమ్మెలు అవసరమని పోటీపార్టీ పార్లమెంటరీ గ్రూపు నాయకులు శ్రీ ఎ కె గోపాలన్ నేడిక్కడ ఒక పత్రికా గోష్ఠిలో చెప్పారు.

మదరాసు శాసనసభ భవనంలో నిరాహార వ్రతం ప్రారంభించిన సభ్యులను పరామర్శించి వచ్చిన తరువాత ఆయన యీగోష్ఠి జరిపారు.

కేరళలో ఆహార రేషనింగ్ డిమాండు చేస్తూ తమ పార్టీ నవంబర్ 5 నుండి కలెక్టర్ కార్యాలయాల ముందు పికెటింగ్ ప్రారంభించాలని నిశ్చయించిందని ఆయన అన్నారు.

దేశం మొత్తంపైన ఆహార పరిస్థితి చాలా "ఆందోళనకరంగానే" వున్నదనీ కొద్దిపాటి మిగులు ప్రాంతమైన మద్రాసు రాష్ట్రం స్థితి చాలా తీవ్రంగా వుందని ఆయన అన్నారు

దీనిని బట్టి మన పంపిణీ యంత్రాంగం మూలంలోనే ఎక్కడో పెద్ద లోపం వుందనేది స్పష్టం. అశోక మెహతా కమిటీ సిఫార్సుచేసిన విధంగా ఉత్పత్తిని పెంచడం, ఆహారవ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించటం ఈ రెండే యీ సమస్యను పరిష్కరించగలవని ఆయన అన్నారు.

పశ్చిమబెర్లిన్, అక్టోబర్ 21

గతరాత్రి యిక్కడికి వచ్చిన భారత పార్లమెంటరీ ప్రతినిధివర్గం సభ్యులు ఈ రోజు పశ్చిమ బెర్లిన్ నగరం అంతా తిరిగి చూచారు. ఈ ప్రతినిధివర్గానికి లోక్‌సభ స్పీకర్ సర్దార్ హుకుంసింగ్ నాయకత్వం వహిస్తున్నారు.

యుగోస్లావియా 20 వ విముక్తి వార్షికోత్సవాలు

కీ. శే. బిర్యుజోవ్‌కు జాతీయ బిరుదు

బెల్‌గ్రేడ్, అక్టోబరు 20

యుగోస్లావియా నేడు తన 20 వ విముక్తి వార్షికోత్సవాన్ని జరుపుకున్నది.

ఈవిముక్తి దినోత్సవాలలో పాల్గొనేందుకు వస్తూ, దారిలో విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయిన సోవియట్ సైనికాధిపతి మార్షల్ బిర్యుజోవ్‌కు ఈ రోజు ఉత్సవాలలో "జాతీయయోధుడు" బిరుదును ప్రదానంచేశారు

అదే విమాన ప్రమాదంలో మృతిచెందిన 6 గురు సోవియట్ ఉన్నత సైనికాధికారులకు కూడా ఉన్నత బిరుదులను ఇచ్చారు

బెల్‌గ్రేడ్ నగర కౌన్సిల్ ఆధ్వర్యాన జరిగిన ఒక ఉత్సవంలో మార్షల్ టిటో మాట్లాడుతూ నాజీ మూకల బారినుండి యుగోస్లావియాను విముక్తి చేయటంలో సోవియట్ సైనికుల పాత్రను జ్ఞప్తికి తెచ్చి వారిని అభినందించారు.

సోవియట్ డిప్యూటీ రక్షణమంత్రి ఎయిర్ మార్షల్ వ్లాడిమిర్ సుదెట్స్ నాయకత్వాన ముగ్గురు సభ్యులున్న సైనిక ప్రతినిధి వర్గం ఒకటి నేటి యుగోస్లావియా విముక్తి ఉత్సవాలలో పాల్గొన్నది విమాన ప్రమాదంలో మరణించిన బిర్యుజోవ్ తదితరుల స్థానే వీరు ఉత్సవాలలో పాల్గొన్నారు.

మార్షల్ బిర్యుజోవ్ మృతికి సంతాప సూచకంగా బెల్గ్రేడ్ నగర సమితి నేడు ప్రత్యేక సమావేశం జరిపి ఒక నిముషం మౌనం పాటించింది.

సోవియట్ సైన్య రాజకీయ వ్యవహారాల అధిపతి, మరో ఇద్దరు ఉన్నతాధికారులు బిర్యుజోవ్, తదితర రష్యా సైనికాధికార్ల భౌతిక కాయాలను మాస్కో తీసుకువెళ్ళడానికి బెల్గ్రేడ్ వచ్చారు

రష్యా - చైనాలమధ్య సఖ్యత కుదిరినా పార్టీలో ఐక్యత కుదరదని గోపాలన్

మద్రాసు, అక్టోబరు 21

సోవియట్ యూనియన్ నాయకత్వంలో వచ్చిన మార్పులనుబట్టి రష్యా - చైనా సంబంధాలు మెరుగు కాగలవనే సూచన కానవస్తున్నదని, శ్రీ ఎ. కె. గోపాలన్ నేడిక్కడ చెప్పారు.

ఇదే నిజమైతే, అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమంలో తప్పనిసరిగా ఐక్యతకు మార్గం సుగమం అవుతుందన్నారు.

రష్యా - చైనాల మధ్య విభేదాలు సర్దుబాటైనప్పటికీ, భారత దేశంలో రెండు కమ్యూనిస్టు గ్రూపుల మధ్య తిరిగి సామరస్యం యేర్పడుతుందని తాను అనుకోవటం లేదన్నారు. ప్రభుత్వం పట్ల తీసుకోవలసిన వైఖరి, ప్రభుత్వవర్గ స్వభావము అనే సమస్యలపైనే యీ రెండు గ్రూపులమధ్య భేదాభిప్రాయాలు వున్నవి. గుత్తపెట్టుబడిదారి వర్గమే ప్రభుత్వాధిపత్యం చెలాయిస్తున్నదని మేము అనుకుంటున్నాం. వారేమో యిది కాదంటున్నారు అని ఆయన అన్నాడు.

"సోవియట్‌లో వ్యక్తి నిర్బంధ విధానం ఏమీ కనపడలేదు"

శ్రీ సి. పి. రామస్వామి అయ్యరు అనుభవాలు

అన్నామలైనగర్, అక్టోబరు 21

సోవియట్ రష్యాలో చాలా పరిశోధనలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారనీ, ఇందుకు వారు సహకార భావంతో ఎక్కువ తీవ్రకృషి సాగించుతున్నారనీ, ఇటీవల ఆదేశం పర్యటించి వచ్చిన శ్రీ సి. పి. రామస్వామి అయ్యర్ అన్నారు సాంకేతిక విజ్ఞాన విషయంలో శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి విషయంలో వారు తమ యావచ్ఛక్తినీ వినియోగించుతున్నారని అన్నారు

"నాకు సోవియట్ రష్యాలో ప్రజలపై నియంతృత్వం, నిరంకుశత్వం ఏమీ కనబడ లేదు. తదేకంగా, పట్టువిడుపులు లేకుండా తమ కృషినికొనసాగించాలనే భావమే వారిలో నాకు కనబడింది. ఇతర పారిశ్రామిక దేశాలనుమించి పోవాలనే పట్టుదల వారిలో నాకు కనబడింది. ఇది ఒక ప్రత్యేక లక్షణంగా రష్యాలో నాకు కనబడింది. చైనాలో ఇది నాకు కానరాలేదు" అని అన్నారు. అనేక భాషలుగల రష్యాలో భాషాసమస్యను చాలా జయప్రదంగా పరిష్కరించారు అని అన్నారు.

గణిత శాస్త్రాన్ని ఒక మౌలిక విజ్ఞాన శాస్త్రంగా రష్యనులు భావించి కృషిచేస్తున్నారు. అని సి. పి. రామస్వామి అయ్యర్ అన్నారు.

మదురైలో దొంగ బంగారం పట్టివేత

మదురై, అక్టోబరు 21

సుమారు వేయి గ్రాముల దొంగ బంగారాన్ని నిన్న యిక్కడ కస్టమ్సు అధికారులు ఒక వ్యక్తి దగ్గర పట్టుకొన్నారు. అతనిని 15 రోజుల వరకు జ్యుడిషియల్ కష్టడిలోవుంచారు.

ఒలింపిక్ పోటీల ఫలితాలు

టోకియో, అక్టోబరు 20

టోకియోలో జరుగుతున్న ఒలింపిక్ పోటీలలో 11 వ రోజు సాయంత్రానికి ఈ క్రింది విధంగా వివిధ దేశాల క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు

దేశం	స్వర్ణ పతకం	రజత పతకం	కాంస్య పతకం
అమెరికా	34	25	24
రష్యా	19	19	24
జపాను	10	1	7
హంగరీ	9	5	4
ఇటలీ	6	8	2
ఆస్ట్రేలియా	6	2	8
జర్మనీ	6	16	14
బ్రిటన్	4	12	1
బల్గేరియా	3	5	1
పోలెండ్	4	5	5
ఫిన్లండ్	3	0	0
టర్కీ	2	3	1
జెకోస్లావేకియా	3	4	3
రుమేనియా	2	2	3
బెల్జియం	2	0	0
హాలెండ్	1	3	4
కెనడా	1	1	1
యుగోస్లావియా	1	1	1
డెన్మార్క్	2	0	2
న్యూజిలాండు	3	0	2
ఫ్రాన్స్	0	5	4
స్వీడన్	0	1	3
ట్రినిడాడ్	0	1	1
స్విట్జర్లాండు	0	1	1
అర్జెంటైనా	0	1	0
క్యూబా	0	1	1
ద. కొరియా	0	1	0
ట్యునీషియా	0	1	0
ఇరాన్	0	0	2
కీన్యా	0	0	1

నిరాయుధీకరణకు ప్రోద్బలమట!

చైనా అణ్వాస్త్ర పరీక్షపై ఇండొనీషియా ప్రధాని వ్యాఖ్య

జకార్తా, అక్టోబరు 21

చైనా అణ్వస్త్ర పరీక్షవల్ల ప్రపంచ వ్యాపిత నిరాయుధీకరణనూ, అగ్రరాజ్యాలు సంతరించుకున్న అణ్వస్త్రాల రద్దును త్వరితం చేయడానికి ప్రోద్బలం కలుగుతుంది. అంటూ ఇండొనీషియా ప్రధాని డాక్టర్ సుబాంద్రియో నిన్న రాత్రి ఒక టెలివిజన్ గోష్ఠిలోచెప్పారు.

అణ్వస్త్ర పరీక్షలకు సర్వసాధారణ పద్ధతిలో మేము వ్యతిరేకులం. అయితే, చైనా జరిపిన యీ పరీక్షవల్ల అంతర్జాతీయ నిరాయుధీకరణ త్వరితగతని సాధ్యమౌతుంది. అణ్వస్త్ర పరీక్షలవల్ల రేడియో ధార్మికధూళి ప్రసారమయే ప్రమాదం హెచ్చుతుందనేది నిజమే. అయితే చైనా జరిపిన ప్రస్తుత పరీక్ష సుగుణమేమంటే, యిందువల్ల నిరాయుధీకరణ, అణ్వస్త్రాల విధ్వంసన మార్గాల కోసం జరిగే అన్వేషణకు దోహదకారి అవుతుంది అని ఆయన అన్నారు.

కైరో సభ

కైరో అలీన రాజ్యాల సభను ప్రస్తావించి ఆ సభ జాతీయ విముక్తికోసం పోరాడుతున్న జాతుల అభిప్రాయాల ప్రకటనకు ఒక వేదికగా ఉపయోగపడిందని ఆయన అన్నారు. బెల్గ్రేడ్‌లో జరిగిన తొలిసభ, ప్రత్యర్థి రాజ్యకూటాలను సన్నిహిత పరిచేటందుకు ప్రయత్నించింది. క్రొత్తగా విముక్తి పొందిన జాతులకంటే సామ్రాజ్యవాద శక్తులు బలిష్ఠంగా వుంటే శాంతియుత సహజీవనంఅసాధ్యంఅని ఆయన అన్నారు.

కైరో సభలో పాల్గొన్న తమకూ, యుగోస్లావియా వంటి కొన్ని దేశాలకూ మధ్య భేదాభిప్రాయా లున్నమాట నిజమేనని. ఆ దేశాలు ప్రత్యర్థి రాజ్యకూటాల మధ్య సంఘర్షణల నివారణ ద్వారానే ప్రపంచానికి భద్రత మేర్పడుతుందని భావిస్తున్నాంఅని ఆయన అన్నారు

విద్వేషపూరిత చర్య

చైనా అణ్వాస్త్ర పరీక్షపై దివాన్ చమన్‌లాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 21

చైనా అణ్వస్త్ర పరీక్ష మానవ జాతి పట్ల ద్వేషబుద్ధితోనూ, మానవ సద్భావం పట్ల అవిశ్వాసం తోను జరిపిన చర్యఅంటూ శాంతి సమితి అధ్యక్షులు శ్రీ దివాన్ చమన్‌లాల్ నేడు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో విమర్శించారు.

దురాక్రమణపూరిత ప్రయోజనాలకోసం వారీ ఆయుధాన్ని వినియోగించ బోమని చెబుతున్నారు. ఇదినమ్మశక్యంగాని వాగ్దానంగా వుంది. వారింతవరకూ అనుసరిస్తూ వచ్చిన విధానాలు ప్రపంచ శాంతి పరిరక్షణకు అనుగుణమైనవిగా లేకపోవడమే యీ అపనమ్మకానికి కారణం అని ఆయన అన్నారు.

ఇండియాలో అణుధూళి పెరుగుదల

చైనా అణ్వాస్త్ర పరీక్ష ఫలితంగా

న్యూఢిల్లీ, అక్టోబరు 21

చైనా ప్రేల్చిన అణుబాంబు ఫలితంగా రేగిన అణు ధార్మికధూళి ఇండియాలోకి కూడా ప్రసరించిన సూచనలు స్పష్టంగా కానవస్తున్నట్లు భారత అణుశక్తిశాఖ అధికారులు చెబుతున్నారు.

చైనా అణ్వస్త్ర పరీక్షవల్ల ఇండియాలో పెరిగిన అణుధార్మిక ధూళివల్ల ప్రజల ఆరోగ్యానికి హానిచేకూరేదీ లేనిదీ యింకా పరిశీలన జరిపిన మీదటగాని తేలదని వారు వివరిస్తున్నారు.

జపానుకు చేరిన అణుధూళి

చైనా అణ్వస్త్ర పరీక్ష ఫలితంగా, అటూ జపానులో మామూలుగా వుండే అణుధార్మికధూళి కంటె1000 రెట్లు ఎక్కువ అణుధూళి కానవస్తున్నదని ఆ దేశ శాస్త్రవేత్తలు ప్రకటించారు.

పాక్ ప్రభుత్వవర్గాల వైఖరి

చైనా అణ్వస్త్ర పరీక్షను జయప్రదంగా పూర్తి చేసింది కనుక, ఐక్యరాజ్యసమితిలో ఆ దేశానికి వెంటనే సభ్యత్వం ఒసగడంఉచితమనీ, అవసరమని పాక్ ప్రభుత్వవర్గాలవారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్టు కరాచీనుంచి వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి.

చైనా లేకుండా నిరాయుధీకరణ తీర్పులు ఫలప్రదం కాబోవన్న విషయం ఇప్పుడు మరింత స్పష్టంగా తేలిపోయిందని ఆ వర్గాల వారు వ్యాఖ్యానిస్తున్నారు.

చైనా అణ్వస్త్ర పరీక్ష జరిపింది కనుక, ఆసియాలోని ఇతర దేశాలు కూడా దానితో పోటీ పడడానికి ఉద్యమిస్తే అది విచారించ తగ్గ విషయంగాగలదనిఅవర్గాలవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తొలి ఆటంబాంబుతో సరితూగే చైనాబాంబు

అమెరికా జపానులోని హిరోషిమాపై ప్రయోగించిన ఆటంబాంబు సాటి అణుబాంబును అక్టోబరు. 16 న చైనా పేల్చిందని అమెరికా అణుశక్తి కమిషన్ నేడు ప్రకటించింది.

చైనా తన అణ్వస్త్ర పరీక్షను జరిపిన ప్రాంతంలో అణుపరీక్షకుసంబంధించిన నిర్మాణ కృషిని ఎప్పటికప్పుడు అమెరికా యుద్ధవిమానాల ద్వారా పసికడుతూనే వచ్చినట్టు అమెరికా ప్రజా ప్రతినిధుల సభలోని డెమొక్రాటిక్‌పార్టీ సభ్యుడు మెక్డొవెన్ నేడు వెల్లడించారు.

సిక్కిం ఆందోళన

గాంగ్‌టక్, అక్టోబరు 21

చైనా అణ్వాయుధ పాటవ పరీక్షపట్ల సిక్కిం ప్రజా సమాలోచనా కమిటీతనతీవ్రాందోళనను తెలిపింది. నేడిక్కడ ఈ కమిటీ మాసిక సమావేశం జరిగింది. చైనా ప్రపంచ రాజ్యాలఅభిప్రాయానికి వ్యతిరేకంగా అణ్వస్త్ర పరీక్ష జరపడం తీవ్రాందోళన కలిగిస్తున్నదని ఈ సమావేశం ప్రకటిస్తూ, ఈ విషయంలో భారత ప్రభుత్వం చైనాకు అందజేసిన నిరసనను సమర్థించింది.

దీనికి ముందు కమిటీ సభ్యుడు కాశీరాజ్ ప్రధాన్ ప్రసంగిస్తూ చైనా అణ్వాయుధ పాటవ పరీక్ష శాంతికి విఘాతం కల్పించడమే గాకుండా నూతన ఉద్రిక్తతను కల్పించిందన్నారు. సిక్కిం ప్రధాన పాలనాధికారి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

చైనా అణ్వాస్త్ర పరీక్షకు ఫ్రాన్స్ హర్షం

పారిస్, అక్టోబరు 21

చైనా అణుబాంబు పరీక్ష జరపడం ఒక "ముఖ్యమైన సంఘటన" అని ఫ్రెంచి సమాచారశాఖ మంత్రి నేడు వ్యాఖ్యానించారు.

"చైనా అణ్వస్త్ర ధారణకిది త్వరలోనే దారితీయగలదు అణ్వాయుధాలను సముపార్జించుకోగల దేశాలకు ఒక హక్కుగా లభించే రక్షణ ఆ విధంగా చైనాకు లభించగలదు అణ్వాయుధాలు గల దేశంపై దాడి చేయడానికి ఎవరూ సాహసించజాలరు" అని ఆయన అన్నారు.

బడుగుదేశాల విద్యా పథకాలకు సాయం

ప్రపంచ విజ్ఞాన సమితి అందించాలని విజ్ఞప్తి

పారిస్, అక్టోబరు 21

నిరక్షరాస్యతా నిర్మూలనకు ఉపాధ్యాయ శిక్షణ, శాస్త్రీయ విద్య అభివృద్ధి పథకాలకు గాను బడుగు దేశాలకు సహాయం అందించే కార్యక్రమాన్ని చేబట్టవలసిందిగా ప్రపంచ వైజ్ఞానిక సంస్థను భారత విద్యా శాఖ మంత్రి శ్రీ చాగ్లా కోరారు.

ఈ సంస్థ 13 వ సాధారణ మహాసభలో మాట్లాడుతూ మానవ అభివృద్ధి చరిత్రలో ఈ దశాబ్దాన్ని చిరస్మరణీయం చేయాలని ఆయన కోరారు.

విజ్ఞానశాస్త్రం అమోఘంగా అభివృద్ధిచెందుతున్నదశలో శాస్త్రీయ పరిశోధనకు ఈసంస్థఒక సమన్వయ కేంద్రంగా పనిచేయాలని అన్నారు. వివిధ దేశాల ప్రముఖ శాస్త్రవేత్తల కృషిలో సహకారం పెంపొందించడానికి ప్రయత్నించాలని అన్నారు.

విద్యారంగాన్ని ఆధునికంగాఅభివృద్ధిపరచడానికి ఒక అంతర్జాతీయ సంస్థను నెలకొల్పాలన్న ప్రతిపాదనకు చాగ్లా హర్షం వెలిబుచ్చారు

. నూతనంగా విముక్తి పొందిన దేశాలలో నిరక్షరాస్యతా నిర్మూలన, విద్యాస్థాయి పెంపుదల, తదితర సమస్యల పరిష్కారానికి జరిగే కృషిపట్ల శ్రద్ధవహించాలని విజ్ఞప్తి చేశారు.

పోర్చుగల్ దక్షిణాఫ్రికాలు ప్రపంచ విజ్ఞానసమితిలో చేరడానికి భారతదేశం వ్యతిరేకమని పునరుద్ఘాటిస్తూ, ఆదేశాలతో మిగతా దేశాలు సఖ్య సంబంధాలు తెంచుకోవాలని కోరారు. మానవ హక్కుల్ని, గౌరవాన్ని రక్షించడానికి కంకణం కట్టుకున్న ఈ సంస్థ జాతి వివక్షవంటి విధానాన్ని తీవ్రంగా ప్రతిఘటించితీరాలని ఆయన చెప్పారు

బాలికలచే మృగధుని శిఖరారోహణ

న్యూఢిల్లీ, అక్టోబరు 20

పశ్చిమ హిమాలయాలలోని 22,420 అడుగుల ఎత్తుగలమృగధుని హిమశిఖరాన్ని ఏడుగురు బాలికలతో కూడిన పర్వతారోహక బృందం (గైడ్స్) అక్టోబరు 10 వ తేదీన అధిరోహించారని భారత స్కౌట్స్, గైడ్స్ జాతీయ కేంద్ర కార్యాలయానికి ఈరోజున అందిన వార్త తెలియజేస్తున్నది.

ఈ మహిళా పర్వతారోహక బృందంలోగల బాలిక లందరూ క్షేమంగా తిరిగి వస్తున్నారని, వీరు అక్టోబరు 25 నాటికి ఢిల్లీ చేరుకుంటారని వర్తమానం చేరింది.

వీరప్పుడే మైదాన ప్రదేశంలో వున్న లతా ప్రాంతం చేరుతున్నారని తెలిసింది ఈ లతా ప్రాంతం నుండి జోషీ మఠానికి చేరుకోవటానికి రెండు రోజులు నడక ప్రయాణం చేయవలసి వుంటుంది.

ఈ బృందం జోషీ మఠాన్నుండి సెప్టెంబర్ 25 న మృగధుని శిఖరారోహణకుబయల్దేరారు

ఉత్తర ప్రదేశ్ మొరాదాబాద్ పోలీసు అధికారులనుండి ఇక్కడకు ఈ వార్తచేరింది.

ఈ బాలికల బృందం వెంట సామాన్లను మోసుకొని వెళ్ళినవారు మధ్యదారిలో వాటిని వదలిపెట్టి వెళ్ళిపోయినందువల్ల ఉత్తర ప్రదేశ్ పోలీసులు కొత్తవారిని సామాన్లు తీసుకవెళ్ళటానికి నియమించారు.

కొన్నిరోజుల నుండి మహిళా పర్వతారోహక బృందంనుండి తమకు ఎట్టి సమాచారం అందలేదని జాతీయ స్కౌట్స్, గైడ్స్ కేంద్ర కార్యాలయంవారు ఉత్తరప్రదేశ్ పోలీసు అధికారులకు ఫిర్యాదుచేయగా, వారు బాలికల బృందంవారికి ఈ సహాయాన్ని యేర్పాటు చేశారు.

వాతావరణం బాగా లేనందువల్ల పర్వత శిఖరాన్ని చేరుకొనటంలో వారం రోజులు ఆలస్యమైందని బృందం నాయకురాలు జోయిస్‌డన్ షెచ్ తెలియజేశారు.

అదీగాక పర్వత శిఖరాన్ని అధిరోహించిన తరువాత ఈ బృందం సామాన్లు తీసుక వస్తున్నవారు మధ్యదారిలో వాటిని వదలి పెట్టిన కారణంగా మరొక వారం రోజులు ఆలస్యం అయింది.

హిమాలయ పర్వత శిఖరాలను అధిరోహించటానికి పూర్తిగా అందరు మహిళలే గల బృందం ప్రయత్నించటం ఇదే మొదటిసారి

భారత స్కౌట్స్ సమాఖ్యవారు దీనిని ఏర్పాటు చేశారు

జల, విద్యుత్ పథకాల సమన్వయ బోర్డు సమావేశం

తిరువనంతపురం, అక్టోబరు 21

విద్యుచ్ఛక్తి, ఇరిగేషన్ పథకాల సమన్వయ బోర్డు తొలి సమావేశం డాక్టర్ కె. యల్. రావు అధ్యక్షతన నేడిక్కడ ప్రారంభమైంది.

బెంగాల్, ఒరిస్సా, మైసూరు, మధ్య ప్రదేశ్, అస్సాంరాష్ట్రాలఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖామంత్రులు ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

వీరుగాక కేంద్ర జలవిద్యుత్ కమిషన్ అధ్యక్షుడు కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

సమావేశం ఎజెండాలో ఈ దిగువ అంశాలున్నాయి.

నదీ ప్రవాహ ప్రాంతాలలో భూసార పరిరక్షణ; పెద్ద, చిన్న, మధ్యరకం ఇరిగేషన్ ప్రాజెక్టుల పరస్పర వినియోగం, చిన్న మధ్యరకం ప్రాజెక్టుల పనిని త్వరితంచేయటం. ప్రాంతీయ గ్రిడ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాలలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమన్వయీకరణ.

ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికంచేయటం సమావేశం ముందున్న ప్రధాన అంశమని శ్రీకె. యల్.రావు చెప్పారు.

తాను లండన్‌లో జరుపనున్న చర్చల ఫలితంగా ఆసక్తిదాయకమయిన పరిణామాలు సంభవించగలవని బ్రిటిష్ గయానా ప్రధాని చెడీజగన్ అన్నారు.

పోప్‌పాల్ భారత పర్యటనపట్ల పోర్చుగల్ మంట

లిస్బన్, అక్టోబరు 21

పోప్ పాల్ డిశంబర్‌లో బొంబాయి సందర్శించడానికి నిర్ణయించుకోవటం పోర్చుగల్‌ను అవమాన పరచటమేనని పోర్చుగల్ విదేశాంగ మంత్రి అన్నారు.

ఈ విషయంలో మౌనంగా మా విచారాన్ని దిగమింగటానికి మేము నిర్ణయించుకున్నాం అన్నారు.

వోస్ఖోడ్ అంతరిక్ష నౌక సాధించిన ప్రయోజనం

పత్రికాగోష్ఠిలో వివరణ

మాస్కో, అక్టోబరు 21

తాను, మరో యిద్దరు సహచరులతో కలిసి గత వారం జరిపిన అంతరిక్ష యాత్రలో యుద్ధ ప్రయోజనాలకుగానీ, మానవజాతి మనుగడ, నాగరికతలకునష్టదాయకంగాపుద్దేశించిన అంశం గానీ యేదీలేదని, వోస్ఖోడ్ అంతరిక్షనౌకకు సారథ్యం వహించిన కర్నల్ కొమరోవ్ ఈ రోజు ఒక పత్రికా గోష్ఠిలో చెప్పారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

ముగ్గురు యాత్రికులున్న మా నౌక 24 గంటల పాటు భూమిచుట్టూ 16 సార్లు పరిభ్రమించి, 4 లక్షల 29 వేల మైళ్ళదూరం ప్రయాణం చేసి అతి ముఖ్యమైన శాస్త్రీయ సమాచారాన్ని సేకరించింది.

మా ముగ్గురిలో ఒకరు విశ్రాంతి తీసుకుంటూ వుండగా మిగతా యిద్దరమూ నౌకలో పనిచేస్తూ వుండేవారం.

మానౌకలో అమర్చిన పరికరాలన్నీ అత్యుత్తమంగా పని చేశాయి.

నక్షత్రమండలాన్ని చేరుకొనేటందుకు అవసరమైన సమాచారాన్ని మేము సేకరించ గలిగాము.

ప్రపంచ శాంతి మహాసభ ప్రతినిధులకు సూచన

నిడదవోలు, అక్టోబరు 21

ఆంధ్రప్రదేశ్ శాంతి సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. వి. ఎల్. ఎస్. రాజు ఢిల్లీలో వచ్చేనెల 14-18 తేదీలలో జరుగనున్న ప్రపంచ శాంతి - అంతర్జాతీయ సహకార మహాసభ ప్రతినిధుల ప్రయాణం ఏర్పాట్లు గురించి ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు:

"ఢిల్లీ మహాసభకు వెళ్లే ప్రతినిధుల ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లగురించి శాంతి సంఘం తరఫున రైల్వే అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకున్నాము. రిజర్వేషన్ ఖాయపరచుటకు ఢిల్లీకి వెళ్లే ప్రతినిధులు ముందుగా నిడదవోలు చిరునామాకు రు. 100/- పంపాలి. ఢిల్లీ సభకు వెళ్ళగోరే ప్రతినిధులు నవంబరు 1 వ తేదీ రాష్ట్ర మహాసభకు హాజరుకావాలి. డాక్టరు బి.వి.ఎల్.ఎస్. రాజు చిరునామా: కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ శాంతి సంఘం, నిడదవోలు. ప. గో. జిల్లా

కేంద్రగిడ్డంగులనుండి బియ్యం విడుదల

మద్రాసు, అక్టోబరు 21

రాష్ట్రంలో ఏర్పడిన ఆహార సంకటస్థితి తాత్కాలిక నివారణకోసం కేంద్ర ప్రభుత్వం తన గిడ్డంగులనుండి నేడు 10 వేల టన్నుల బియ్యం విడుదలచేసింది.

9 వేల టన్నుల బియ్యం మద్రాసు నగరానికి, మరో వేయిటన్నుల బియ్యం కోయంబత్తూరుకు పంపారు

ఎర్నాకులం, అక్టోబరు 21

గ్రామీణ విద్యుదీకరణ పథకాలనిర్మాణంలోనూ నిర్వహణలోనూ చాల ఎక్కువ పొదుపరితనాన్ని సాధించడానికి తగిన చర్యలను గురించి కేంద్ర ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి మంత్రిత్వశాఖ ఆలోచిస్తుంది.

కాంబోడియా గ్రామంపై ద. వియత్నాం విమానదాడి

7 గురి మృతి, పలువురికి గాయాలు

ప్నోంపెన్, అక్టోబరు 31

దక్షిణ వియత్నాంకు చెందిన మూడు సైనిక విమానాలు నిన్న ఒక కాంబోడియా గ్రామంపై బాంబులు, రాకెట్లతో దాడి చేసి 7 గురుని పొట్టపెట్టుకున్నాయి మరో 7 గురు పలువురు పిల్లలు, ఈ సందర్భంలో తీవ్రంగా గాయపడ్డారు.

ద. వియత్నాం విమానాల దాడికి గురయిన గ్రామం కాంపెన్‌ఛామ్ రాష్ట్రంలో వియత్నాం సరిహద్దుకు 3 మైళ్ళలోపలకాంబోడియావుంది. 4 ఇండ్లు పూర్తిగా ధ్వంసమయినాయి. మరో అయిదిండ్లకు నష్టం కల్గింది. అనేక పశువులు మృతి చెందాయి.

బాంబులు, మిసిలీలు కనీసం 14 అయినా ప్రయోగించ బడినాయని కాంబోడియా అధికార వర్గాలవా రన్నారు.

ఈ గ్రామాన్ని అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ రేపు వచ్చి చూస్తుంది.

వుయ్యూరు పట్టణ పార్టీ మహాసభ

వుయ్యూరు, అక్టోబరు 19

నిన్న వుయ్యూరు పట్టణ కమ్యూనిస్టుపార్టీ తృతీయమహాసభ శ్రీ యారా మోహనరావుగారి అధ్యక్షతను జరిగింది సమావేశానికి 46 మంది పార్టీ సభ్యులు హాజరైనారు. సమావేశంలో 1960 ఆగస్టులో జరిగిన రెండవ మహాసభ నాటినుండి నేటివరకు పట్టణకమిటీ కొనసాగించిన కార్యక్రమ సమీక్షను ఏకగ్రీవంగా ఆమోదించారు. తరువాత జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ పెనమకూరి కృష్ణమూర్తి జాతీయపరిస్థితులపై మునాయిదా కార్యక్రమం గురించి, పోటీపార్టీ నిర్మాణం, దాని విచ్ఛిన్న కారణాల గురించి వివరించారు.

సభలో యీ క్రింది తీర్మానాలు అంగీకరించబడినాయి.

1. కోయంబత్తూరు పోలీసులు చౌకడిపోల వద్ద బియ్యం కొరకుకూడిన ప్రజలపై కాల్పులు జరిపిన చర్యను ఖండించారు. ఈ అక్రమానికి పాల్పడ్డవారిని శిక్షించాలని కోరారు.
2. వుయ్యూరులో వెంటనే చౌకడిపోలు తెరవాలని ప్రభుత్వమును డిమాండుచేశారు.
3. పంచాయతీ అదనంగా విధించినపన్నుల విధానాన్ని నిరసిస్తూ పన్నులను తగ్గించాలని. యిందుకు రెంటుపేయర్సు అసోసియేషన్‌ను స్థాపించి కృషిచేయాలని తీర్మానించారు
4. పంచదార కుటుంబానికి 2½ కిలోలు యివ్వాలని తీర్మానించారు.

3 వ ప్రణాళిక మిగిలిన రెండేండ్లలో సాధారణ విద్యకు రు 9 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 21

మూడవ ప్రణాళిక మిగిలిన రెండు సంవత్సరాలకాలంలో సాధారణవిద్యకు రు 9 కోట్లు, సాంకేతిక విద్యకు రు 2 నుండి, 3 కోట్లు వ్యయం చేయడం జరుగుతుందని నేడిక్కడ అధికారయుతంగా తెలియజేశారు.

డిసెంబర్ నుండి రాజధానిలో ఆహార కార్డుల పద్ధతి రద్దు

హైద్రాబాద్ జిల్లాకలెక్టరు వెల్లడి

హైద్రాబాద్, అక్టోబరు, 21

డిసెంబర్ మాసంనుండి హైద్రాబాదు నగరంలో కార్డుల పద్ధతిపై ఆహార పంపిణీ పద్ధతి ఎత్తివేయడం జరుగుతుంది. అయితే ధర వరల పరిస్థితిని అదుపులో వుంచేటందుకు 2 వందల చౌక దుకాణాలు మాత్రం యథా ప్రకారం పని చేస్తుంటవని హైద్రాబాదు జిల్లా కలెక్టరు యీ రోజు పత్రికల వారికి తెలియజేశారు.

కార్డుల పద్ధతి రద్దు అనంతరం మామూలు వ్యాపారస్థులు రాష్ట్రంలో ఎక్కడ నుండైనా తమకు అవసరమైన స్టాకు కొనుగోలు చేయవచ్చు. ప్రభుత్వంద్వారాతప్పఇతర రాష్ట్రాలకు జరిపే ప్రయివేటు ఎగుమతులు నిషేధించబడిన దృష్ట్యా వారికి స్టాకు లభ్యం కావడంలో పెద్ద యిబ్బందేమీ వుండదు.

టోకు బియ్యం వర్తకుల సిండికేట్‌వద్ద ప్రస్తుతం వున్న 15 వేల క్వింటాల్స్ స్టాక్ ఖర్చుకాగానే వారు తమ ప్రస్తుత వ్యాపారాన్ని విరమించేస్తారు.

జంటనగరాలకు 75 వేల క్వింటాల్స్ బియ్యం అవసరం. ఈ మొత్తంలో 55 వేల క్వింటాల్స్ నిజామాబాద్‌నుండి, మరో 25 వేల క్వింటాల్స్ కరీంనగర్, మెదక్ జిల్లాలనుండి వచ్చే 1½ మాసంలో దిగుమతి అవుతాయి. కేంద్ర ప్రభుత్వ గోదాముల నుండి మరో 20 వేల క్వింటాల్స్ బియ్యం విడుదల చేస్తారు.

హోటళ్ళకు చక్కెర

హోటళ్ళకూ, కాన్ఫెక్షనరీ ఫ్యాక్టరీలకు యిచ్చే చక్కెర కోటాలో తగ్గించబడిన 15 శాతం యీ నెల 23 నుండి తిరిగి యివ్వడం జరుగుతుందని కూడా కలెక్టర్ వెల్లడించారు.

అత్యవసర పరిస్థితులలో విడుదల చేసేటందుకు కొంత చక్కెర నిల్వ వుండాలనే దృష్టితో యీ 15 శాతం కొరత అమలు జరుగుతూవుంది.

ఈ కొరతను వెంటనే ఉపసంహరించకపోతే తాము తమ వ్యాపారాన్ని పూర్తిగా నిలిపివేయాల్సి వస్తుందని, హోటల్ యజమానుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

భారత, ఆస్ట్రేలియాజట్ల క్రికెట్ పోటీ ఆపివేత

కలకత్తా, అక్టోబరు 22

భారత, ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న తృతీయ క్రికెట్ టెస్టు పోటీ ఆపివేయబడింది.

టెస్టు పోటీ కొనసాగించడానికి వీలులేని పరిస్థితిలో క్రికెట్ గ్రౌండ్ ఉన్నదని అధికారులు ప్రకటించారు.

తనను గనుక అమెరికా అధ్యక్షునిగా ఎన్నుకుంటే "బలం ద్వారా శాంతి లభిస్తుందనీ, జాన్సన్‌ని ఎన్నుకుంటే పరాజయం సిద్ధిస్తుందనీ గోల్డ్‌వాటర్ అన్నారు.

బొలీవియాలో పోలీసుల విద్యార్థుల మధ్య ఘర్షణ

ఒక విద్యార్థి దుర్మరణం

లాపాజ్, అక్టోబరు 21

బొలీవియాలో కోచబాంబా పట్టణంలో నేడు పోలీసులకు, విద్యార్థులకు మధ్య తీవ్ర సంఘర్షణలు జరిగినట్లు తెలుస్తుంది.

ఈ ఘర్షణకు కారణాలు తెలియటంలేదు ఈ ఘర్షణలో 17 సంవత్సరాల విద్యార్థి ఒకడు మరణించినట్లు లాపాజ్ కు వార్త అందింది. పోలీసు నగరంలోని ప్రధాన వీధుల్లో కాల్పులు జరిపిన సమయంలో ఈ విద్యార్థి పోలీసుల తుపాకీ గుండ్లకు బలైనట్లు తెలుస్తుంది. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులు గాయపడ్డారని వార్త తెలియజేస్తుంది.

సోవియట్ మౌలిక విధానాలు

ప్రావ్దా పునరుద్ఘాటన

మాస్కో, అక్టోబరు 21

శాంతియుత సహజీవనమే సోవియట్ విదేశాంగ విధానానికి మూలాధారం అంటూ, ప్రావ్దా నేడురాసిన సంపాదకీయంలో పునరుద్ఘాటించబడింది,

ఇదొక్కటే హేతుబద్ధమైన విధానం.

ఆయుధ పోటీ నివారణ, సమగ్ర సార్వత్రిక నిరాయుధీకరణ, ఐ. రా. స. ను పటిష్టం చేయడం, యూరపు భద్రతా సాధన యివే సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రభుత్వం ముందున్న తక్షణ లక్ష్యాలని ఆ సంపాదకీయం వివరించింది.

వివాదాస్పదమైన అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే మౌలిక విధానానికే సోవియట్ యూనియన్ అచంచలంగా కట్టుబడివుంది.

కమ్యూనిస్టుపార్టీల సభ

మహత్తరమైన సోషలిస్టుజాతుల కుటుంబంలో సమైక్యతా సాధనకోసం, సౌభ్రాతృత్వ పూర్వక మైత్రిని సాధించే కోసం ప్రపంచ మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల సభను జరిపించేటందుకు సోవియట్ కమ్యూనిస్టుపార్టీ చురుకుగా కృషి చేస్తుంది. కమ్యూనిజం నిర్మాణం, ప్రజల సంక్షేమ సాధన, వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చడం కంటే మహోన్నతమైన కర్తవ్యం మరొకటి ఉండజాలదని సోవియట్ కమ్యూనిస్టుపార్టీ విశ్వసిస్తూవుంది' అని ప్రావ్దా రాసింది.

సిరిమావో

(1 వ పేజీ తరువాయి)

కొనిపోతున్నది"అంటూ సింహళ దినపత్రికలు నేడు వార్తలు ప్రచురించాయి.

శ్రీమతి సిరిమావో ఈ నెల 2 వ తేదీన కైరో బయలుదేరి వెళ్ళడానికి పూర్వం సింహళంలోని ప్రతిపక్షపార్టీల నాయకులను కలుసుకొని భారతీయుల భవిష్యంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకొన్నారు.

తొలివార్తలు

లండన్, అక్టోబరు 21

సిరిమావో భారత్‌కు ప్రయాణించే విమానంలో బాంబు పెట్టారని సమాచారం అందిన మూలంగా విమానాన్ని పోలీసులు సోదాచూసి, ఎలాంటి ఉపద్రవం కల్గించేదేమీ లేదని నిర్ధారించిన తరువాత దాదాపు 5 గంటల ఆలస్యంగా ఆ విమానం లండన్ విమానాశ్రయం నుండి బయలు దేరింది.

లండన్‌లోని బౌద్ధ విహారంలో ప్రతిష్ఠించే నిమిత్తం బుద్ధుని అవశేషాన్ని తీసుకొని శ్రీమతి బండారనాయికే ఈనెల 13 వ తేదీన ఇక్కడికి వచ్చారు.

సోమవారంనాడు ఒకవిందు సందర్భంలో శ్రీమతి సిరిమావో బ్రిటన్ లేబర్ పార్టీ ప్రధాని విల్సన్‌ను కలుసుకున్నది. విల్సన్ ప్రధాని అయిన తరువాత ఆయనను ప్రప్రథమంగా కలుసుకొన్న కామన్వెల్తు దేశాల ప్రధాన మంత్రి ఈమే.

శ్రీమతి సిరిమావో ప్రయాణిస్తున్న 707 బోయింగ్ జెట్‌విమానం విమానాశ్రయం నుండి బయలుదేరిన 5 నిమిషాలకే ఆ విమానంలో బాంబు నాటబడిందని ఆవిమానాశ్రయాధికారులకు టెలిఫోన్ ద్వారా వర్తమానం అందింది.

వారు విమానాన్ని వెంటనే త్రిప్పి తీసుకురావలసినదిగా వైమానికునికి ఉత్తర్వుచేశారు. ఈ సమయంలో ఆమె విమానంలోని ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులో విశ్రాంతి తీసుకుంటూ వున్నారు. విమానం క్రిందికి దిగడంతోనే వైమానికాధికారులు, పోలీసులు లోనప్రవేశించి జాగ్రత్తగా పరిశీలన జరిపారు.

ఈ విమానంలో ఈమె గాక మరో 40 మంది కూడా ప్రయాణిస్తున్నారు. ఏవో స్వల్పమైన సాంకేతిక లోపాలు ఉన్నందున విమానాన్ని తిరిగి లండన్ విమానాశ్రయానికి తీసుకెళ్ళ వలసి వచ్చిందని వైమానికుడు తమతో చెప్పినట్లు వారు తెలియజేశారు.

సిరిమావోతో ప్రధాని చర్చనీయాంశాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 21

సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావో ఇక్కడికి వస్తున్న సందర్భంలో ఆమెతో చర్చించవలసిన అంశాలపై ప్రధానమంత్రి శ్రీ శాస్త్రి నేడిక్కడ తన మంత్రివర్గ సహచరులతోనూ మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ భక్తవత్సలంతోను చర్చలు జరిపారు.

హోమ్ మంత్రి నందా, ఆర్థిక మంత్రి కృష్ణమాచారి, విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్, మద్రాసు మంత్రి శ్రీ వి రామయ్య కామన్వెల్తు వ్యవహారాల కార్యదర్శి వి. ఎస్ ఝా ఈ చర్చలలో పాల్గొన్నారు.

సింహళంలో ఉన్న భారతీయుల సమస్యను గురించి శ్రీ శాస్త్రి, శ్రీమతి సిరిమావోతో వివరంగా చర్చించగలరని తెలుస్తున్నది. దాదాపు 8 లక్షలమంది సింహళంలో పౌరసత్వం లేని భారతీయులు ఉన్నారని అంచనా.

ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి కొన్ని చిక్కులు ఉన్నప్పటికీ శాస్త్రి సిరిమావోల సంభాషణ మూలంగాఈ సమస్య గురించి ఉభయులూ సమ్యగవగాహనకు రాగలరని భావిస్తున్నారు.

బ్రస్సెల్స్‌లో సమావేశమవుతూ వున్న యూరప్ కామన్ మార్కెట్ వ్యవసాయ మంత్రుల సమావేశం నవంబరు 16, 17 కి వాయిదా పడింది.

రెండవపంట పట్ల కేంద్రం శ్రద్ధ

న్యూఢిల్లీ, అక్టోబరు 21

రెండవపంటలో ఉత్పత్తిని పెంచడం విషయమై కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. కొన్నాళ్ళక్రితం ప్రధాని శాస్త్రి రాష్ట్ర ముఖ్యమంత్రు లందరికీ ఉత్తరాలు వ్రాశారు.

టెండరు నోటీసు

ఆంధ్ర యూనివర్శిటీ

1966 సం॥ పరీక్షకుగాను యస్. యస్. యల్. సి. పాఠ్యపుస్తకాలు ఉర్దూలో ముద్రించడానికి, రిజిష్ట్రార్, ఆంధ్ర యూనివర్శిటీ, వాల్తేరు వారిచే 7-11-64వ తేదీ సాయంత్రం 4 గంటలవరకు సీలువేసిన టెండర్లు స్వీకరించ బడును. ఇతర వివరములకు రిజిష్ట్రారుకు దరఖాస్తు చేయండి.

ఎ. ఎస్. సీతారామయ్య,
అసిస్టెంటు రిజిష్ట్రార్
(ఎక్కౌంట్స్), యూనివర్శిటీ ఆఫీసు,
వాల్తేరు, 19-10-64.

టెండరు నోటీసు

ఆంధ్ర యూనివర్శిటీ

కొత్త కెమిస్ట్రీ భవనానికి, ఎల్. టి. ఓవర్ హెడ్‌లైన్ ఎక్స్‌టెన్షన్ ఏర్పాటుచేయడానికి, రిజిష్ట్రార్, ఆంధ్ర యూనివర్శిటీ, వాల్తేరువారిచే 6-11-64 వ తేదీ సాయంత్రం 4 గంటలవరకు సీలువేసిన టెండర్లు స్వీకరించబడును.

దరఖాస్తుతోపాటు రు. 4 లు పంపిన రిజిష్ట్రార్‌నుండి షెడ్యూల్సు, మరియు స్పెసిఫికేషన్లు పొందవచ్చును.

ఎ. ఎస్. సీతారామయ్య,
అసిస్టెంట్ రిజిష్ట్రార్
(ఎక్కౌంట్స్), యూనివర్శిటీ ఆఫీసు,
వాల్తేరు, 14-10-64.

కనిపించుటలేదు

రు. 116/- లు బహుమతి



దేవరకొండ శ్రీరామచంద్రమూర్తి. వయస్సు 24 సం॥లు. ఎత్తు 5' - 4''. తెలుపు రంగు. పై గుర్తులుగల వానిని ఈ దిగువ అడ్రస్‌కు అప్పగించిన రు. 116/-లు బహుమతి ఇవ్వబడును.

కె. సుబ్బారావు,
C/o పి. వి. సుబ్బారావు, డ్రైవిస్టు.
కొవ్వూరు - ప. గో. జిల్లా.

శాంతియుత సహజీవన సూత్రానికి అమెరికా విముఖత

పారిస్, అక్టోబరు 21

శాంతియుత సహజీవనమనే సూత్రాన్ని కొన్ని రాజ్యాల వారు తమ సిద్ధాంతాల ప్రచారానికోసం ప్రవేశపెడుతున్నారు. శాంతియుత సహజీవన మంటే "స్థిరపడివున్న ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు" వ్యతిరేకంగా విధ్వంసక చర్యలు అనుమతించడమే నంటూ యునెస్కో నేటి సమావేశంలో అమెరికా ప్రతినిధి బెంటూన్ వాదించాడు.

అణ్వస్త్రాల నిర్మూలన

జాన్సన్‌కు చైనా ప్రధాని లేఖ

వాషింగ్టన్, అక్టోబరు 21

అణ్వస్త్రాల నిర్మూలన సమస్యను చర్చించేటందుకు అగ్రనాయకుల స్థాయిలో అంతర్జాతీయ శిఖరాగ్రసభ జరగాలంటూ, చైనా ప్రజా రిపబ్లిక్ ప్రధాని చౌ-ఎన్-లాయ్ రాసిన ఒక లేఖ నేడు అమెరికా అధ్యక్షునికి చేరింది.

యునెస్కో అధ్యక్షుడుగా సోవియట్ శాస్త్రవేత్త ఎన్నిక

పారిస్, అక్టోబరు 21

ఐరాస విద్యా, వైజ్ఞానిక సాంస్కృతిక వ్యవహారాల సంస్థ (యునెస్కో) అధ్యక్షుడుగా సోవియట్ ప్రతినిధి నోరియార్ మార్టిరోస్సోరిచ్ సిస్సాకిన్ ఎన్నికైనారు. ఈయన ఒక ప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త. యునెస్కో మహాసభలకు సోషలిస్టు శిబిరం ప్రతినిధి అధ్యక్షుడుగా ఎన్నికకావడం యిదే తొలిసారి.

అంటు వ్యాధుల నివారణకు కృషి

ఆరోగ్య వ్యవహారాల మండలిలో సుశీలానయ్యార్ ప్రసంగం

శ్రీనగర్, అక్టోబరు 21

అంటువ్యాధుల నివారణకూ, మంచినీటి సరఫరా, మురుగు కాల్వల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సుశీలానయ్యర్ నేడిక్కడ అన్నారు.

ఆరోగ్య వ్యవహారాల కేంద్ర మండలి సమావేశంలో ఆవిడ ప్రసంగిస్తూ 4 వ ప్రణాళికలో ఇందుకు ఎక్కువ కేటాయించాలని చెప్పారు. మూడవ ప్రణాళికలో మంచినీటి సరఫరా, మురుగు కాల్వలపథకానికి 850 కోట్లు కేటాయించితే 4వ ప్రణాళికలో 340 కోట్లు కేటాయించారనీ, దేశావసరాలలో ఇది నాల్గవవంతని అన్నారు తగు మొత్తాలు ఇందుకు కేటాయించకపోతే ఆరోగ్యకరమైన జీవనం గడపటం సాధ్యంకాదని చెప్పారు.

4 వ ప్రణాళికలో ఆరోగ్య పథకాలకు కేటాయించిన 1080 కోట్లు 50 శాతం అవసరాలనే తీర్చడానికి చాలతాయని అన్నారు.

ఈ సమావేశానికి ఆంధ్ర, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మద్రాసు, బెంగాల్, మైసూరు, గుజరాత్, మహారాష్ట్ర, మణిపూర్, పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రులు హాజరయ్యారు.

కేరళ గవర్నరు శ్రీ వి. వి. గిరి జాతీయాభివృద్ధి కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్ళారు.



POLYOT
Made in USSR

The Polyot watch means accuracy, beauty and elegance

V/O MASHPRIBORINTORG exports elegant men's and women's wrist watches of various types and models among them there are waterproof shockprotected watches with a calendar automatic self winding movement and a signal device

ON RUPEE PAYMENT

TRADE REPRESENTATION OF THE USSR IN INDIA

New Delhi
Nyaya Marg Chanakyapuri

Calcutta
1 Bishop Lefroy Road

Madras
50 A St Mary's Road Alwarpet

Bombay
46 Pedder Road

Admark

నిస్వార్థ సంఘ సేవాపరాయణ

డాక్టర్ అచ్చమాంబకు విజయవాడ ప్రముఖుల జోహార్లు

విజయవాడ, అక్టోబరు 21

నేటి సాయంత్రం మాంటిస్సోరి పాఠశాలలో జరిగిన సంతాపసభలో డా॥ అచ్చమాంబకు పలువురు నగరప్రముఖులు జోహారులర్పించారు.

ఈ సంతాపసభకు డా. వెంపటి సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. డా. అచ్చమాంబ శక్తి సామర్ధ్యాలుగల వ్యక్తిత్వం గలిగిన స్త్రీ అని శ్రీ సూర్యనారాయణ ప్రశంసించారు.

శ్రీమతి హేమలత లవణం, అచ్చమాంబ మరణానికి విచారాన్ని వ్యక్తం చేస్తూ ఒక గీతాన్ని వినిపించారు.

శ్రీ డి. శేషాద్రిశాస్త్రి, శ్రీ కొన్నలగడ్డ రామలింగయ్య, శ్రీ పి. సి. శేషాపతి, శ్రీమతి గోపరాజు సరస్వతి, శ్రీమతి జె. మైత్రి, శ్రీమతి అయ్యదేవర బాలాత్రిపురసుందరమ్మ, శ్రీ బి. సుబ్బారావు, శ్రీమతి అల్లూరి హైమావతి, శ్రీ ఎ. వి. కృష్ణారావు, శ్రీ కె. దామోదరయ్య, శ్రీ యల్. చిరంజీవిరావు, శ్రీ కె. రామకోటేశ్వరరావు, శ్రీమతి సుగుణ డా॥ అచ్చమాంబ సంఘసేవాపరాయణత్వాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

పట్టణ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శ్రీ జి. యస్. రాజు మాంటిస్సోరి పాఠశాలకు డా॥ అచ్చమాంబ పేరు పెట్టాలని సూచించారు.

డా. అచ్చమాంబ స్మృతిచిహ్నాన్ని నెలకొల్పటానికి ఈ పాఠశాల ఎంతో తగిన ప్రదేశమని డా. టి. వి. యస్. చలపతిరావు ఎం. ఎల్. ఎ. అన్నారు. వివిధ రంగాలలో ఆమె కావించిన కృషిని శ్రీ నార్ల ప్రస్తావించారు. ఆమె తో కమ్యూనిస్టులకు రాజకీయ విభేదాలున్నప్పటికీ, ఆమె కావించిన స్త్రీ జనాభ్యుదయం కమ్యూనిస్టుల గౌరవాభిమానాలను చూరగొన్నదని విశాలాంధ్ర ప్రధాన సంపాదకుడు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు అన్నారు. పాఠశాలలో డా. అచ్చమాంబ పేరిటస్మృతిచిహ్నాన్ని నెలకొల్పే విషయమై శ్రీయుతులు గోరా, గొట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రసంగించారు.

పాఠశాలలోని ప్రతి వస్తువు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు డా॥ అచ్చమాంబను అనుక్షణం జ్ఞప్తికి తెస్తున్నాయని ఈ సంస్థ డా॥ అచ్చమాంబకు ఎంతో ఋణపడి ఉన్నదని పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి వి. కోటేశ్వరమ్మ అన్నారు.

శాసనసభ్యులు శ్రీ వావిలాల ప్రసంగిస్తూ, డా॥ అచ్చమాంబ మానవత మూర్తీభవించిన ఉత్తమ వ్యక్తి అని ఉద్వేగంతో అన్నారు.

డా. అచ్చమాంబ స్మృతి చిహ్నాన్ని పాఠశాలలో నెలకొల్పేందుకు రు 500/- విరాళాన్ని డా. సూర్యనారాయణ ప్రకటించారు.

కేంద్ర ఉక్కు, గనులశాఖ మంత్రి శ్రీ యన్. సంజీవరెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మాత్యులు శ్రీ ఆలపాటి వెంకట్రామయ్యలు గుంటూరువెళ్తూ, డా. అచ్చమాంబ నివాస గృహానికివెళ్ళి అచ్చమాంబ మరణంపట్ల తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

విజయవాడ మెడికల్ అసోసియేషన్, రామమోహన్ లైబ్రరీ, రీడింగ్ రూమ్ మేనేజింగ్ కమిటీ డా॥ అచ్చమాంబ మరణం పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ తీర్మానం చేశారు.

డా॥ వెలిదండ్ల హనుమంతరాయ వర్ధంతి ఉత్సవాల మొదటిరోజు కార్యక్రమాలు రద్దు చేయబడ్డాయి.

అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల బహుమతులు

నెమలి ప్రతిమ ఇవ్వడానికి ప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 21

జనవరిలో జరిగే అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో బహుమతులుగా భారత ప్రభుత్వం నృత్యంచేస్తున్న నెమలి ప్రతిమలను ఇవ్వడానికి నిశ్చయించింది.

నెమలి జాతీయ విహంగమైన విషయం పాఠకులకు విదితమే.

ఈ చిత్రోత్సవాలలో ఉత్తమ చిత్రాలుగా రెండుఎన్నికైనచలనచిత్రానికి, వార్తాచిత్రానికి బంగారుప్రతిమలను, ఉత్తమనటుడు, ఉత్తమ నటిగా ఎన్నికైనవారికి వెండి ప్రతిమలను బహూకరిస్తారు.

జ్యూరీలు ఎన్నికచేసిన చలనచిత్రాలకు 5 కంచు ప్రతిమలను బహూకరిస్తారు.

నెమలిచిహ్నంతో ఈ బహుమతులను జయపూరు పనివారు చేస్తూవున్నారు.

మద్రాసులో భూసార పరిశోధనా కేంద్రాలు

జిల్లాకొకటి నెలకొల్పనున్నట్లు మంత్రి ప్రకటన

మద్రాసు, అక్టోబరు 21

మద్రాసు రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ భూసార పరిశోధనా కేంద్రాలను స్థాపించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీ వెంకట్రామన్ నేడు రాష్ట్ర శాసన సభలో తెలియజేశారు.

గ్రామాల అభివృద్ధి పథకాలకు తుదిరూపం యివ్వడం జరిగిందని వీటిని త్వరలోనే అమలు పర్చడం జరుగుతుందని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని 7 వందల ఎస్టేట్లలో కేవలం ఏడింటిని మాత్రమే పారిశ్రామిక వేత్తలకు కేటాయించడం జరిగిందని, పారిశ్రామిక వేత్తలు అనుసరించే ఆధునిక సాంకేతిక పద్ధతులు చిన్న పరిశ్రమల వారికి ఆదర్శంగా ఉపకరిస్తాయన్నారు.

రాష్ట్రంలో జింకురేకుల కొరత ఉన్నందు మూలంగా వీటి పంపకాన్ని క్రమబద్ధం చేయడానికి ఒక విధమైన కంట్రోలు ప్రవేశపెట్టడం అవసరమౌతుందని చెప్పారు.

హరిజన హాస్టళ్లు

ప్రస్తుతం రాష్ట్రంలోఉన్న మూడువందల హరిజన హాస్టళ్ళు గాక మరో 20 హాస్టళ్ళను కూడా నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న నీటిపారుదల వనరులన్నింటినీ ఉపయోగించుకొనడం జరుగుతుందని చెప్పారు.

మద్రాసురాష్ట్ర ఆహార పరిస్థితిపై ప్రధానితో ముఖ్యమంత్రి చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబరు 21

మద్రాసు రాష్ట్రంలో తీవ్రతరమౌతున్న ఆహార పరిస్థితిపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ యం. భక్తవత్సలం ప్రధానమంత్రిశాస్త్రితో నేడిక్కడ చర్చలు జరిపారు.

మద్రాసు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇదివరకే బియ్యాన్ని కేటాయించడంజరిగింది. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అదనపు సహాయాన్ని చేయాలనే సమస్యపై చర్చలు సాగినట్లు తెలుస్తుంది.

శ్రీ భక్తవత్సలం కేంద్ర హోంమంత్రి శ్రీ నందాను కూడా కల్సుకొని చర్చలు జరిపారు.

మంగళగిరిలో కలరా; 5 గురి మృతి

మంగళగిరి, అక్టోబరు 20

గుంటూరుజిల్లా మంగళగిరి 7 వ వార్డులో మొన్న సాయంత్రంనుండి నిన్నరాత్రివరకు కలరా సోకినందువల్ల అయిదుగురు మరణించారు.

ఒకే కుటుంబంలోని 11, 8 సంవత్సరాల ఆడపిల్లలు యిద్దరూ, ఈ పిల్లల తండ్రి కొణతాల వెంకయ్య, ఒక ముసలమ్మ మరణించారు.

పై అయిదుగురులో ఒకరు గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్చిన వెంటనే మరణించారు. ఇవాళ గవర్నమెంటు ఆసుపత్రి అంటురోగుల వార్డులో ముగ్గురు కలరా రోగులను చేర్చారు. (వి. వి.)

పెద్దపవని హైస్కూల్ భవనం నేలమట్టం

పెదపవని, అక్టోబరు 22

నెల్లూరుజిల్లా, పెద్దపవని బలేరావుజిల్లా పరిషత్ హైస్కూల్ 19 వ తేదీన నేలమట్టం అయింది.

ఆ రోజున సాయంత్రం 6 గంటలకు రెండు అంతస్థులుగల ఈ భవనం కూలిపోయింది. హైస్కూలు వదిలిన తరువాత ఈ ప్రమాదము సంభవించినది. ఎవరికీ ఎట్టిప్రాణాపాయము జరుగలేదు.

భారతదేశంలో ఉత్పత్తిఅయ్యే నల్ల టీకి జపాన్‌లో మంచి మార్కెట్ ఉన్నదని జపాన్ పత్రికా ప్రముఖుడు ఇచాకురా అన్నారు.

సమితి సాంస్కృతిక సంస్థలో చైనా సభ్యత్వ సమస్య

ఓటింగ్‌లో పాల్గొనకుండా ముఖం తప్పించిన ఫ్రాన్స్

పారిస్, అక్టోబరు 22

ఐక్యరాజ్యసమితి సాంస్కృతిక సంస్థలో చైనా ప్రజా రిపబ్లిక్‌కు సభ్యత్వం ఒసగాలని కోరుతూ సోవియట్ యూనియన్ ఐరాస సాంస్కృతిక సంస్థ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించిన తీర్మానం 35-50 ఓట్లతో వీగిపోయింది.

ఈతీర్మానానికి అనుకూలంగా భారతదేశం, అరబ్‌దేశాలు, క్యూబా, సోషలిస్టుదేశాలు ఓటు చేశాయి.

చైనా ప్రజా రిపబ్లిక్‌తో గత జనవరిలో దౌత్య సంబంధాలు పెట్టుకొన్న ఫ్రాన్స్ మాత్రం ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయలేదు. ఓటింగ్‌లో పాల్గొనకుండా మానుకొన్నది.

సమితిలో చైనాకు సభ్యత్వం ఒసగవలసిన అవసరాన్ని ఉద్ఘాటిస్తూ భారత విద్యామంత్రి శ్రీ చాగ్లా చేసిన ప్రసంగాన్ని 'విశాలాంధ్ర'లో నిన్ననే ప్రకటించిన సంగతి పాఠకులకు విదితమే.

ఢిల్లీలో తెలుగు కవికి సన్మానం

న్యూఢిల్లీ, అక్టోబరు 21

సుప్రసిద్ధ తెలుగుకవి శ్రీ శంకరంబాడి సుందరాచారిగారిని స్థానిక ఆంధ్రసంఘం సన్మానించింది.

కేంద్ర కార్మికమంత్రి శ్రీ డి. సంజీవయ్య, కవిగారికి 575 రూ. పర్సు బహూకరించారు.

వినుకొండలో కలరా ముగ్గురి మృతి

వినుకొండ, అక్టోబరు 21

గుంటూరుజిల్లా, వినుకొండ గ్రామంలో గత అయిదు రోజులనుండి కలరా వ్యాపించింది. షుమారు 20 మందికి తగిలింది. అందులో ముగ్గురు మరణించారు, ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చిన కలరా రోగులకు కూడా సరియయిన మందులులేకపోవడమేకాక, కనీసంవసతికూడా లేదు. వినుకొండ పంచాయతీ బోర్డు హెల్తు స్టాఫ్, స్థానిక డాక్టర్లు వెంటనే తగు శ్రద్ధ తీసుకొని గ్రామమంతా ఇంజక్షన్లు చేసినారు.

ఎయిర్‌మార్షల్ అర్జున్‌సింగ్

నాగపూర్, అక్టోబరు 21

భారత వైమానిక సైన్యాధిపతి ఎయిర్ మార్షల్ అర్జున్‌సింగ్ నేడిక్కడకు వచ్చారు. ఆయన ఇక్కడ రెండురోజులు వుంటారు.

యూరప్ ఉమ్మడి మార్కెట్: డిగోల్ బెదిరింపు

పారిస్, అక్టోబరు 21

ముందుగా అంగీకరించిన ప్రకారం వ్యవసాయసరుకుల ఉమ్మడి మార్కెట్టును సాగించకపోతే ఫ్రాన్సు యూరోపియను ఉమ్మడి మార్కెటునుండి వైదొలగుతుందని ఫ్రెంచి మంత్రివర్గ సమావేశంలో అధ్యక్షుడు డిగాల్ చెప్పినట్లు ఫ్రెంచి సమాచారశాఖ మంత్రి నేడిక్కడ పత్రికా విలేకరుల సమావేశంలో తెలియజేశారు.

వ్యవసాయ సరుకుల వ్యాపారానికి సంబంధించిన ఉమ్మడిమార్కెట్టు స్థాపించే విషయంలో బ్రస్సెల్సులో జరుగుతున్న సంప్రదింపులలో ప్రతిష్టంభన ఏర్పడిన విషయాన్నిగురించి గత రాత్రి ఇక్కడికి తిరిగివచ్చిన ఫ్రెంచి వ్యవసాయమంత్రి మంత్రివర్గానికి తెలియజేశారు.

యూరోపియన్ వాణిజ్యవర్గం సంఘటితం కానిదే అమెరికాతో జయప్రదంగా సంప్రదింపులు సాగించడం సాధ్యంకాదని కూడా ఆయన అన్నారు.

పశ్చిమ జర్మనీ ప్రకటన

బాన్, అక్టోబరు 21

వ్యవసాయ మార్కెటు సమస్యపై ఫ్రాన్సు ఉమ్మడి మార్కెటునుండి వైదొలగే పక్షంలో డిగాల్ తనకుతానై నష్టం కొనితెచ్చుకొంటాడని పశ్చిమజర్మనీ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రతినిధి నేడిక్కడ అన్నారు.

దుస్తుల ఎగుమతికి కార్పొరేషన్ ఏర్పాటు

శ్రీ మనూభాయిషా వెల్లడి

బొంబాయి, అక్టోబరు 21

నూలుతోకాక, ఇతరమైన దారంతో తయారుచేయబడిన దుస్తులను ఎగుమతి చేసేందుకు త్వరలో ఒక కార్పొరేషన్‌ను నెలకొల్పాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

పట్టువస్త్రాల పరిశోధనా సంస్థ పట్టు, రేయాన్ వస్త్రాల ఎగుమతి అభివృద్ధి సమితి సభ్యుల సమావేశంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి శ్రీ మనూభాయిషా ఈ విషయాన్ని తెలియజేశారు.

విదేశాలకు భారతదేశ దుస్తులు ఎగుమతి చేయటానికి చక్కని అవకాశాలు కన్పడుతున్నాయని మంత్రి అన్నారు. ధర, నాణ్యం విషయాలలో భారతదేశ దుస్తులు ఇతర తూర్పు దేశాలతో పోటీ చేయగలవని శ్రీ మనూభాయిషా తెల్పారు.

సేలంలో చౌకడిపోల కొరకు ఆందోళన

సేలం, అక్టోబరు 21

సేలం మున్సిపల్ కౌన్సిల్‌లోని ద్రవిడ మున్నేట్రకజగం సభ్యులందరూ నేడు ఊరేగింపుగా కలెక్టరు వద్దకువెళ్ళి సేలంలో ఇంకా ఎక్కువ చౌక డిపోలు పెట్టాలని కోరుతూ మెమొరాండం సమర్పించారు. బియ్యం విరివిగా సరఫరా చేయాలని వారు కోరారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ కౌన్సిలర్లుకూడా కలెక్టరుకు ఒక మెమొరాండం సమర్పించారు.

20 దినాలుగా మంచినీటికి నోచుకోని రాయచూర్ ప్రజలు

వరదలకు నీటిగొట్టాలు కొట్టుకుపోయిన ఫలితంగా నగరప్రజల దుర్భరస్థితి

రాయచూర్, అక్టోబరు 21

భారీ వర్షాల మూలంగా యెగ్గానస్ హళ్ళీ నది వద్దనిర్మించబడిన నీటిగొట్టాలు వరదలలోకొట్టుకొని పోవటంతో గత 20 దినాలుగా త్రాగేనీరు లేక రాయచూర్ ప్రజలు నానా ఇబ్బందులకు గురౌతున్నారు.

నది మీదున్న వంతెన మీదుగా 500 అడుగుల పొడవు గల నీటి గొట్టాన్ని వేయటానికి స్థానిక పురపాలకసంఘం పబ్లిక్ వర్క్సుశాఖకు పని వప్పగించింది.

ఈ నీటిగొట్ట నిర్మాణం పని ప్రారంభింపబడినప్పటికీ, ఇంకా 10, 15 రోజుల వరకూ రాయచూర్ ప్రజలకు నీటి సరఫరా పునరుద్ధరింపబడదని తెలుస్తోంది.

రాయచూరు నగరంలో పెక్కు పేటలలో బంక విరోచనాలు, రక్త విరోచనాల జాడ్యాలు కన్పడుతున్నాయని వార్త. నగరంలోని పౌర ఆస్పత్రిలో కలరావ్యాధి సోకిన పెక్కు మంది చేర్చబడినట్లు వార్తలు వచ్చాయి.

దోమలబాధ అధికంగా ఉందని, పట్టణ పరిశుభ్రత నానాటికి క్షీణిస్తున్నదని అధికారులు చెప్తున్నారు.

మాస్కోలో భారత నౌకాధిపతి

మాస్కో, అక్టోబరు 21

భారత పతాక నౌక "మైసూర్" అధిపతి రియర్ అడ్మిరల్ శామ్సన్ ఈవేళమాస్కోలో సోవియట్ నౌకా సర్వసైన్యాధిపతి గోర్షకోవ్‌ని కలుసుకొన్నారు. ఆ తరువాత ఆయన క్రెమ్లిన్‌లో ఆయుధ ప్రదర్శనశాలను చూశారు. గోర్షకోవ్ శామ్సన్ గౌరవార్థం విందు చేశారు. సోవియట్‌లో సౌహార్ద పర్యటన గావిస్తున్న "మైసూర్" సిబ్బంది ఒడెసా నుండి నిన్న మాస్కో వచ్చారు.

వేలూరు మునిసిపల్ కౌన్సిల్ ప్రతినిధివర్గమొకటి జిల్లా కలెక్టరుని కలుసుకొని తిండి గింజలకై ప్రజల కటకటను వివరించారు.



DBN PRODUCTIONS
డి.బి.ఎన్ వారి
దాగుడుమూతలు
నిర్మాత డి.బి.నారాయణ • దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
మాటలు ముళ్ళపూడి వెంకటరమణ • సంగీతం కె.వి.మహదేవన్
10 వారం



13 వ వారం
శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ వారి
అగ్గి పిడుగు
నిర్మాత-దర్శకుడు విఠలాచార్య
పూర్ణా రిలీజ్
NAVRANG

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షుడు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్. అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-4